# మార్పు 1

దాదాపు నాలుగు నెలలయిపోయింది మంచి కథ రాద్దాం అనుకుంటూనే. ఏదో రాయాలనే కానీ ఏం రాయాలన్నది తెలీడం లేదు. అంచేత నాకు తోచిందంతా రాసేద్దాం అనుకుని మొదలు పెట్టేనిది. ఇది నవల కాకపోవచ్చు. ఈమధ్య ఊసుపోక కూడా అట్టే సాగడంలేదు. అంచేత దానికి ఇది మరో రూపం అన్నా తప్పు లేదు. దేశం ఆమూలనించి ఈమూలకి వచ్చి పడ్డాక, అమెరికా మరోసారి కొత్తగా కనుగొన్నట్టుంది! అంచేత అదే రాయానుకుని మొదలు పెడుతున్నాను.

ఇది దేన్నిగురించి అంటే **మార్పుగురించే** … మనలో, మన పరిసరాల్లో, మాటతీరులో, ఆశల్లో, ఆశయాల్లో … మార్పు. ఎలా వస్తుంది, ఎందుకు వస్తుంది అన్న ప్రశ్నకి సమాధానం వెతుక్కుంటూ …☺. )

**గమనిక లేదా హెచ్చరిక** అనుకోండి. ఇక్కడినించీ అనేక రకాల చర్చలు కనిపిస్తాయి. అంతమాత్రాన ఈ మార్పు కర్త చాలా చదువుకున్నదని కానీ ఉద్దండ పండితురాలని గానీ అనుకుంటే పొరపాటు. ఇక్కడ ప్రవచించే ధర్మసూత్రాలూ ప్రాపంచిక విషయాలూ వారూ వీరూ చెప్పగా విన్నవీ, అక్కడక్కడా కనిపించినవీ, అంతర్జాలంలో పట్టుకున్నవీ మాత్రమే. అంతేగానీ సందర్భానుసారంగా ఉదహరించిన ఈ బృహద్గ్రంథాలన్నీ కూలంకషంగా చదివి, క్షుణ్ణంగా పరిశీలించి, ఆకళించుకున్నవి కావు.

పోతే, ఇలా కూడా ఘనాపాఠీ పండితులుగా చెల్లడానికి అవకాశం ఉందన్న నీతిని సూచించడం అన్యాపదేశంగా జరిగిఉండవచ్చు. ఏ ఒక్కరినో హేళన చేసే దురుద్దేశ్యం ఏమాత్రమూ లేదని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

-- ఇట్లు,

నిడదవోలు మాలతి.

ooo

“ఇప్పుడెందుకండీ మారడం? డెబ్బై ఏళ్ళొచ్చినా స్థిరత్వం లేదూ,” అంది నాస్నేహితురాలు నవ్వుతూ.

నేను “ఊరు మారుదాం అనుకుంటున్నా,” అన్ననేరానికి.

“హీ, హీ,” అన్నాను.

మరేమనను? నిజమే మరి. ఇప్పుడెందుకన్న ప్రశ్న ఎప్పుడయినా అడగొచ్చు. ముప్పై ఏళ్లనాడు మారతానంటే మాత్రం ఎందుకని అడక్కుండా ఉంటారా ఎవరు మాత్రం?

అసలు నేనెందుకు మారాలనుకున్నానో చెప్పేముందు, ఇది ఎందుకు రాస్తున్నానో చెప్తాను. లేదా చెప్పడానికి ప్రయత్నిస్తాను. ఇది నవల అనిపించుకోదు. ఇందులో గొప్ప సంఘర్షణలూ, సందేశాలూ ఉండకపోవచ్చు. ఇందులో వ్యంగ్యం లేదు. హాస్యం ఉంటుందేమో ఇప్పుడే చెప్పలేను. ఒక్కమాటలో ఇది ఎలా తయారవుతుందో పూర్తయేవరకూ చెప్పలేను. పూర్తవుతుందో లేదో కూడా చెప్పలేను.

ఎందుకు మారడం అన్నప్రశ్న ఉదయించేక, అసలు ఎవరైనా ఎందుకు మారతారు, మారకపోతే ఏం, మారితే ఎందుకు మారేరు, మారకపోతే ఎందుకు మారరు, నిజంగా మార్పు కోరే మార్తారా, ఎలాటి మార్పు కోరి మార్తారు … ఇలా ఎన్నైనా ప్రశ్నలు వేయడానికి, లేదా వేసుకోడానికి ఆస్కారం ఉంది కదా. అంచేత మార్పు అన్న పదం ఎన్నిరకాలుగా దర్శనమిస్తుందో సూచనప్రాయంగానైనా చెప్పాలని మొదలు పెట్టేను. ఉన్నఊరినించి కట్టుకున్నబట్టలవరకూ, తెల్లారి లేచినదగ్గర్నుంచీ పొద్దు పోయేవరకూ ఎన్నో మార్పులు చూస్తాం. అంతే కాదు. మనుషులు మారడం, మనిషి నిజంగా మారడని గాఢంగా విశ్వసించడం కూడా మార్పుతాలూకు పర్యాయరూపాలే కదా.

నేను చూసిన లోకం, ఆలోకంలో మనుషులు ఆధారంగా ఇది నడుస్తుంది. ఎప్పుడు ఏ కథైనా మనకి తెలిసినప్రపంచంలోంచే పుడుతుంది కనక (పుంఖానుపుంఖాలుగా బుక్కులు చప్పరించేసి ఒప్పగించేసేవారిని తప్పిస్తే), నాకు తెలిసినమనుషులూ, నేను చూసినలోకమే ఇక్కడ మీకు తారసిల్లుతుంది. అయితే ఏ ఒక్కపాత్రా ఏ ఒక్కరూ కాదు. అంతర్గతంగా ఉన్న ఒక మానవనైజాన్ని పదిచోట్ల చూడ్డం తటస్థించినప్పుడు దాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించేను.

ఇప్పుడు మొదటికొస్తాను. పై ప్రశ్న నాకు తగిలేక, మంచి చిక్కటి కాఫీ మూడు కప్పులు పుచ్చుకుని, సుదీర్ఘంగా ఆలోచించేను. నాకు స్థిరత్వం ఉందా లేదా అన్నది. అన్నట్టు స్థిరత్వం అనరేమో, స్థిరంలేదూ అనడమే ఆనవాయితీ అనుకుంటా. ఆమాటకేం గానీ,

ఆలోచించగా, ఆలోచించగా నాకు తోచించేమిటంటే - ఒకరకంగా చూస్తే, నాకు చాలా స్థిరత్వం ఉంది. ఎందుకంటే నేను అంత తేలిగ్గా కదలను ఉన్నచోట్నుంచీ దేనికైనా సరే - చిన్నవిషయం గానీ పెద్దవిషయం గానీ. అర్జంటుగా వంకాయకూరలోకి కొత్తిమీర కావాలన్నా కనీసం మూడురోజులపాటు నన్ను నేను “పద, పద”మంటూ ఉసిగొల్పుకోవాలి!

మరోరకంగా చూస్తే, స్థిరత్వం లేదనే అనిపిస్తుంది. ఏ ఉద్యోగమూ పట్టుమని పదేళ్ళు చెయ్యలేదు. పంతాలకి పోయి వదిలేసినవి కొన్నయితే జరక్క వదిలేసినవి కొన్ని. అందుచేత జరిగిన నష్టం ఏమిటంటే నా బతుకంతా గంటకూలీ ఉద్యోగాలే. కేవలం నాతెలివితక్కువతనం చేతే.

ఇంక ప్రస్తుతానికొస్తే, మూడేళ్ళుగా అనుకుంటున్నాను “మారాలి” అని. అయితే ఎవరితోనూ అనలేదు కనక ఈమాట రహస్యంగానే ఉండిపోయి, ఇప్పుడు నా మార్పు చాలామందికి షాకు అయిపోయింది. నేను కదలడమే ఓ ఘనకార్యం అయినట్టు.

కానీ జరిగిందేమిటంటే, నాకిక్కడ విసుగేస్తోంది. ముప్పైయేళ్ళపాటు నడిచినబాటలే నడిచి,



తిరిగినవీధులే తీరిగి విసుగెత్తిపోయేను. తిన్న తిండే తింటూ, కడిగిన గిన్నెలే కడుగుతూ, తొడిగిన బట్టలే తొడుగుతూ … మళ్ళీ మళ్ళీ అవే ఉతికారేసుకుంటూ … మరీ గానుగెద్దు బతుకు అనిపించిపోయింది నామటుకు నాకే.

పొద్దు పొడుస్తూనే కాఫీ కప్పు పుచ్చుకు అదే సోఫాలో అదే మూల కూర్చుని చూస్తే అదే ధృశ్యం,



సాయంత్రం అదే చెట్టూ, అదే పుట్టా ... ఆ చెట్లంటా పుట్టలంటా తిరిగే ఉడతలు మాత్రం అవే కాకపోవచ్చు.



నాకళ్ళముందే, నేను చూస్తూండగానే, చిట్టీ పొట్టీ ఉడతలు కనిపించడం, అవి పెరిగి పెద్దవవడం, కొంతకాలం కనిపించకపోడం, మళ్ళీ చిట్టీ పొట్టీ ఉడతలు హడావుడిగా పరుగులు తీస్తూ .... ఇలా ఎన్ని ఉడతతరాలు చూసేనో! .... తలుచుకుంటే నవ్వొస్తోంది కానీ విసుగు కూడా వేస్తోంది వాటిని.. చూసి చూసి వేసారిపోయేను.

కనీసం ఇల్లు మారాలి ... ఇల్లు మారితే ఉడతలకి బదులు పాములనో పందికొక్కులనో చూస్తానేమో .. అవి మాత్రం నన్ను ఉల్లాసపరుస్తాయా? ఏమో, చూస్తే కదా తెలిసేది. కూర్చున్నచోటినుండి కదలకపోతే ఎలా తెలుస్తుంది ఆవలితీరంలో ఏముందో? ... ఇలా సదసత్సంశయంలో కొట్టుమిట్టాడుతూ ఇల్లు అమ్మకానికి పెట్టేను. రెండుసార్లు ఏం జరగలేదు. ఇది మూడోసారి.

ఇలా మారుదాం, మారుదాం అని ఆలోచిస్తూ కూచుంటే, ఏదో ఓ సమయంలో విసుగెత్తిపోయి. పోతాను, పోతాను అనడమే కానీ పోవేం, అని అరవడం జరుగుతుంది కదా. అదే లెండి నావిషయంలో నామీద నేనే ....

ఆఊపులోనే ఏదో ధైర్యం కూడా తన్నుకొచ్చింది. ముందులా కాక, ఈసారి అయినవాళ్ళకీ కానివాళ్ళకీ, రోడ్డుమీదా బజారులోనూ ఎదురైనవాళ్ళకీ ... ప్రతివారికీ నేను ఇక్కడినించి మకాం ఎత్తేస్తున్నానోచ్ అంటూ ఎలుగెత్తి చాటేను. ఇంట్లో అక్కర్లేని సామాను పోగెట్టి దానం చేసేశాను. కొన్ని వీధిలోకి గిరవాటెట్టేను. వారానికోమారు అదేదో నోములా వస్తువులు పారేస్తుంటే గొప్ప ఉషారొచ్చిందంటే నమ్మండి. ఇల్లు మారినా మారకపోయినా ఇలా స్టెప్పులవారీగా ఇల్లు ఖాళీ చెయ్యడంలో కూడా ఒక మార్పులాటి అనుభూతి వచ్చింది. ఇదొక జీవనసత్యం. మనం అప్పుడప్పుడు ఇలా సామాను గిరవాటేస్తూండాలి అనే నిర్ణయానికి కూడా అప్పుడే వచ్చేశాను.

ఇహ ఊళ్ళో ... స్నేహితులకి చెప్పినప్పుడు మరో చిన్న సంఘర్షణ.

(డిసెంబరు 18, 2010)

మార్పు 2

"ఎక్కడికి మార్తావు?" - తొలి ప్రశ్న.

ఏమో… పక్కఊరికి కాపోతే ఊళ్ళోనే ఈకొసనించి ఆకొసకి, ఈ వీధినించి మరోవీధికి … ఎక్కడికైనా సరే మారాలి. అంతే. నాక్కావలసింది మార్పు. అంతే. ఎక్కడికి అన్నది నాక్కూడా తెలీదు.

అడిగినవాళ్ళు నవ్వేరు. కుక్క తోకని పేటాడినట్టుందని అనలేదు కానీ అలా అనుకుని ఉండడానికి అవకాశాలున్నాయి!

ఇంకా సలహాలు, సందేహాలూ, అభిమానాలు చూపించుకోడానికి అవకాశాలు.

"ఎందుకండీ? ఈ ఇల్లు బాగుంది కదా."

"ఇలాటి ఇల్లు మళ్ళీ దొరుకుతుందంటారా?"

"మీరిక్కడుంటే మాకు బాగుంది. మీరు దూరం వెళ్ళిపోడం మాకు బాగులేదు …"

హుమ్. నేను నిట్టూరుస్తాను మనసులోనే. ఏమిటో ఈ పీటముళ్ళు - విప్పలేం. ఊరుకోలేం.

ఊళ్ళో ఉన్నాం అన్నమాటే కానీ ఏడాదికోమారైనా కలుస్తామా అంటే అనుమానమే. అయినా పక్కవీధిలో నేనున్నానంటే అదో భరోసా కాబోలు.

విధిగా ఏటేటా జరుపుకునే పండుగలూ పబ్బాల్లాగే వాళ్ళ విదేశీప్రయాణాలూను. అలాటివేం లేని నేను మార్పుకోసం మరోవీధికి మారతానంటే వారికెందుకింత వింత? బహుశా నేనిక్కడ ఉండడం వాళ్ళకి అలవాటయిపోడం చేతా? అటెళ్తే మాలతిగారిల్లు … అనుకుని తృప్తిపడతారా? అనా అనుకోడానికి నేనిక్కడ లేనప్పుడు కూడా అనుకోవచ్చు కదా…. హా .. హా.

"మేం ఇప్పటికి 73 దేశాలు చూశాం."

నాకేమో అన్ని దేశాలున్నాయని కూడా తెలీదు.

"అలాగా? మీరు వాటినిగురించి రాయాలి." - నాకు వచ్చిన, రాగల ఒకే ఒక్క ఆలోచన.

"ఎక్కడండీ … గుర్తుండవు."

"నిజమే, మర్చిపోతాం. అందుకే రాయాలంటున్నాను. ఫొటోలున్నాయి కదా."

“ఊ...మ్... ఆఁ ... ఫొటోలున్నాయనుకోండి. ఊం ఆం.. ఐనా గుర్తుండవు.” బుర్ర గోక్కోరు కానీ అలాటిదృశ్యం నామనసులో మెదులుతుంది. వాళ్ళవేపు పరీక్షగా చూస్తాను ఎందుకలా అన్నారా అని.

“మరెందుకండీ వెళ్ళడం?” అంటాను నవ్వి.

వాళ్ళు చిన్నబుచ్చుకుంటారు. ఇలాటిసందర్భాలు నాలుగయేక ఏదో ఓ రోజు అడిగేస్తాను ఊరుకోలేక. “ఎందుకండీ అలా తిరగడం?” అని.

చాలా కారణాలుంటాయి చెప్పడానికి.

-- “కాలక్షేపానికి ...”

-- “చూశాం అని చెప్పుకోగలగడానికి”

-- “ఉన్న ఇంట్లో, ఉన్న ఊళ్ళో ఉండి ఉండి విసుగేసి నాలుగు రోజులపాటు మార్పుకోసం.”

-- “ఇంతకాలం రెక్కలు ముక్కలు చేసుకు సంపాదించేం .. మరి అనుభవించాలి కదా ...”

“మాకు డబ్బుంది కనక మేం వెళ్తాం, నీకేం?” అన్నా అనొచ్చు. అంటారని కాదు కానీ అన్నట్టే ఉంటుంది ఒకొక మొహం చూస్తే.

మరోరకం -

“మీ అమ్మాయి ఏం చేస్తోందండీ?” మాట మారుస్తారు.

“కూర బాగుంది. ఎలా చేశారండీ?” నావంతు మాట మార్చడం.

ఇలా నాలుగు చుట్లవుతాయి.

“వస్తానండీ. పాల్లేవు రేపు కాఫీకి. బజారుకెళ్ళాలి” అంటూ లేస్తాను. పాలు కాకపోతే పళ్ళు, బజారు కాకపోతే షికారు ... ఏదో వంక. ఈ పసలేని వస కన్నా ఏ పిట్టల్నో చూస్తూ గడిపినా నయమే మరి.

ఇంతకీ మార్పు సంగతి కదూ మొదలు పెట్టేను. ఉత్తరపు పొలిమేరల్నించీ దక్షిణానికి జైత్రయాత్ర. ఇక్కడినించి అక్కడికి ఓ గీత గీస్తే, నేరుగా అక్కడ దిగుతాం అన్నమాట.

కారెక్కి, విస్కాన్సిన్ పొలిమేరలు దాటుతుంటే వాన మొదలయింది. పెద్దవర్షం కాదు కానీ, చిన్నచిన్న తుంపర్లు. వైపర్స్ వేస్తే తడి చాలక కిర్రు కిర్రుమంటూ గోల, ఆపేస్తే, విండ్‌షీల్డ్ మీద తుప్పర్లమూలంగా రోడ్డు కనిపించకపోడం ... అలా వైపర్లు వేస్తూ తీస్తూ నాకు కాలక్షేపం....

రెండు రాష్ట్రాలు దాటేవేళకి వాన కూడా వెనకబడింది. హమ్మయ్య అనుకున్నాను. దాంతోపాటే నేను వెనక వదిలేసిన మిత్రులు గుర్తుకొచ్చేరు.

టెడ్ ఈదేశం వచ్చినరోజునే పరిచయం అయ్యేడు. అప్పటికి ఇంకా చదువు పూర్తి కాలేదు. ఆతరవాత క్రమంగా, పెళ్లీ, పిల్లలూ, ఉద్యోగాలూ, ఇల్లు కొనడం … గత ముప్పై ఏళ్ళలోనూ మూడు, నాలుగుసార్లన్నా కలిశామో లేదో … అయినా కలిసినప్పుడు మాత్రం రోజు చూస్తున్నంత చనువుగా మాటాడుకుంటాం. నాయిల్లు అమ్మకం అయిపోయేక, రాత్రి ఎందుకు హైవేమీద అని మర్నాడు ఉదయం బయల్దేరుదాం అనుకున్నాను.

నామనసులో మాట టెడ్‌కి వినిపించిందేమో అన్నట్టు, మరొక పూర్వవిద్యార్థి ఊళ్లోకి వచ్చేడనీ, అంచేత నన్ను కూడా రమ్మని పిలిచేడు. తనే వచ్చి మమ్మల్ని తీసుకెళ్తానన్నాడు.

వాళ్ళిల్లు ఊరవతల ఓ కీకారణ్యంలో ఉందిలెండి. ఇదివరకోసారి పిలిస్తే, నేను బయల్దేరి, రోజంతా రోడ్లంట తిరిగి కనుక్కోలేక ఇంటికొచ్చేశాను. అంచేతన్నమాట నన్ను కూడా తనే వచ్చి తీసుకెళ్తానన్నది. ఆ రెండో విద్యార్థి ఛార్లెస్ అదే నా పూర్వవిద్యార్థి ఇప్పుడు తను తెలుగు చెప్తున్నాననీ, తను కూడా దక్షిణరాష్ట్రంలోనే ఉన్నాడు కనక నన్ను వాళ్ళఊరు పిలుస్తాననీ అన్నాడు. నాకు భలే తమాషాగా అనిపించింది. ఎందుకంటే, పారేయబోయిన వస్తుసంచయంలో నేను తయారుచేసిన తెలుగుపాఠాలు కూడా ఉన్నాయి.

ఆమాటే అన్నాను అతనితో. "ఆ తెలుగుపుస్తకాలూ, కాయితాలూ అవీ పారేయడానికి సిద్ధంగా ఉన్నాను."

"అయ్యొయ్యో, పారేయకండి."

సరే. అన్నాను. ఇలాటివే నాకు అర్థం కావు. ఎందుకంటే గత రెండు, మూడేళ్ళలో ఇక్కడ యూనివర్సిటీవారితో నాకు కలిగిన అనుభవాలు తలుచుకుంటే నాకు వచ్చే మాటలు ఇక్కడ రాయతగ్గవి కావు. "శనొదిలిపోయింది" అనుకుని వాటితాలూకు ఛాయలు కూడా లేకుండా తుడిపేసుకుందాం అనుకుంటున్న సమయంలో, మళ్లీ … నారదసంసారం గుర్తొచ్చింది. వదిలేసుకుందాం అన్నప్పుడల్లా ఏదో బంధం పట్టి వెనక్కి లాగుతూ ఉంటుంది….

"కీంఁంఁంఁంఁంఁం" - పక్కనున్న కారు హెూరెత్తడంతో ఉలికిపడి, నాలేనులోకి సర్దుకున్నాను.

ఇలా ఏళ్ళూ పూళ్లూ కనిపించని విద్యార్థులు కనిపించి ఇంత అభిమానం కురిపిస్తే, ఊళ్ళో ఉన్న ప్రొఫెసరు జో ఎందుకు పలకరించలేదో అని నాకు మళ్ళీ ఆలోచనలు. ఇది కొత్తగా వచ్చిన చిక్కుప్రశ్న నాకు. ప్రొ. జో నేను ఈదేశం వచ్చినరోజునే మాయింటికొచ్చి "నమస్కారమండీ" అంటూ చేతులు జోడించి నన్ను సంభ్రమాశ్చర్యాల్లో ముంచేశారు. ఆ తరవాత చెప్పేరు తనకి వచ్చిన తెలుగుముక్క అదొక్కటే అని! మాఅమ్మాయి పుట్టినప్పుడు ఆస్పత్రిలో మొట్టమొదటి విజిటర్లు ఈ దంపతులే. రెండో విజిటర్ టెడ్. అంచేత వీళ్ళతో నాకు చాలా చరిత్ర ఉంది. ఇంతకీ ఆదినుండీ జో దంపతులు కూడా నాకు ఎన్నివిధాల, ఎన్నిసందర్భాల్లో ఆదుకున్నారో మాటల్లో  చెప్పలేను. గత అయిదారేళ్లుగా కలవడం లేదు కానీ మూడేళ్ళకిందట మాఅమ్మాయి లోకల్ పేపరులో front page news అయినప్పుడు (Lambs for lions విడుదల సందర్భంలో) ఆయన తనకి తానే నాకు ఫోను చేసి అభినందనలు చెప్పేరు. అప్పుడు కూడా నేను ఆశ్చర్యపోయేను. మరి నేను ఇక్కడినుండి వెళ్లిపోతున్నానని ఓ కార్డు పంపితే, భోజనమో, బ్రేక్ఫాస్టో అక్కర్లేదు

కనీసం ఒక్కముక్క - ఓ ఈమెయిలో, ఫోన్కాలో, మరో కార్డో - వస్తుందనే ఆశించేను.  ఎంచేతో ... ఈమాట చెప్తే మాఅమ్మాయి కూడా ఆశ్చర్యపోయింది. అంతే కాదు. వాళ్ళు ఊళ్ళోనే ఉన్నారు. ఆరోగ్యం బాగానే ఉంది. నామరొక పూర్వ విద్యార్థి ముందురోజు వారితో బ్రంచి చేశానని చెప్పేడు. నాకు ఇది కూడా నేను ఈఊరు వదిలి వెళ్ళిపోతున్న శుభసందర్భంలో వీళ్లందరూ నాకు మళ్లీ కనిపించడం!

ఇదుగో ఇలాటప్పుడన్నమాట నాకు ఎవరితో ఏం మాటాడాలో తెలీనిది. ఆయనకి నాయందు అభిప్రాయం మారిపోయిందా? ఎందుకు మారింది? ఆయన మారేరా? ఎందుకు? నేనేం చేసాననీ? ...నాగురించి ఇంకెవరైనా ఏమైనా ఆయనకి చెప్పేరా? ఏముంది చెప్పడానికి? పోనీ అలా ఎవరైనా చెప్పేరనుకున్నా (అలాటిమనిషులు ఉన్నారనుకోండి, అది వేరేకథ) ఆయన అలా చెప్పడుమాటలు విని అభిప్రాయాలు మార్చుకునేమనిషి కారు. ఆమాట గట్టిగా చెప్పగలను. ఏమైనా ఈసంఘటన నాకు ఏనాటికీ అర్థంకాని చిక్కుప్రశ్నగానే మిగిలిపోతుందనుకుంటాను. లేదా, ఇలా కథలు రాసుకోడానికి పనికొస్తుంది!

ఆ దంపతులిద్దరూ నాకు జవాబు ఇవ్వకపోయినా, నేను మాత్రం వాళ్ళు నాకు చేసిన సాయం, పరమ సంక్లిష్ట సమయాల్లో నన్ను ఆదుకున్నవైనం ఏనాటికీ మరిచిపోను.

టైము చూశాను. రెండయింది. అయోవా దాటిపోయాను. నేను బయల్దేరుతున్నప్పుడు వేసుకున్న ప్లాను ప్రకారం నాతొలిమజిలీ ఇక్కడే. ఇక్కడ ఆగి, రాత్రి ఏహొటల్లోనో పడుకుని తెల్లారి మళ్ళీ రోడ్డెక్కుదాం అనుకున్నాను. కానీ ఇంకా టైము రెండే ...అప్పుడే ఆగిపోయి మిగతా రోజంతా ఏమిటి చెయ్యడం? అసలు అలసట కూడా లేదు. సరే మరికొంచెం ముందుకెళ్ళి అలసట అనిపించినప్పుడో, టాంకు ఎమ్టీ చూపించినప్పుడో ఆగుదాంలే అనుకుంటూ ముందుకి సాగేను.

పక్కనుంచో పెద్ద ట్రక్కు దూసుకుపోయింది. ఇక్కడ మీకు నా హైవే మర్యాదలు కొన్ని చెప్పాలి. మామూలుగా నేను స్పీడ్ లిమిట్లోనే పోతాను. నాకు అవతల ములిగిపోయే రాచకార్యాలేవీ లేవు కదా. రేపు చేరినా ఒకటే, వచ్చేవారం చేరినా ఒకటే అని నాఅభిప్రాయం. రెండోది, నాది చిన్నకారు కనక ట్రక్కు నాకు పెట్టినా నేను ట్రక్కుకి పెట్టినా నాకే ముప్పు. అంచేత కూడా మర్యాదగా అవి లేక వారు (ట్రక్కుకి మానవస్థాయి అంటగడితే) పక్కనించి పోతున్నసమయంలో, నేను కాస్త వెనక్కి తగ్గుతాను. లేదా అవి లేక వారు నావెనక ఉండి మీదమీదకి వచ్చేస్తుంటే నేనే పక్కలేనులోకి తప్పుకుంటాను.

ఇంతకీ, నాపక్కనుంచి ట్రక్కులు వరసగా రెండో మూడో దూసుకుపోయేయి కానీ నాకారు మాత్రం ఇంకా అల్లల్లాడుతున్నట్టే ఉంది. ఏమిటా అన్న భయం మొదలయింది. పాతకారు కదా. ఇది గానీ ఆ ఒడ్డుకి చేర్చదా ఏమిది, ఖర్మ అనుకుంటూ కొంచెంసేపు పాడుకున్నాను. నిజానికి అలాటి భయం ఉండకూడదు. వచ్చేముందు మెకానిక్కి కారు చూపించి అన్నీ సవ్యంగా ఉన్నాయని ధృవపరుచుకునే బయల్దేరేను. ఇంతకీ ముందున్నంత ఊపు లేదు కానీ కాస్త ఊగుతున్నట్టే అనిపిస్తోంది. పక్కకి తిరిగి చూస్తే, మరో తొమ్మిదిమైళ్లలో కారుకీ నాకూ కూడా మేత దొరుకుతుందని సైన్‌బోర్డు తెలియజేసింది.

సరే, ఆ ఎక్సిట్ తీసుకుని కారు ఓ పక్కని ఆపి, దిగేను. అప్పుడు తెలిసింది కారెందుకు ఉయ్యాలలూగిందో.

ఉధృతంగా చండప్రచండంగా పెనుగాలి. అసలు అంతగాలిలో నాకారు రోడ్డుమీద ఉన్నందుకే మహదానందం అయింది ఆక్షణంలో. గబుక్కున మళ్ళీ కారెక్కేసి, ఆ స్టోరు సింహద్వారందగ్గిరికి వీలయినంత దగ్గరికి వెళ్ళి, షాపులోకి ఒక్క ఉదుటున జొరబడ్డాను.

మరో వంద మైళ్ళు వెళ్ళేవేళకి కారు ఊపు తగ్గింది. కాన్సస్ సిటీ దాటేవేళకి ఆరవుతోంది. ఆసిటీ దాటినతరవాత ఆరాత్రికి ఆగేను. మైలేజి చూస్తే అయిదువందలమైళ్ళు అయిపోయింది! నేను ౩౦౦ కంటే ఎక్కువ చెయ్యలేను అనుకున్నాను. బహుశా నాకు వెనకటి ఊరు వదిలేస్తున్న ఉత్సాహమేమో తెలీదు కానీ అస్సలు అలుపే లేదు. ఆలెక్కన నేను రెండోరోజుకే డలస్ చేరిపోతాను. నాస్నేహితురాలు సుధని పిలిచి మర్నాడు సాయంత్రానికి వచ్చేస్తున్నానని చెప్పేను.

మర్నాడు రోడ్డెక్కేవేళకి గాలి బాగా తగ్గిపోయింది. పైగా నాకింకా ఆశ్చర్యం రోడ్లమీద అట్టే కార్లు లేవు. ఎప్పుడో ఓ పెద్ద ఊరు వచ్చినప్పుడు తప్పిస్తే, అక్కడో కారూ, ఇక్కడో ట్రక్కూ తప్పిస్తే రోడ్డంతా నాకోసమే వదిలేశారేమో అనిపించిందంటే నమ్మండి. నాడ్రైవింగు కూడా అలాగే ఉందిలెండి ఆపూట. దిక్కులు చూస్తూ రెండుసార్లు రోడ్డుపక్క పిట్టగోడలకి పెట్టేయబోయేను. నా అదృష్టం బాగుండి ఆచుట్టుపక్కల పోలీసులెవరూ లేరు. అయినా కార్లే లేని రోడ్డుమీద పోలీసులేం చేస్తారులే అనుకుని, ఒళ్ళు దగ్గరపెట్టుకుని డ్రైవింగు సాగించేను ఆతరవాత



అలా ఖాళీరోడ్లతోపాటు విశాలంగా ఆకాశం మూడువేపులా పరుచుకుని, ఒకొకప్పుడయితే, విమానంలో ఆకాశంలోకి చొచ్చుకుపోతున్న స్పృహ.. నిజంగా ఆదృశ్యం చూసి తీరాలి.



అలా చూస్తుంటే, వెనక్కి వదిలేసిన స్నేహితులలో జూడీ గుర్తొచ్చింది. నేను కమ్యూనిటీ కాలేజీలో, పనిచేస్తున్నప్పుడు పరిచయం అయింది. నేను ఉద్యోగం మానేసినా, అప్పుడప్పుడు కలుసుకుంటుంటాం. ఈమధ్యే దాదాపు ఏడాదిగా కలవలేదు. ఇంకా ఊరు వదిలేసి పోతున్నాను కదా అని ఈమెయిలస్తే, వెళ్ళేముందు కలుద్దాం అంది. మాస్నేహం మాటెలా ఉన్నా తను రాసిన పుస్తకంగురించి చెప్పాలి. నిజానికి అది ఆవిడకథ కాదు. ఆవిడ స్నేహితురాలు జాకీ మిల్లర్ కథ. పుస్తకం పేరు Because of I am Jackie Millar!

మనుషులు మారరని నేను గట్టిగా నమ్ముతాను. పైపైకి మారినట్టు కనిపించినా, ప్రాథమికంగా వాళ్ళ మనస్తత్త్వాలు ఎప్పట్లాగే ఉంటాయని. మారడం అంటే నేను పుట్టినప్పుడు ఇలా ముసిలిమొహంతో పండువెంట్రుకలతో పుట్టలేదు కదా. అంతేకాక, నేను నేర్చుకున్న అనేక పాఠాలమూలంగా నాఅభిప్రాయాల్లో మార్పు వచ్చిఉండొచ్చు. కానీ నాలో ఉండే ఒక ప్రత్యేకగుణం మాత్రం అలాగే ఉందనీ, ఉంటుందనీ కూడా అనుకుంటాను. నా అనుభవాలు అలాటివి.

అందుకు భిన్నంగా, జాకీమిల్లర్ మనుషులు మార్తారు అనడం కాదు క్రియలో అద్భుతంగా ప్రదర్శించింది. ప్రదర్శిస్తోంది. క్షమ ఇంతగా ఘనంగా ఆచరణలో పెట్టినమనిషిని నాజీవితంలో నేను చూడలేదు.

వివరాలు వచ్చే టపాలో…

(డిసెంబరు 21, 2010)

## మార్పు 3

ఐదారేళ్ళక్రితం జూడీ తన స్నేహితురాలు జాకీ మిలార్‌గురించి చెప్పి ఆమెకథ పుస్తకంగా రాస్తున్నానని చెప్పినప్పుడు నాకు ప్రత్యేకంగా అనిపించలేదు. పుస్తకప్రచురణ అయినతరవాత నాకో

కాపీ ఇచ్చినప్పుడు కూడా నేను వెంటనే చదవలేదు. మామూలుగా నాకు inspirational కథల్లో ఆసక్తి లేదు. ఎంచేతంటే చెప్పలేను కానీ, గొప్పవారికష్టాలమీద నాకంతగా శ్రద్ధ లేదంతే.

Because I am Jackie Millar by Jackie Millar and Judగth Gwinn Adrian (2007) - మాత్రం నన్ను ఆపకుండా చదివించింది. ఒక కారణం పెద్ద పెద్ద ఉపన్యాసాలు లేకపోవడం అనుకుంటా. దాదాపు మన జానపదవాఙ్మయతీరులో సాగుతుంది. ఇది ఇంటర్వ్యూల సంకలనం. జాకీ మిలార్ కుటుంబసభ్యులు, స్నేహితులు, ఖైదీలు, ఈ "ద ఏక్సిడెంటు"కి పూర్వం ఆమెతో పని చేసినవారు, తరవాత హాస్పిటల్లో పని చేసినవారు - వాళ్ళందరిమాటలు వరసగా వాళ్ళమాటల్లోనే చెప్పేరు, వ్యాకరణదోషాలు కూడా సరిదిద్దే ప్రయత్నం చెయ్యలేదని చెప్పారు రచయితలు.

సూక్ష్మంగా అన్ని హింసాకాండల్లాగే ఇది కూడా -

నవంబరు 4, 1995.

జాకీ మిలార్ రీడ్స్‌బర్గ్‌లో తన స్నేహితుడు జాన్‌ని చూడ్డానికి తాను కొత్తగా కొన్న ఎర్రటిఆపిల్ రంగు హోండాలో బయల్దేరింది. కారు వాళ్ళగరాజిలో ఆపి లోపలికి వెళ్ళింది. జాన్ వాళ్ళబ్బాయీ జాకీని రెస్టు తీసుకోమని చెప్పి, బజారుకి వెళ్ళేరు ఆపూట భోజనం ఏదో తీసుకురాడానికి.

ఆదారిని పోతున్న ఇద్దరు అబ్బాయిలు, జాష్ (15), క్రేగ్ (16) ఇంటినించి పారిపోయే ఉద్దేశ్యంతో బయల్దేరి ఆదారిన పోతూ జాకీకారు చూశారు. తాళాలకోసం ఇంట్లోకి వెళ్ళేరు. తాళాలు దొరికేయి. వాళ్ళ అలికిడి విని జాకీ బయటికి వచ్చింది. అది వాళ్ళు ఎదురు చూడనిది. క్రేగ్ ఆమెని నేలమీద పడుకోమన్నాడు. తలమీద తలగడ పెట్టి షూట్ చేసి, కారు తీసుకు వెళ్ళిపోయేరు. ఆతరవాత పట్టుబడ్డారు. ప్రస్తుతం జైల్లో ఉన్నారు వాళ్ళిద్దరూ.

జాన్, వాళ్ళబ్బాయి తిరిగి వచ్చేసరికి జాకీ రక్తపుమడుగులో నేలమీద పడి ఉంది, స్పృహ లేకుండా. ఆంబులెన్స్ పిలిచి ఆస్పత్రికి చేర్చేరు. ఆ తరవాత మాడిసన్‌లో యూనివర్సిటీ హాస్పిటల్‌కి తరలించేరు.

జాకీకి కొన్ని నెలలు పట్టింది కోలుకోడానికి. శరీరం కుడిభాగం పారలైజ్ అయింది. ఇప్పుడు జాకీకి మాట స్పష్టంగా రాదు. జ్ఞాపకశక్తి దెబ్బ తింది. కొన్ని విషయాలు వివరంగా గుర్తుంటాయి. కొన్ని గుర్తుండవు. ఆమెమెదడులో గుండుతాలూకు ఏడు తునకలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి.

ఆ దుర్ఘటనని జాకీ "ద ఏక్సిడెంట్" అంటుంది. ఆవిడే కాదు ఆమెని తుపాకీతో కాల్చి క్రేగ్, జాష్, ఆవిడ అబ్బాయిలు డెరెక్, ఛాడ్, సహోద్యోగులు, ఆస్పత్రిలో ఆమెతో పని చేసినవారు - అందరూ "ద

ఏక్సిడెంట్" అనే అంటారు. అది హింస కాదు, ఇద్దరు చిన్నపిల్లల తెలివితక్కువతనంమూలంగా జరిగిన ప్రమాదం అని జాకీవాదన.

జాకీ ఈ ద ఏక్సిడెంట్‌నించీ (ఇంగ్లీషులో "ద"కి ఉన్న ప్రత్యేక అర్థంమూలంగా మనం కూడా అలాగే అనాలనుకుంటాను) కోలుకున్నతరవాత, జాష్‌నీ, క్రేగ్‌నీ చూడ్డానికి జైలుకి వెళ్ళింది. వాళ్ళ సెంటెన్సింగ్ టైంలోనూ కోర్టుకి వెళ్ళింది. వాళ్ళని "క్షమించేను" అంటుంది.

"ఎందుకు క్షమిస్తావు?" అంటే, "నేను జాకీ మిలార్‌ని కనక" అంటుంది. పుస్తకం పేరు అదే.

ఈ సంఘటన ఆమెజీవితాన్ని, ఇద్దరు కొడుకుల జీవితమే కాదు అనేకమంది స్నేహితులూ, చుట్టాలూ, ఆమెకథ విన్న ఖైదీలు, - ఎంతోమంది జీవితాలను మార్చివేసింది.

జాకీ క్రమంగా ఇతర నేరస్థులతో, పోలీసు డిపార్ట్‌మెంటులో వివిధస్థాయి ఉద్యోగస్థులతో, rehabiliation therapistsతో, క్రిమినల్ జస్టిస్ విద్యార్థులతో, హైస్కూళ్ళో మాటాడుతోంది. మాటాడుతోంది అని ఎఁదుకంటున్నానంటే ఆవిడ ఇచ్చేవి ఉపన్యాసాలు కావు. వాళ్ళగురించి అడుగుతుంది. ప్రతిఒక్కరితో అప్యాయంగా మాటాడుతుంది. కౌగలించుకుంటుంది. తన కథ చెప్తుంది.

ఆమెకి ఖైదీలదగ్గర్నుంచీ ఉత్తరాలు వస్తుంటాయి. జైలు కౌన్సిలర్లు చెప్పే పాఠాలకంటే జాకీకథ ఆమెనోట వినడంవల్ల తమకి తమ దుశ్చర్యలఫలితాలు ఎక్కువగా అర్థమయేయంటారు చాలామంది నేరస్థులు.

నేరస్థులని జైళ్ళలోకి తోసేయడంతో, వాళ్ళకి రిహాబిలేషను పాఠాలు వల్లించేయడంతో వాళ్ళని మనుషులుగా మార్చడం జరగదు. ఈ రిహాబిలిటేషన్ ప్రాసెస్‌లో విక్టిమ్స్‌కి కూడా పాత్ర ఉంది అని జాకీ ప్రతిపాదన. నేరస్థులకి ప్రేమంటే ఏమిటో చూపాలి. వారు చేసినవి - not crimes. Just bad choices అంటుంది జాకీ మిలార్.

ఈపుస్తకం రాయడానికిముందు జాకీ దూరపుచుట్టం ఒక పాట రాసేడు ద ఏక్సిడెంట్ గురించి. తరవాత ఈ పుస్తకం రాయడం జరిగింది. పుస్తకంతో పాటు ఆ సిడి కూడా దొరుకుతోంది అనేకచోట్ల. కీవర్డ్ Jackie Millar అని టైపు చెయ్యండి.

రెండేళ్ళక్రితం జాకీకి జఫర్సన్, జాకీ ఒనాసిస్ ఎవార్డులు లభించేయి. విస్కాన్సిన్లో అనేక సేవాసంస్థలు, విద్యాసంస్థలూ ఆమెని సత్కరించేయి.

ద ఏక్సిడెంట్‌మూలంగా తనజీవితం మారిపోయింది. దానికి మరొకరకం అర్థం ఏర్పడింది అంటుంది జాకీ.

2007లో అనుకుంటాను ఓప్రా విన్‌ఫ్రీ షోలో జాకీ, పెద్దకొడుకు ఛాడ్ వచ్చేరు. 2015లో క్రెగ్ పెరోల్ హియరింగ్ ఉంది. ఆసమయంలో జాకీ క్రెగ్ తరఫున మాటాడుతుందా అన్నది చాలామందికి కలిగే సందేహం.

“నేను మా అబ్బాయి ఛాడ్‌కి మాటిచ్చేను క్రెగ్‌తరఫున వాదించనని. అంచేత మాటాడను” అంది జాకీ.

“అతనిచర్యమూలంగా నేను ఆజన్మాంత ఖైదీ. మా అమ్మ ఆజన్మాంత ఖైదీ. మాకు పెరోల్ లేదు. వాళ్ళకి మాత్రం ఎందుకుండాలి?” అన్నాడు ఛాడ్.

“మాబంధువులు చాలామంది నేను జాకీని నాతరఫున వాదించమని అడగాలనుకుంటారు. కానీ నేను అడగను.” అన్నాడు క్రెగ్. ఆ అబ్బాయి అంతగా మారిపోయేడు. తన దష్కృత్యానికి ఫలితం తాను అనుభవించాలి అని మనస్ఫూర్తిగా నమ్మేస్థాయికి ఎదిగేడు.

ముందు టపాలో మనుషులు మారరు అని నేను నమ్ముతానని చెప్పేను. ఏంటో నానమ్మకాలు వమ్ము చెయ్యడానికి ఇలాటివాళ్ళు పుడతారు కాబోలు.

ఇప్పటికీ నాకు సందేహమే. జాకీలాటి విశాలహృదయులు ఎంతమంది ఉంటారు. నేరస్థులలో క్రెగ్‌లా జ్ఞానోదయం కలిగినవారు ఎంతమంది ఉంటారు.

ఏమో.. చాలామందే ఉంటారని ఆశిద్దాం. లేకపోతే నిద్ర పట్టదు.

(డిసెంబరు 24, 2010. )

## మార్పు 4

Kansas city దాటింతరవాత, మూడు దిశలా విస్తరించుకున్న ఆకాశం కనుకొలుకుల్లో ఈ చివర్నించి ఆ చివరికి కనిపిస్తూ - హ్. అదొక అద్భుత అనుభవ. నాకు కలిగిన తొలి ఊహ, “అబ్బ, ఆకాశం ఎంత పెద్దదో” అని!! మాడిసన్‌లో వినువీధి లేదని కాదు. అక్కడ నేను నడిచేదారులకి ఇరుపక్కలా, పెద్ద పెద్ద చెట్లు, చిన్నవీధులూ, అటూ ఇటూ ఇళ్లూ, శిశిరం ప్రవేశిస్తూనే వింతశోభలు పులుముకునే పచ్చనాకులూ, వసంతంతో తొడుక్కొచ్చే

కొత్త చివుళ్ళూ - వీటి సొగసులు చూసి ఆనందించడంతో సరిపోతుంది కానీ కనురెప్పలెత్తి పైకి పైపైకి చూడాలని తట్టదు. కనీసం నాకు తట్టలేదు. ప్చ్.



అక్కడున్నన్నాళ్ళూ చెరువులచుట్టూ చెట్లనీడల్లో తిరిగేను. ఇక్కడ బీళ్ళూ, రాళ్ళూ, రప్పలూ, తప్పా తాలూ చుట్టూ తిరుగుతున్నాను.

అసలు నేనిక్కడికి రాగానే నా వాక్ కోసం వీధులు వెతుక్కోవాల్సి వచ్చింది. నాలుగు రోజులు అలా తిరిగేక,



మేజర్ హైవే అనిపించే దారినే నడవాలే తప్ప గత్యంతరం లేదని తెలిసిపోయింది. దారిపొడుగునా, గుంపులుగా గుంపులుగా జనావాసాలు గొబ్బెమ్మల్లా దాదాపు ఒకేరకం కప్పలతో. పక్కనుంచి యాభైమైళ్ళవేగంతో దూసుకుపోయేకార్లు. సదర్న్ హాస్పిటాలిటీ అంటారు కానీ అలాటి మర్యాదలు కారులు తోలేటప్పుడు మనం అట్టే చూడం. అంటే మీరు పదండి అంటే మీరు పదండి అంటూ మర్యాదలు ప్రదర్శించడం. ఇది నాకు కలిగిన మొదటి ఇంప్రెషను. కానీ నిజానికి వారం పదిరోజులు గడిచేక ఆ మర్యాదలు కొంత కనిపించేయి. నేను దారి దాటబోతుంటే పద తల్లీ అంటూ చేతులూపేవారు కనిపించేరు!



అలాగే రోడ్డుమీద చెట్లూను. ఇక్కడ చెట్లు లేవనీ, ఇళ్ళు ఇరుకు కాదనీ చెప్పేనా … అదీ నిజం కాదు. నా తొలి ఇంప్రెషను తప్పని త్వరలోనే గమనించేను. నేను నడిచేరోడ్డుమీద చెట్లు కనిపించేయి. అంటే ఇక్కడికి రాగానే నాకు ఉన్నవి లేనట్టూ, లేనివి లేనట్టూ కనిపించేయి కొన్నాళ్ళు ఎంచేతో మరి. అక్కడ మనసులో పడిన ముద్రలబలమేమో.

సైడ్‌వాక్‌మీదె నడుస్తుంటే, కారులు దూరంనించి దగ్గరగా వచ్చి మళ్ళీ దూరం అవుతుంటే నాకో ఊహ వచ్చింది. వాటివేపు చూడకుండా, అవి కారులు కావు తరంగాలు అనుకుంటే, బంగాళాఖాతంలో విరుచుకుపడే అలలు గుర్తొచ్చేయి.

అలా నడుస్తుంటే, ఆకాశం బారలు చాచుకుని రారమ్మంటూ కౌగలించుకోడానికేమోనన్నట్టు, మీద పడిపోతున్నట్టు ఉంటుంది ఎటు చూసినా. ఇప్పురమున వీధులు విశాలము. చెట్లు కురచ. మనుషులు తక్కువ. కార్లు ఖరీదయినవి అనుకున్నాను సూక్ష్మంగా.

వెనకటి ఊళ్లోలా ఆపులులూ, మేపులులు ఆకాశాన్ని కప్పేస్తూ కన్నులవిందు సేయవు. ఇక్కడా మేపులులున్నాయి కానీ ఇంకా ఎదగాలి. అంటే డల్లస్ ఎదగలేదని కాదు. నేనున్న పల్లె కొత్తదేమో … ఇంకా వివరాలు కనుక్కోలేదు.

అసలే ఊరు చిన్నది. అదున్నది డలెస్ పొలిమేరల్లో. ఆమీదట నేనున్నది దానికి పొలిమేరల్లో. అంచేత ఓ రకంగా నేను టెక్సస్ వచ్చినా రానట్టే ఉంది. అసలు ఎక్కడున్నానో తెలీడానికే నాలుగు వారాలు పెట్టింది. అన్నట్టు మీకు చెప్పలేదేమో నేనిక్కడికొచ్చి ఆరువారాలయింది. రెండువారాలు నాస్నేహితురాలు సుధే నాబతుక్కి పూర్తిగా జవాబుదారీ. అంచేత నాకసలు ఊరు తెలిసొచ్చింది నేను నా అపార్ట్‌మెంటులోకి మారేకే. దాంతో చాలా సంగతులు తెలిశాయి.

అర్జెంటుగా ఓ మిరపకాయ కావాలంటే కారేసుకుని ఆరుమైళ్ళు వేరే ఊరేగాలి. పోస్టాఫీసూ, పోలీసుస్టేషనూ (నాకవసరం రాదనుకోండి, వస్తే మాటే), కూరగాయలదుకాణం - ఎక్కడికెళ్ళాలన్నా రానూ పోనూ పధ్నాలుగు మైళ్ళకి తక్కువలేదు. అంటే అర్థ గేలను గాసయిపోతుందన్నమాట. అంటే డాలరున్నర గేసు పోసుకుని బయల్దేరితే మూడు డాలర్లు పెట్టి అర్థ గేలను పాలు కొంటే, ఆపైన అందుకోసం నేను వెచ్చించినకాలానికి ధర కడితే.

పోతే పోయిందని ఒక డాలరు పెట్టి గేలను పాలూ కొనేశాను. అవి చెల్లడానికి, ముందు పెరుగు తోడు పెట్టదల్చుకున్నాను. సుధకి పెరుగు బాగా తోడుకుంటుంది. ఇండియానించి ఎవరో తెచ్చి ఇచ్చేరుట తోడు!

మరోసమయంలో ఐతే వెఱ్ఱి వెక్కిరించినట్టే ఉందంటూ ఎంతో హాస్య, వ్యంగ్యంగా రాసి ఉండేదాన్ని ఈవిషయంమీద కానీ ఇప్పుడు మాత్రం నాకు ఇది సహజసిద్ధంగా సమర్ధనీయంగా అనిపించింది. సరే. పాలు చెల్లడానికి కొంచెం ఎక్కువ పెరుగే తోడబెట్టేను. అది చెల్లడానికి మజ్జిగ చేసేను. దాన్ని లస్సీ చెయ్యడానికి రోజువాటరు కొన్నాను. ఇంకా మిగిలిన పెరుగు చెల్లడానికి పెరుగ్గారెలు చెయ్యాలేమో ☹. హార్లిక్స్ కూడా కొన్నాను రోజు పొద్దున్నే తాగొచ్చని అనడం కన్నా పాలు చెల్లబెట్టడంకోసమే అనడం న్యాయం.

"గేలను పాలు చెల్లించుట" నాకు full-time ఉద్యోగం అయిపోయిందని తెలియడానికి నాలుగు రోజులు పట్టింది. కౌపీనసంరక్షణార్థం ... వ్యయమే కాదు ప్రయాస కూడాను. ఇదంతా తలుచుకుంటే ఒళ్ళు జలదరిస్తోంది. ఇంత చేసినా ఆ గేలను పాలూ వాటికాలం చెల్లేలోపున ఖర్చవలేదు.

అప్పటికి ఒక కఠోరసత్యం ఠక్కున కొట్టుకుంది నాబుర్రకి. మనం అంటే భారతీయులం సాధారణంగా ఇండియానుంచి రాగానే ఇలాగే ఆలోచిస్తాం. మనకి ధరలన్నీ రూపాయల్లోనే అర్థమవుతాయి. "ఏంటీ కొబ్బరికాయ రెండు డాలరులా, అంటే ఎనభై రూపాయాలా? పెరట్లో పచ్చగడ్డిలా పెరిగే కొత్తిమీర డాలరా? అంటే నలభై రూపాయలు!" అసలేం జరుగుతుంటే మనబుర్రల్లో ఒక యాదృచ్ఛిక కాల్క్యులేటరుంటుంది. మనకి తెలీకుండానే అది ఇలా లెక్కలు గట్టి మనల్ని మందబుద్ధులని చేసేస్తుంది. ఏదేశానికా దేశంలో ఆయా కరెన్సీలో ఆదాయమూ, వ్యయమూ కూడా జరుగుతాయని ఒకంతట రిజిస్టరవదు మనబుర్రల్లో. "నేను ఇప్పుడు టెక్సస్‌లో ఉన్నాను, ఇక్కడ విస్కాన్సిన్ ధరలు కోరుట అమాయకత్వమో తెలివితక్కువతనమో అనబడును" అని నాకు రిజిస్టరవడానికి ఆరు వారాలు పట్టింది.

ఊరుసంగతి అదీ. నీరు సంగతి మరీ విచిత్రం. నా స్నేహితురాలింట్లో మృదువునీళ్ళు. మృదువునీళ్లేమిటి అంటే మరి సాఫ్టువేరులో సాఫ్ట్‌కి మృదువు అంటున్నారు కదా. ఆ పదం వారికి హక్కుభుక్తములు అవునో కాదో నాకు తెలీదు కానీ భావిపండితులతో తలపడతగదు గనుక పనిలో పనిగా వారికి ఇవే నా కృతజ్ఞతలు. అన్నట్టు సాఫ్టువేరు మృదులయంత్రం అయితే మరి హార్డువేరు కఠినయంత్రము అనాలా?

ఇంతకీ మా సుధఇంట్లో నీళ్లు చాలా మృదువు. కాశీమజిలీకథల్లో నవపల్లవకోమలాంగుల సురుచిరహస్తాల్లా అన్నమాట. ఎంత కడుక్కున్నా ఇంకా చేతిని సబ్బున్నట్టే ఉంటుంది. అందుకు పూర్తిగా విరుద్ధం నా ఎపార్ట్‌మెంటులో నీళ్ళు. "నీళ్ళు కావివి రాళ్ళు" అని గట్టిగా చెప్పగలను. రాళ్లతో చేతులు కడుక్కుంటున్నట్టే ఉంటుంది. నురగే రాదు. దాంతో కొంచెం రిసెర్చి చేశాను. ఈ కఠినజలాలు తాగితే అందులో వున్న మినరలులూ అవీ నాఒంట బట్టి నేనేమయినా రాటు తేల్తానేమోనని. అదేం లేదుట. నురగరాదంతే అంటూ చప్పరించేశాయి ఆ వ్యాసాలు. ప్చ్.

సైంటిస్టులకి అట్టే బాధ లేదు కానీ నాకు మాత్రం ఈ నీళ్ళు పడుతున్నట్టు లేదు. వారంరోజులుగా దగ్గు, పడుకుంటే లేవబుద్ధి పుట్టదు. సమయానికి సుధ ఊళ్ళో లేదు కానీ నన్ను వాళ్ళింటికి తీసుకుపోయి. సకలసేవలూ చేసి ఉండేది. ఇలా ఎందుకంటున్నానంటే, పక్కమీంచి లేవబుద్ధి పుట్టదు, కానీ బాగా ఆకలేసి,

లేచినతరవాత మాత్రం చక్కగా వంట చేసుకు ముప్పొద్దులా మూడు కంచాలు చెల్లిస్తున్నా. అందులో లోపమేమీ లేదు. హీహీ. పైగా రాత్రీ పగలూ కలిపి రోజుకి కనీసం 10న్నర గంటలు నిద్రపోతున్నా. నిజంగా రోగమో రొచ్చో ఉంటే ఇవి సాధ్యం కావనే నా అనుమానం.

నీళ్ళమార్పు ఇలా ఉంటే, డ్రైవింగుమార్పులు మరింత హుషారిచ్చే కథ. వచ్చే టపాలో వివరిస్తాను.

(డిసెంబరు 30, 2010)

## మార్పు 5

అదే కిటికీలోంచి చూస్తున్నా. నిన్నటికీ ఇవాళ్టికీ ఎంత తేడా!

నాకు ఎక్కడో ఓమూల ‘‘నాఇంటికొచ్చిన’’ అనుభూతి! “I am home!” …

విస్కాన్సిన్ మంచు ఎట్టకేలకు కనిపించింది. తడితడిగా, బురదబురదగా … ఈదురుగాలిలో అల్లల్లాడుతున్న కలబంద మొక్కలు … నాకు నవ్వొచ్చింది. దాదాపు నాలుగు నెలలు నిత్యసత్యం అయిన వాతావరణం ఇక్కడ ఒకటో రెండో రోజులు … వారం రోజులంటున్నారు కానీ నాకు నమ్మకం లేదు. ఎంచేతంటే 50, 60 డిగ్రీలున్న రోజున కూడా కొందరు రెండంగుళాల మందం కోట్లేసుకు తిరుగుతున్నారు. అంచేత వాళ్ళ పరిభాషలో చలికీ నా చలికీ చాలా తేడా ఉంది.

నేనిక్కడికి రాగానే పాతికేళ్ళ స్నేహితులదగ్గర్నుంచీ కొత్తగా పరిచయం అయినవాళ్లదాకా ప్రతివారూ నాకు చెప్పేరు మంచు పడినప్పుడు వీధిలోకెళ్ళొద్దని.

సరేనన్నానే కానీ ఇప్పుడు మాత్రం వెళ్ళాలనే అనిపిస్తోంది. వెళ్తే బాగుండు. మీకూ తెలుసు కదా నా చోదకచాకచక్యం. నా చాకచక్యంమీద నాకు గొప్ప నమ్మకం.  విస్కాన్సిన్, షికాగోలోనే కారు నడిపేను ఇదెంత అన్నాను వాళ్ళతో గొప్ప పడిపోతూ.

‘‘అదికాదు మాల్తీ, అక్కడ బోలెడు మంచుంటుంది కనక కార్లు తోలేవాళ్ళకి అలవాటు కూడా ఉంటుంది దాన్ని సమర్థించుకుంటూ పోడం. ఇక్కడ మాకు మహా అయితే సంవత్సరానికి రెండు రోజులు, మాకు రోడ్లు క్లియర్ చేసే బండ్లూ లేవు అంత మంచులో కార్లూ నడిపే అలవాటూ లేదు కదా. అంచేత డ్రైవర్లకి ఆ యాదుండదు,’’ అంది సుధ.

ఆ అమ్మాయితో సరేలే అన్నానే కానీ ఊరుకో బుద్ధి పుట్టలేదు. బయల్దేరేను. తీరా బయల్దేరబోతూంటే బుర్రలో చిన్న పురుగు పొడిచింది - గతనాలుగు వారాల్లో నా కారు నడుపు చరిత్ర చూసుకోమంటూ.

... రెండువారాలక్రితం సుధని పిలిచి అడిగితే. ఇండియన్ స్టోరు నాకు దగ్గరే అని చెప్పి, ''మాయింటికి లెగసీమీద ఎడంవేపు తిరుగుతావు గద, ఇటు కాక అటు, ఎడంవేపు తిరిగితే, ఆరోడ్డుమీదే ఉంది,'' అంది.

ఒస్ అంతే కదా అని బయల్దేరేను. లెగసీమీదకెక్కి ''ఇంకా కనిపించదేం?,'' .''ఇంకా కనిపించదేం?'' అనుకుంటూ వెళ్తున్నా... రోడ్డు అంతమయిపోయింది. రోడ్డు అయిపోయింది. ... హెూ హెూ హెూ ..

... బ్రేకులమీద బలంగా తొక్కేను, స్టీరింగువీలు గట్టిగా పట్టుకుని, కళ్ళు రెండూ గట్టిగా మూసుకుని ... క్షణంలో సగంసేపు... కళ్ళు తెరిచేను. ఎదురుగా ఉన్న ఎలెక్ట్రిక్ పోల్‌కి నాకారూ నేనూ కృష్ణసర్పంలా చుట్టుకుపోయేవాళ్ళం. . తృటిలో తప్పిపోయింది కానీ ...

చుట్టూ చూశాను. ఇటువేపో కారూ, అటువేపు మూడు కార్లూ ఆగి చూస్తున్నాయి. ఆ రోజు కనీసం మూడు ప్రమాదాలు తప్పేయి. అవి ఏమిటంటే -

1. నేను ఆ పోలుకి కారుతో సహా ఆహుతి అయిపోలేదు.

2. అటూ ఇటూ ఉన్న కార్లలో ఒక్కటీ పోలీసు కారు కాదు. అయుంటే నాకో పెద్ద టికెట్టొచ్చేది. పెద్ద అంటే మన సన్మానపత్రాల్లా 24 బై 18 అట్టమీద రంగులబొమ్మలతో అని కాదు. కాయితం చిన్నదిగానే ఉంటుంది కానీ దానిమీద అంకె చాలా పెద్దదిగా ఉంటుందిట. ఎంత పెద్దది అని అడగలేదు ఎంత పెద్ద అంకె వినవలసివస్తుందో అని భయపడి.

3. ఇరుగు పొరుగు కార్లవారు ఠక్కున తమ సెల్లు తీసి పోలీసాళ్ళని పిలిచేయలేదు. విస్కాన్సిన్‌లో అయితే ఇది జరిగి ఉండుననే నా నమ్మకం.

ఇంతకీ లెగసీమీద నాకు ఇండియన్ స్టోరు ఎందుకు కనిపించలేదంటే., నేను లెగసీమీద కుడివేపు తిరగలేదు. ఎందుకంటే, అప్పటికి నాకు సుధయింటికి మాత్రమే వెళ్ళడం అలవాటయింది మునిసిపాలిటీ ఎద్దులా ... అంచేత తను కుడివేపుకి వెళ్లమందన్నమాట నాబ్రురకెక్కలేదన్నమాట, హీహీ. ఏం చేస్తాం? అసలు ఇక్కడికొచ్చిందగ్గర్నుంచీ నేను దిక్కు తోచనిదాన్నయిపోయేను. అంటే దిక్కులేనివారికి దిక్కు అయినవాడు నాకు మాత్రం కరెక్టు దిక్కులు సూచించుటలేదు. ☹.

అసలు ఇక్కడ రోడ్లు విశాలం, ట్రాఫిక్కు తక్కువన్నమాట నిజమే కానీ రోడ్ రూళ్ళు మాత్రం విస్కాన్సిన్ రూలులని తలదన్నేలా ఉంటాయి. అక్కడిసంగతులు ముందోసారి మనవి చేసుకున్నాను కదా. (చూ. ఊ,.పో. 17. మహావీరచక్ర)

ఇక్కడ రోడ్డుకి నాలుగేసి లేనులయితే ఉంటాయి కానీ యు-టర్నుకో లేనూ, నేరుగా లేక ఎడమవేపు తిరుగుటకో లేనూ, తీరా ఎడమవేపు తిరిగినతరవాత మళ్ళీ ఎడమవేపుకి మాత్రమే తిరగడానికో లేనూ - ఈలేనులో తిరిగితే ఇందాకా చెప్పిన యు-టర్ను తీసుకుని వెళ్ళినట్టే మళ్ళీ అదే లేనులో తేల్తాం, ...

ఆ తరవాత నేరుగా వెళ్ళినరోడ్డుమీద ఓ రెండువందలగజాలు వెళ్తే "తప్పనిసరిగా కుడివేపుకి తిరగవలెను" అంటూ ఒక తాఖీదు కనిపిస్తుంది. నిజానికి అక్కడ కుడివేపు తప్ప మరోవేపు వెళ్ళడానికి వీల్లేదు. ఎందుకంటే ఎదురుగా ఏ మహా చక్రవర్తిగారి కోటప్రాకారమో అనిపించే రాతికట్టడం కనిపిస్తుంది. నేరుగా వెళ్తే దానిని ఢీకొంటాం. ఎడమవేపు చూస్తే సువిశాలంగా టెక్సస్ బంజరుభూములు దర్శనమిస్తాయి. ఇంకెక్కడికెళ్తాం కుడివేపుక్కాక?

అలాటి దుర్గమమార్గందగ్గర కూడా ఓ స్టాపు సైనూ, "ట్రక్కులకి ప్రవేశము లేదు" అంటూ మరో సైనూ. ఎలాగా ఎడమకి లేదు, ఎదటికి లేదు. నో యు-టర్న్ అని లేదు కానీ అంత పెద్ద ట్రక్కులు యు-టర్నంటే మాటలు కాదు కదా .. మరి అక్కడిదాకా వచ్చిన ట్రక్కు ఎక్కడికెళ్తుంది? గాల్లోకి ఎగిరి పొమ్మనా ఈ సిటీ ఇంజినీర్ల అభిప్రాయము? కనీసం ఆ సైనేదో ఆ సందుమొగలోనే పెట్టొచ్చు కదా. నేను ట్రక్కు నడపడం లేదు కానీ నడిపితే మాత్రం ఆ ట్రక్కు తీసికెళ్ళి ఆ ఇంజినీరు ఇంటిముందు పెట్టేసేదాన్ని.

సరి, మీరు ఇంతదాకా చదివివుంటే, ఈసరికి మీకు మహ చిరాకేస్తూ ఉండి ఉండాలి. "సరేనమ్మా, అర్థమయింది నీ అవస్థ. తరవాతికథకి తరలుము" అని మీకు అనాలనిపిస్తుంది కూడా అనుకుంటాను. .. అదేనండీ నేను చెప్తున్నది కూడా... మీకయితే ఈ ఒక్కసారే కానీ నాకు తెల్లారి లేచి వీధిన పడ్డదగ్గర్నుంచీ దినదినమూ ఇదే మేళం. ... ఇలాటప్పడే నా వయసు నాకు గుర్తొచ్చేది కూడా. అంటే ఇలాటి సందర్భాలు రోజుకి రెండు చొప్పన ఎదురుపడ్డా, ... ఇన్నేళ్ళకి ఎన్ని అనుభవించి ఉంటానో ఆలోచించుకోండి ....

బహుశా ఈ చట్టాలు తయారు చేసేవాళ్ళని "మీరెందుకిలా అర్థం పర్థంలేని నిబంధనలు పెడతారు?" అని అడిగితే, "మేం చెయ్యగలం కనక," అంటారేమో? లేక జనాలకి బుర్రల్లేవనుకున్నారో? ఈ రెండోదే నిజం కావచ్చు. లేకపోతే ప్రతి చిన్నవిషయానికీ "మాకు హక్కులున్నాయి, అక్కులున్నాయం"టూ అక్కులు నొక్కుకునే జనాలు ఇలాటి తిక్క నిబంధనలకి ఎందుకు ఎదురుతిరగరు?!

ఈ వీధిభాగోతాల్లాగే ఇక్కడికొచ్చేక నేను శాస్త్రోక్తంగా పాటిస్తున్న మరో కఠిననియమం సీట్ బెల్టు. విస్కాన్సిన్‌లో కూడా అది "లా"యే కానీ ఆ బొంతకి చాలా కంతలున్నాయి - చట్టవిరుద్ధం కానిపే.

మామూలుగా ఆ పాలియాస్టరు పటకా వేసుకోపోతే పోలీసులు మనని ఆపడానికి రూల్స్లేవు. మరో ప్రమాదం జరిగితే, అప్పుడు రెంటికీ కలిపి ఇచ్చుకుంటారు తాంబూలం. మరో చట్టసమ్మతమయిన గుట్టు - డ్రైవరు కనీసం ఐదడుగులయినా లేకపోతే ఒక ప్రమాదం జరిగినప్పుడు జరగగల మరో ప్రమాదం ఆ పటకామూలంగా డ్రైవరు కంఠం సమూలంగా నరుక్కుపోగలదు. వేరు చెప్పనేల. ఈరెండు రంధ్రాలతో పాటు, ఇంకా "అది వేసుకుంటే కట్టి పడేసినట్టుంటుంది, నాకు ఊపిరాడదూ, నాకు అదేదో ఫోబియా" .. ఇలా వాదించుకుంటూ దినాలు గడుపుకున్నాను అక్కడ ఉన్నన్నాళ్ళూ.

ఇక్కడికి వచ్చేక, "అదేం పనికిరాదు, ఇక్కడ టిక్కెట్టు చాలా పెద్దది ఇచ్చేగల్రు జాగ్రత్త" అని హెచ్చరించింది సుధ. చెప్పేను కదా అసలు ఇక్కడికొచ్చిందగ్గర్నుంచీ నాకు దిక్కు తోచడం లేదని. అసలే కొత్తమొహం అని ఓ కన్నేసి ఉంచుతారు మామూలుగా అధికారం ఉన్నవాళ్ళు.. వీళ్ళతో పేచీలెందుకులే అని ఆ పటకా ఎంతో శ్రద్ధాభక్తులతో ... మంగళసూత్రములంత పవిత్రమయినవిగా ... ధరిస్తున్నాను ఇప్పుడు. నాకు అది వేసుకున్నానన్న స్పృహ ఉండడంలేదిప్పుడు, ఆశ్చర్యమ్!

నేను ఇలా ఆలోచించుకుంటుంటే ఫోనొచ్చింది..

సుధ "నువ్వు పార్టీలకి రానంటావు. వీళ్ళందరూ నిన్ను హాబ్స్‌లో చూసినారు కదా. పిలస్తున్నారు. ఒకసారి వచ్చి పోగూడదా?" అంటూ.

నిజం చెప్పొద్దూ, ఇక్కడికొచ్చేక, సుధని చూసి నేను నేర్చుకోవలిసింది చాలా ఉందనిపిస్తోంది ఈమధ్య. అంచేత, "సరేలే. ప్రతిసారీ రానన్నాను కానీ అస్సలు రానన్లేదు కదా. ఎప్పుడు చెప్పు," అన్నాను.

"ఈ శనివారం. సౌజన్య ఇంట్లో. నేను మీయింటికొచ్చి పిల్చకపోతాలే." అంది.

సరేనని చెప్పి ఫోను పెట్టేశాను.

ఊరూ, నీరూ, కారూ, ఆమీదట మనవారూ ...

(జనవరి 12, 2011)

## మార్పు 6

ఆదివారం సౌజన్య ఇంటికి వెళ్ళేను, నాస్నేహితురాలితో.

మేం వెళ్ళేసరికి ఓ పదిమంది ఉన్నారు. సుధ చనువుగా లోపలికి వెళ్ళి నలుగురినీ పలకరిస్తోంది. నేను సందేహిస్తూ వెనక నించున్నాను. ఇంతలో ఒకావిడ నావేపు వస్తూ కనిపించింది. ఎక్కడో చూసినట్టుందే అనుకుంటూ పరకాయించి చూస్తున్నాను.

తిన్నగా వచ్చి నాకు ఎదురుగా గజందూరంలో నిలబడింది చిన్నగా నవ్వుతూ. చూస్తూ నిలబడిపోయేను రెప్పపాటుకాలం నేను.

"గుర్తు పట్టలేదు," అందావిడ కొంటెతనం కళ్ళలో మెరుస్తుంటే.

"సిరి" అన్నాను నెమ్మదిగా, నన్ను నేను నమ్మించుకోడానికి ప్రయత్నిస్తున్నట్టు.

శ్రీదేవి దగ్గరగా వచ్చి నాచెయ్యి తనచేతిలోకి తీసుకుని "నువ్వు మాత్రం ఏం మారలేదు" అంది.

"మారలేదా? ఏమో. మారని రూపాయిని మరి," అన్నాను నేను కూడా నవ్వుతూ. "పదేళ్ళయిందేమో కదూ."

"ఇంకా ఎక్కువే అయుంటుంది. మేం షికాగో వదిలేసింతరవాత ఓ ఆర్నెల్లు  కొంతకాలు ఫోనులో మాటాడుకున్నాం. తరవాత అంతే సంగతులు కదా,"

అవునన్నట్టు తలూపేను. సిరి షికాగోలో ఉన్నంతకాలం, తరుచూ కలుసుకునేవాళ్ళం.  మొదట పరిచయం తనే అయినా ఆవిడతో కన్నా నాకు వాళ్ళాయన ప్రభంజనంగారితోనే ఎక్కువ కాలక్షేపం అయేది. ఆయన ఆపకుండా ఆరుగంటలు మాటాడగలరు ఏవిషయంమీదైనా సరే. సిరేమో నాలుగుమాటల్లో ముగించేసేది ఎంత క్లిష్టమైన ప్రశ్నయినా.

"ఇంతకీ నువ్వు షికాగోలోనే ఉన్నావా?"

నేను చుట్టూ చూసి, "షికాగోలోనా? ఇది టెక్సస్ అనుకుంటున్నానే," అన్నాను వెక్కిరిస్తూ.

"హా హా. ఏమో, చుట్టపుచూపుగా, కేవలం నన్ను చూడ్డానికే వచ్చేవేమో అనుకున్నా."

"అదేమిటి?" ఓ చిన్న అమ్మాయి నా ఎదురుగా నిల్చుని నాచేతిలో ఉన్న చిన్న పొట్లం చూస్తూ అడిగింది. తొమ్మిదేళ్ళుంటాయేమో. చురుకైన కళ్ళు, గుండ్రని మొహం, పాలబుగ్గలూ ముద్దొస్తోంది.

"ఇదా? ఇది రహస్యం," అన్నాను నవ్వుతూ.

ఆ అమ్మాయి నాకు ఇంకా దగ్గరికొచ్చి, "నేను ఎవరికీ చెప్పనులే," అంది.

"నీపేరేమిటి?"

“అపర్ణ. అదేంటో చెప్పు.”

… … …

“అమెరికా అంతరించే సమయం ఆసన్నమయింది. చరిత్రలో ఏ సామ్రాజ్యం మాత్రం శాశ్వతంగా ఉండిపోయింది కనక?” నాలుగు కాలాలు చూసిన పెద్దాయన చారిత్రక సత్యాలని వల్లిస్తున్నారు.

ఈమధ్యనే పట్టం పుచ్చుకున్న యువకుడు అమెరికా తిరిగి పుంజుకుంటుందనీ, ప్రపంచంలో మేధావులందరికీ ఇదే మహాప్రస్థానం అనీ వాదిస్తున్నాడు.

…         …          …

“బిస్క్విత్ అదీ వాడనండీ నేను. స్క్రాచ్ నించీ చేసేను” అన్నారు గులాబ్ జాం చేసి తీసుకొచ్చినావిడ.

బొప్పాయికాయ కూర ఎలా చెయ్యడమని అడుగుతోంది అమెరికాకి కొత్తగా కాపురానికొచ్చిన మనోహారిణి.

ఇద్దరు మొగపిల్లలు - పది, పన్నెండేళ్ళవాళ్లు బ్లాక్ బెరీలో ఏవో గేములాడుకుంటున్నారు ఓమూల కూర్చుని. ఎదురెదురుగా కూచుని ఇంటర్నెట్‌లో ఆడుతున్న వాళ్ళని చూస్తే నాకు తమాషాగా అనిపించింది. మనం ఒకరికొకరు ఎందుకు దూరమవుతున్నామో చెప్పడానికి అంతకన్నా సాక్ష్యం ఏం కావాలి?

ooo

టీవీ ఆన్‌లో ఉంది. ఏదో తెలుగు సినిమా గోలగోలగా. నాకు ఒక్క ముక్క కూడా అర్థం కావడంలేదు. … ఎవరూ చూస్తున్నట్టు కనిపించలేదు. ఎందుకు అది ఆన్లో ఉందో నాకర్థం కాలేదు.

“అయితే నువ్వు ఇండియా వెళ్ళే ఆలోచనలేమైనా ఉన్నాయా?” శ్రీదేవి అడిగింది ఏదో మాటాడాలన్నట్టు.

“లేదు. ఈమధ్యనే వెళ్ళొచ్చేను ఆర్నెల్లయింది. మళ్ళీ రెండేళ్ళవరకూ ఆమాటెత్తను,” అన్నాను.

“తెలంగాణా ఇచ్చేయక తప్పదు. బందులూ, ధర్నాలూ దేశం అట్టుడికినట్టు ఉడికిపోతోంది,” అన్నారు నాయుడుగారు.

ఎవరూ జవాబు చెప్పలేదు. అమెరికాలో ఆర్థికసంక్షోభంగురించి మళ్ళీ అందుకున్నాడు ఇందాకటి అబ్బాయే. తెలంగాణాసమస్య కంటే అమెరికా పరిస్థితులే ఎక్కువ ముఖ్యం కదా మరి అతడికి.

“ఆదివారం టెంటక్స్ సభకి వస్తావా?”

“ఎవరు మాటాడుతున్నారు?”

“ఎవరో రాగరాజు గంతాకులట.”

“ఏం మాటాడతారేమిటి?”

“ఈమధ్యే వచ్చిన పుస్తకంమీదట.”

“దానికో సభా? మనమే ఆ పుస్తకమేదో చదివేస్తే పోలా?”

“లీలగారేరీ, రాలేదా ఇంకా?”

“అదుగో, మాటల్లోనే వచ్చేరు నూరేళ్ళాయుష్షు”

“ఏమండీ లీలా పొన్నాగారూ, అసలీమధ్య ఎక్కడా కనిపించడంలేదు? బొత్తిగా నల్లపూసయిపోయారు.”

“నల్లపూసేంటండీ, నల్లపూసా, కారప్పూసా? మీరు మరీనూ ... ఇంతటి మహా కాయం నూటతొంభైఎనిమిది పౌన్లు కనిపించడంలేదా మీకు? నిన్ననే సందార్‌గారు ఐస్‌క్రీం మేకరు తెచ్చేరు. ఆ రెండు పౌనులూ కూడా పడితే, రెండూ, రెండు సున్నాలు అని ఎంచక్కా చెప్పుకోవచ్చు తేలిగ్గా ఉంటుందంటూ ...”

స్థానికులభాషలో సందార్ అయిన సుందరం ఆవిడకి రెండడుగులు వెనక వస్తూ అందుకున్నారు, “ఏం చెయ్యనండీ? నాకెలాగా తినే యోగం లేదు. తినేవారిని చూసైనా ఆనందిద్దామని,” అన్నారు.

“చెప్పేనా కిందటివారం మంచం కొన్నాం అని. మన తాతలనాటి పందిరిమంచంలా రెండడుగుల ఎత్తుంది. నిన్న మంచం దిగబోతూ కింద పడిపోయేను. అయ్యో పడిపోయింది అని చెయ్యందియ్యడం పోయి, ఒకటే నవ్వు ఈ మహరాజు.”

“నువ్వంటే దిట్టంగా గుమ్మడిపండులా ఉన్నావు. కింద పడ్డా నీకేం కాదు. నేను చెయ్యందించి నిన్ను లేవనెత్తబోయి నేనే పడ్డానంటే పులుసులోకి ఎముక లేకుండా చితికిపోయేవాణ్ణి కాదూ?”

“యం.పి.సి” అంటూ గొణిగింది నాపక్కనున్న పదహారేళ్ళమ్మాయి.

"హెల్దీ, హెల్దీ అంటూ మేకల్లా ఆ ఆకులూ అలములూ నమలకపోతే నాలా చక్కగా కడుపునిండా షడ్రుచులతో కమ్మగా కడుపునిండా తినకూడదా, నువ్వు కూడా నాలా కండ బట్టి నేవళం తేలేవాడివి."

ముగ్గురు మొహాలు ఇబ్బందిగా పెట్టేరు. మరో ఇద్దరు లేచి పక్కగదిలోకి వెళ్ళిపోయేరు. ఒక్క నాకు మాత్రమే అనుకుంటా అదేమంత ఎబ్బెట్టుగా అనిపించలేదు. నాతరంలో మొగుడూ పెళ్ళాలు ఒకరినొకరు ఇలా ఎత్తిపొడుచుకోడాలూ, వేళాకోళాలాడుకోడాలూ మామూలే. అప్పట్లో మేం దాన్ని హాస్యంకిందే తీసుకుని నవ్వేసుకునేవాళ్ళం. మాకు అదే సిట్ కామూ, స్టాండప్ కామెడీ హాస్యరస నాటకం అన్నీ. ఈ హాస్యం మునిమాణిక్యం, పానుగంటి రచనల్లో చూడలేదూ? అదేమిటో మరి. ఎప్పుడు ఎలా మారిపోయిందో తెలీదు కానీ ఈ తరంవారికి ఇది అసభ్యత, అవమానం, నీచం కూడానేమో. ఇలాటివి ఇప్పుడు టీవీలోనూ కామెడీ క్లబ్బుల్లోనూ మాత్రమే చెల్లుతాయి.

ooo

"లీలగారూ, రండి. అప్పడాలవేపుడు మీ స్పెషాలిటీ కదా. నూనె కాగింది." అంటూ సౌజన్య వచ్చింది.

లీలగారు ఒక్క ఉదుటున లేచి, "అయ్యయ్యో, నూనె పొయ్యిమీద పెట్టేశావా? ఎన్ని అప్పడాలు, ఎంత నూనె, ఎంత టెంపరేచరు చూసుకోకుండా," అంటూ వంటింటివేపు నడిచారు గబగబా కొంపలంటుకుపోతున్నట్టు.

ఆవిడ హుషారు చూస్తే చెప్పొద్దూ నాకు మహ సరదా వేసింది. ఆవిడ వెళ్ళినవేపే చూస్తూ, "అప్పడాలవేపుడుకి కూడా స్పెషాలిటీనా?" అన్నాను శ్రీదేవితో.

"మీకు తెలీదులెండి. వంటా వార్పూ పుస్తకం చూసి మూడు పేకట్ల అప్పడాలు నాలుగు క్వార్టుల నూనే తగలేసి, ఆర్నెల్లు ప్రాక్టీసు చేసింది. దేశం నలుమూలలా ఎవరింట్లో అప్పడాలు వేయించాలన్నా ఆవిణ్ణే పిలుస్తారు" అన్నారు సుందరంగారు.

"సరే. నాక్కూడా ఆవిడ నెంబరివ్వండి. ఎప్పుడవసరం వస్తుందో," అన్నాను గంభీరంగా.

"మొన్నే కదా పట్టుకెళ్ళేవు అప్పుడే చదవడం అయిపోయిందా?"అన్న ప్రశ్న విని అటు తిరగేను. నాకు నాలుగు సీట్లు ఎడంగా కూర్చున్న గోపాచార్యగారు ఓ పన్నెండేళ్ల అబ్బాయిచేతిలో పుస్తకాలు చూస్తూ అడుగుతున్నారు. కఠోపనిషత్తు, మాండూక్యోపనిషత్తూ వాటికి శంకరభాష్యాలు. ఆ పుస్తకాలు ఆ అబ్బాయి చేతిలో ముందు చూశాను కానీ వాళ్ళమ్మో నాయనమ్మో చదువుతారు కాబోలనుకున్నాను కానీ అతనే చదువుతాడనుకోలేదు.

“చదివేను,” అన్నాడు ఆ అబ్బాయి తలొంచుకుని.

ooo

కాస్త ఎడంగా గోడవార కూర్చుని ఐఫోనుల్లో ఆటలాడుకుంటున్న ఇద్దరు పిల్లల్లో పెద్దాడు “నాన్నా!” అంటూ కూత పట్టేడు. వాడిని చిన్నాడు మోసం చేస్తున్నాడుట.

నేనేం చెయ్యలేదంటాడు చిన్నాడు.

పిలుపందుకున్న నాన్న చిన్నవాడిదగ్గరికి వెళ్ళి, నలుగురు కూడిన చోట అరచుట మర్యాద కాదనీ, అన్నదమ్ములు పోట్లాడుకోకూడదనీ, ఆటల్లో గెలుచుట ఒక్కటే ముఖ్యము కాదనీ - ఇలాటివే మరి కొన్ని సాంఘికమర్యాదలు పాఠం చెప్పి వచ్చేరు.

చిన్నాడు కళ్ళు చిట్లించి కొంటెగా నవ్వుతూంటే, పెద్దాడు మూతి ముడుచుకుని అమ్మపక్కన చేరేడు.

ooo

దాదాపు మూడయింది. ఒకొక్కరే ఇళ్ళకి మళ్ళడానికి ఉద్యుక్తులవుతున్నారు. నేను కూడా సుధవేపు చూశాను పదమన్నట్టు.

“మాయిల్లు అట్టే దూరం లేదు. రాకూడదూ. మాఅక్కని కూడా చూడొచ్చు” అంది సిరి నాతో.

“మీ అక్కయ్య ఇక్కడున్నారా?” అన్నాను సాలోచనగా.

“ఆర్నెల్లయింది వచ్చి. మాబావగారు పోయేక అక్కడ ఒక్కత్తీ అవస్థలు పడుతోందని తీసుకొచ్చేశాను. నాదగ్గరే ఉంటుంది. ఏం వస్తావా?”

నాకు ఇప్పటికే నీరసం వస్తోంది. కలగలపుతనం చాలా తక్కువస్థాయిలో ఉంది నాకు.

“ఇవాళ కాదులే. మరోసారి వస్తాను. ఇప్పటికే చాలామందిని కలుసుకున్నాను కదా. వీళ్ళందర్నీ గుర్తు పెట్టుకోడానికి ఇంటికెళ్ళి మెంటల్ సాము చెయ్యాలి ఒగంటసేపు.”

“సరే. నీనెంబరియ్యి. ఫోను చేసి దారి చెప్తాను. మీఇంటినించి అరగంట కంటె ఉండదు.”

అలాగేనంటూ తలూపి చిన్న కాయితంమీద నెంబరు రాసిచ్చేను. ఓ రెండున్నరగంటల కాలంలో సగం ఊరు చూసినట్టనిపించింది నాకాపూట.

(ఇంకా ఉంది)

మార్పు 7

“లోకంలో నీతీ న్యాయం - రెండూ సమాజశ్రేయస్సుకే అయినా రెంటికీ పొత్తు లేదెంచేతో,” అంది సిరి ఎటో చూస్తూ.

“ఏం ఈ రోజు, న్యాయాన్యాయాలవేపు మళ్ళింది బండి,” అన్నాను పక్కనే కూర్చుంటూ.

టీవీలో కోర్ట్ టీవీ చూస్తోంది. అది నాక్కూడా ఇష్టం. బహుశా కనీసం టీవీలోనైనా న్యాయం జరుగుతోందన్న సాంత్వన కావచ్చు.

నిజానికి అన్ని కేసుల్లోనూ న్యాయమే జరగదు. ముఖ్యంగా పుష్టిగా కనిపించేవాళ్ళు ఏదో వంక చెప్పి, సర్టిఫికెట్టొకటి పుట్టించుకుని, సోషల్ సెక్యూరిటీ వసూలు చేసుకుంటున్నారు. వాళ్లని చూస్తే నాకు మహ మంటగా ఉంటుంది. వాళ్ళు నాడబ్బేదో దోచుకుంటున్నట్టు. నిజానికి ఒకవిధంగా ఆలోచిస్తే అది నిజమే కూడాను. నేను సోషల్ సెక్యూరిటీకి సంమర్పించుకున్న డబ్బు వాళ్ళు వసూలు చేసుకుంటున్న సొమ్ములో ఉంది కదా.

“అది కాదు. మనకి చిన్నప్పటినించీ నూరిపోసేది ఏమిటీ? ధర్మపన్నాలే కదా. ఆ తరవాత కాస్త అక్షరపుముక్కలొచ్చేక భారతాలూ భగవతాలు చదువుతాం. అందులో సత్పురుషులు చేసే అధర్మాలన్నిటికీ ఏవో బీరకాయపీచు వివరణలు ఉంటాయి. ధర్మారాజు అశ్వత్థామ హత: కుంజర: అన్నా, హరిశ్చంద్రుడు ఇల్లాలిని అమ్మకానికి పెట్టినా, శ్రీరామచంద్రుడు సహధర్మచారిణిని అడవులపాలు చేసినా ధర్మసమ్మతమే. అటు చూడు,” అంది టీవీవేపు చూపుతూ.

ఈకోర్టు టీవీల్లో కేసులు నిజం కేసులే.

18 ఏళ్ళ అబ్బాయి తండ్రిమీద కేసు పెట్టేడు. ఆ తండ్రి తన క్రెడిట్ కార్డూ, సోషల్ సెక్యూరిటీ నెంబరూ వాడుకుని అప్పులు చేసేశాడనీ, తన్మూలంగా తన క్రెడిట్ హిస్టరీ చిక్కుల్లో పడిందనీ, ఆ అప్పులకోసం అప్పులాళ్ళు తనవెంట బడుతున్నారనీ ఆ అబ్బాయి కేసు. ఆ అప్పులన్నీ కుటుంబంకోసమే చేసినందున తండ్రిగా తనబాధ్యత తాను నిర్వర్తించేనని తండ్రి వాదన.

జడ్జీగారు ఆ అబ్బాయిని అడుగుతున్నారు. “స్కూల్లో బాగా చదువుతున్నావా?”

“చదువుతున్నాను యువరానర్.”

“ఏ గ్రేడ్స్ వస్తున్నాయి?”

“ఒక ఎ, బీలు, వచ్చేయి. ఒక సి వచ్చింది.”

తండ్రిని ప్రశ్నించేరు. “ఏం ఉద్యోగం చేస్తున్నావు?”

“కన్స్ట్రక్షన్.”

“ఇప్పుడేం చెయ్యడంలేదండీ,” అన్నాడు కొడుకు.

జడ్జీగారు అతన్ని మాటాడొద్దని సౌంజ్ఞ చేసేరు.

“కట్టడంపనిలో ఇప్పుడున్నావా?”

“లేదు. రిసెషన్‌మూలంగా పని దొరకడంలేదు.”

“అంటే నీజవాబు ఇప్పుడు పని చెయ్యడంలేదు అని.”

“పనికోసం చూస్తున్నాను.”

“నీకు పూట ఎలా గడుస్తోంది?”

“ఐ మేనేజ్.”

“ఎలా మేనేజ్ చేస్తున్నావని అడుగుతున్నాను.”

“స్నేహితులు సాయం చేస్తున్నారు.”

అబ్బాయి మళ్ళీ అందుకున్నాడు, “నా క్రెడిట్ కార్డ్‌మీద గర్ల్ ఫ్రెండుకి బట్టలు కొన్నాడు. ఇద్దరూ వెకేషనుకి వెళ్ళేరు. కారు కొన్నాడు.”

“కారు కొన్నావా?”

“పని వెతుక్కోడానికి కావాలి.”

“నా ప్రశ్న అది కాదు. కారు కొన్నావా. జవాబు అవునో కాదో అవుతుంది.”

“అవును.”

“కొనడానికి డబ్బెలా వచ్చింది?”

“క్రెడిట్ కార్డుమీద.”

“ఎవరి కార్డుమీద?”

‘‘అబ్బాయికార్డు.’’

‘‘నీకార్డుమీద ఎందుకు కొనుక్కోలేదూ?’’

‘‘నాక్రెడిట్ మెసప్ అయింది. నేనిన్నాళ్ళూ ఆ అబ్బాయికి ఎంత ఖర్చు పెట్టేనో ...’’

‘‘అది తండ్రిగా నీధర్మం.’’

అబ్బాయికి అనుకూలంగా తీర్పు జరిగింది. ఇద్దరూ బయటికి వచ్చేరు. కోర్టు వరండాలో నిటారుగా నిలబడి, ఆ తండ్రి తానేమీ తప్పు చెయ్యలేదనీ, జడ్జీగారు సందర్భం సరిగ్గా అర్థం చేసుకోలేదనీ నొక్కి చెబుతున్నాడు.

సిరి నిట్టూర్చి అంది, ‘‘చూశావా. బొత్తిగా ఇరవైఏళ్ళయినా లేని కుర్రాడు. వాడికి ముందు ముందు ఇంకా ఎంతో జీవితం ఉంది. క్రెడిట్ హిస్టరీ ఇంకా మొదలయిందో లేదో అప్పుడే తండ్రే దాన్ని తన సరదాలకోసం వాడుకుని ఆ కుర్రాడికి చిప్ప చేతికియ్యడానికి వెనుదీయలేదు. ఆ మనిషికి సిగ్గెలా వేయలేదో నాకర్థం కాదు ... కొడుకు బాగోగులు చూడవలసిన తండ్రే కొడుకుని అలా అప్పులపాలు చెయ్యడం ఎంత ఘోరం. అలాటివి చూసినప్పుడే నాకనిపిస్తుంది అసలు ఒక మనిషి మరొక మనిషిని నొప్పించినప్పుడు తాను అవతలివారిని నొప్పిస్తున్నాను, వారికి హాని చేస్తున్నానన్న స్పృహ ఎందుకు కలగదు అని? మళ్ళీ వీళ్లంతా మందబుద్ధులేం కాదు కదా. పెద్ద పెద్ద చదువులు చదువుకుని ఉన్నతోద్యోగాల్లో ఉన్న మేధావులు కూడాను.’’

‘‘కలగదు’’ అన్నాను ఎదటివారికి నొప్పి కలిగిస్తున్నాం అన్న స్పృహగురించి. ‘‘కొందరికి కేవలం అవతలివారిని బాధించి ఆనందించే మనస్తత్త్వాలు ఉంటాయి కానీ, చాలామటుకు తాము తప్పు చెయ్యలేదనే అనుకునేవారే ఎక్కువ. తనచర్యకి తాను ఇచ్చుకున్న టిప్పణే తప్ప ఎదటివారికి తాము చేసిన ఎగ్గు వారి తలపులలోకి రాదు. అదొకరకం కళ్ళజబ్బే అనుకో. ఎంతసేపూ నన్నర్థం చేసుకోలేదూ, నాకెంత బాధగా ఉందో చూడ్డంలేదూ అంటూ ఏడుస్తారు. ఏంచేస్తాం. వాళ్ళఖర్మ అదీ.’’

‘‘అంతేనేమోలే. మా అరు ఆ విషీతో తిరిగింది కొంతకాలం. నాలుగునెలలక్రితం అతన్ని డంప్ చేసేసింది. మనవాళ్ళేలే. తెలిసినవాళ్ళే కూడాను. రెండేళ్ళక్రితం ఇరుగూ పొరుగూ ఉండేవాళ్ళం. వాళ్ళు ఇల్లు కట్టించుకుని మారిపోయేరు. మాపిల్ల అతన్ని వదిలేసినా, అతను ఈమెని వదల్డంలేదు’’

‘‘ఏమంటాడేమిటి?’’

“ఏమీ అనడు. మాపిల్ల వెళ్ళినచోటల్లా- బజారుకెళ్తే బజారులో, సినిమాకెళ్తే థియేటర్‌లో ప్రత్యక్షమయి తనని తాను ఆమెకి గుర్తు చేయడానికి ఆరాటపడుతూంటాడు అదే అతని ఉద్యోగం అయినట్టు.”

నేను మాటాడలేదు. తెల్లారి లేస్తే ఇలాటివి ఎక్కడోక్కడ వింటూనే ఉంటాను. కాఫీ, పేపరూ అంత మామూలు ఈకథలు.

“ఆ అబ్బాయి మాత్రమే అయితే పోన్లే కుర్రతనం అనుకోవచ్చు. నాకు ఆశ్చర్యం ఏమిటంటే వాళ్ళనాన్న కూడాను. వారానికోమారు ఆఫీసునించి ఈదారినే పోతూంటాడు.”

“దారేనేమో?”

“అదే కదా నేనంటున్నది. ఇది చుట్టుతిరిగి అవుతుంది వాళ్ళింటికి. వారానికోమారు ఇట్నించి వెళ్ళకపోతే తోచదాయనకి,” అంది శ్రీదేవి నవ్వుతూ.

“మ్. కొందరికి పధ్నాలుగేళ్లు దాటుతూనే బుర్రలు ఎదగడం మానేస్తాయనుకుంటాను శరీరాలు ఎదిగినా. ఆ బాపతు కాబోలు.” అన్నాను నవ్వుతూ.

“అలాగే ఉంది చూస్తే,” అంది సిరి కూడా నవ్వుతూ. “ఇలాటివాళ్ళని మాఅమ్మ చీమల్తో పోలుస్తుండేది. వాటివల్ల పెద్ద హాని జరగదు కానీ కనిపించీ కనిపించకుండా చిరాకు పెడుతుంటారు.”

“సరే, వస్తాను మరి.” అన్నాను లేస్తూ.

“ఉండరాదూ. భోంచేసి పోదువు గానీ.”

”లేదులే మరోసారి వస్తాను. ఇంట్లో కాస్త పనులున్నాయి.” అని చెప్పి శలవు తీసుకున్నాను.

(ఫిబ్రవరి 1, 2011)

మార్పు 8

నాలుగురోజులయింది వీధిలో అడుగెట్టి. “నువ్వే మీ విస్కాన్సిన్ మంచు తీసుకొచ్చేవు మాప్రాణాలమీదకి” అంటూ నన్నే దెప్పుతున్నారు నా సన్నిహితులు, తదితర సారమతులూను.

నిజం చెప్పొద్దూ నాకు మంచు కురిసిన తొలిరోజు చాలా హుషారుగానే ఉండింది కానీ గత మూడురోజులనించీ నరకం మొదలయింది. నాలుగ్గోడలమధ్యా కూర్చుని పరమ నిదానంగా

నత్తగుల్లల్లా ఈడుస్తూనో ఏడుస్తూనో పోతున్న కార్లని చూస్తుంటే చిరకేస్తోంది. చెప్పేను కదా నేను అడుగెత్తు మంచులోనూ మోకాల్లోతు నీళ్ళలోనూ కూడా బండి నడిపిన ధీర సారధిని. అలాటిది ఇప్పుడు బయట అడుగుపెట్టడానికే జడుపు. ఎందుకా? అలా అడగండి చెప్తా ... నాకు లేని భయాలు నా నేస్తులూ ఇతర చాదస్తులూ నూరి పోసేసేరు నాకు అని నా అభిప్రాయం.

"నీ పిరికితనం ఒప్పుకోలేక వాళ్ళనీ వీళ్ళనీ ఆడిపోసుకోడం, తప్పులెన్నువారు ... హీ, హీ"... అంటారా? హుమ్. మరే తప్పులెన్నువారు ...

నాదసలే తిరిగే కాలు. తిట్టేనోరు లేదు కానీ కొంతవరకూ చేసే చెయ్యే ... ఇలా 12 బై 14 గదిలో అదే సోఫాలో అదే దృశ్యం చూస్తూ గంటలతరబడీ రోజులతరబడీ కూర్చోడం చాలా బాధగా ఉంది. అక్కడికీ పోనీ భారీ ఎత్తున వంటలు చేసేద్దాం, ఆ కూరలు తరుక్కోడాలూ, గిన్నెలు కడుక్కోడాలూ కొంత కాలక్షేపం అనుకుంటే అదీ కుదరడంలేదు.

ఈఊళ్ళో మన దేశవాళీ కూరలు గోరుచిక్కుడుకాయలూ, పొట్లకాయలూ, బీరకాయలూ, దొండకాయలూ -- ఎంచక్కా తాజా తాజాగా దొరుకుతుంటే ఫ్రీజు చేసినవి కొనుక్కోడమేమిటని నేను ఫ్రోజెనువి కొనడం మానేశాను. అంచేత సరిగ్గా మంచు ముమ్మరంగా కురిసినరోజునే మాయింట్లో కూరలకి కరువొచ్చింది. కూరలు నిండుకున్నప్పడే మంచు కురియును అనిపిస్తోంది - వాన పడ్డప్పడే గొడుగు పట్టుకెళ్ళడం మరిచిపోయినట్టు. బట్టలుతుక్కుందాం అంటే, "ఎనెర్జీ పొదుపుగా వాడండి. వాషరు వాడకండి. హెయిర్ డ్రయరు వాడకండి, ఎలెక్ట్రిసిటీతో వాడేవన్నీ ఆప్చేసేయండి" అంటూ ఊరు గోలెత్తిపోతోంది.

చుట్టూ చూశాను - నేను వాడే వస్తువులు - స్టౌ, మైక్రోవేవ్, ఫ్రిజ్, టీవీ, కంప్యూటరు, - నాబతుకుంతా వీటిచుట్టూ పరిభ్రమిస్తూ ఉంటుంది. ఇవి లేకపోతే బతుకే లేదు. కారుంది కానీ అది కూడా ప్రస్తుతపరిస్థితుల్లో నిరుపయోగమే కదా.

నిజానికి విస్కాన్సిన్ మంచుతో పోలిస్తే ఇక్కడ పడ్డ మంచు తుప్పటుప్పా తొలకరి చినుకుల్లా చూపుకి గట్టిగా ఆనదు కూడానూ. అయినా ఈమంచుకే స్కూళ్ళు మూతపడిపోడాలూ, రోడ్లమీద కార్లు ఢీకొట్టుకోడాలూనూ ... నాకైతే నవ్వుగానే ఉంది.

లేదులెండి. ఇక్కడ పడ్డ రెండంగుళాల మంచూ గడ్డ కట్టుకుపోయి ఐస్ రింక్ లా ఉంది నిజానికి. అన్నట్టు చెప్పేనా, టెనిస్ తరవాత నాకు అంతగానూ ఇష్టమయిన స్పోర్టు ఐస్ స్కేటింగ్. టీవీలో ఫిగర్ స్కేటింగ్ చూసినప్పడల్లా అనుకుంటాను నేను కూడా స్కేటింగ్ నేర్చుకోవాలని. ఆ వెంటనే మంచులో

పడి చెయ్యి విరగ్గొట్టుకున్న దుర్దినం కూడా గుర్తుకొస్తుందనుకోండి. (అన్నట్టు నేను విరగ్గొట్టుకోలేదు. అదే విరిగింది నా సంకల్పం లేదు.)

కిటికీలోంచి గడ్డకట్టుకుపోయిన మంచు చూస్తూ మరోసారి అనుకున్నాను ఎంచక్కా నేను ఐస్ స్కేటింగ్ చెయ్యగలిగితే, మిషెల్ క్వాన్ లా ట్రిపుల్ ఆక్సెల్, డబుల్ టౌ గంతులేసుకుంటూ వెళ్ళి నాలుగు కూరలు తెచ్చుకునేదాన్ని కదా అని ...

మొత్తంమీద ఇలా నాలో నేను చాలా విచారణలు చేసుకుని, మరియు గుండె దిటవు చేసుకుని, వెన్ను చరుచుకుని, "ఒస్, ఏమవుతుంది, మహా అయితే పడి మరోసారి కాలో చెయ్యో విరగ్గొట్టుకుంటాను, అంతే కదా, పైగా ఇక్కడ ఏ పొన్నమ్మాళూ అక్కర్లేదు, సుధావాళ్ళింట్లో కాలుమీద విరిగిన కాలేసుకుని దర్జాగా జరుపుకోవచ్చు" అని సుళువులు చెప్పుకుని బయల్దేరేను. మరోసారి చెప్తున్నా ఇది నాకు నేనయి చేసుకున్న నిర్ణయం కాదు. అలా జరగడానికి నేను అవకాశం కల్పించుకున్నాను అంటే కొంతవరకూ సమంజసమే కానీ కాలో చెయ్యో విరగ్గొట్టుకొనుటకే బయల్దేరుట లేదు.

తీరా తొలి అడుగు వేసినప్పుడు తెలిసింది నా టెనిస్ షూలు ఎంత అరిగిపోయేయో ... మంచు చల్లగా ఎడమకాలు మడమకి తగిలింది. కాలెత్తి చూశాను. మడమ 99 శాతం అరిగిపోయి ఉంది. ఇంతకాలం ఆజోళ్ళలా వేసుకు తిరుగుతున్నానా అని ఆశ్చర్యపోయేను.

ఇప్పుడు అర్జెంటుగా కూరలతోపాటు జోళ్ళు కూడా కొనుక్కోవాలని అర్థమయింది. టైము చూస్తే పదిన్నర. ఆఫీసులవారు ఆఫీసుల్లోనూ, బజార్లు తిరిగేవారు మాలుల్లోనూ స్థిరపడిపోయి ఉంటారు ఈపాటికి. రోడ్లమీద కార్లు అతి తక్కువ ఉండే సమయం. నెమ్మదిగా కారు తీసి వీధికెక్కేను.

.... మామూలుగా ముప్పావుగంటలో ముగిసే బజారు ఇవాళ రెండు గంటల యాభై నిముషాలు పట్టింది. ఇంత చలిలోనూ చిరుచెమటలు కూడా పట్టేయి. మొత్తంమీద మంచులో కారు నడిపి నా పూర్వ వైభవం జ్ఞప్తికెలయించుకున్నాను. అహొూ, ఒహొూ ,,, నాకింకా పూర్వవాసనలు పోలేదు. పూర్వసువాసినులా అని అడక్కండి మరి :). ఆ వైభవం ఇప్పుడు కూడా ఉందనే చెప్తున్నా. ఈభాగం మాత్రం మారలేదన్న మాట.

అయితే ఇక్కడ కూడా మామూలు మనబతుకుల్లో సర్వసాధారణమయిన ఐరనీ లేకపోలేదు. కూరలూ, జోళ్ళూ తెచ్చుకున్నాను, ఫ్రోజెన్ కూడా. టెంపరేచరు మళ్ళీ మెరుగవుతోంది! అంటే మంచుపాతరేసుకున్న కూరల అవుసరం లేదు. మ్.మ్.మ్.

నేను మంచులో కారు నడపగలను. మంచులో నడవగలను, అదేలెండి నా సరికొత్త పాదరక్షలతో. అన్నట్టు చెప్పేనా? నా చేపాటికర్ర మాత్రం పారేయకుండా జాగ్రత్తగా తెచ్చుకున్నాను నాతోనే. అది పుచ్చుకు బయల్దేరితే ఎంత సరదాగా ఉందో .... స్కేట్ చేస్తున్నంత సంతోషంగానూ ఉంది!

(ఫిబ్రవరి 5, 2011)

## మార్పు 9

శ్రీదేవి మాటలే నామనసులో సుళ్ళు తిరుగుతున్నాయి. ఒక మనిషి మరొక మనిషిని ఎందుకు బాధిస్తాడు, నేను ఆమనిషిని బాధ పెడుతున్నాను, ఎదటివాడి నొప్పి నాకానందం" అన్న స్పృహతో చేస్తాడా? లేక యాదృచ్ఛికంగా జరుగుతుందా బాధించడం అన్నది? అవతలివాడు బాధ పడుతున్నాడు అని తెలిసినతరవాతనయినా తన ప్రవర్తన మార్చుకుంటాడా? ...

తలుపు తట్టిన చప్పుడయి, తలెత్తి చూశాను. ఎవరో అమ్మాయి. 18 ఏళ్ళుంటాయేమో...

ఎవరు అన్నట్టు చూశాను.

"నేను అరవిందనండీ. మాఅమ్మమ్మ మీకు ఈపుస్తకం ఇవ్వమంది," అంది ఆ అమ్మాయి.

"ఓ, అరు! ... సారీ, వెంటనే గుర్తు పట్టలేకపోయేను," అన్నాను పుస్తకం తీసుకుంటూ.

"ఫరవాలేదండీ," అంది అరు కానీ వచ్చినపని అయింది, ఇహ వెళ్ళొచ్చు అన్నఛాయలు లేవు ఆ మొహంలో.

"రా. కూర్చో." అన్నాను.

ఆ మాటకోసమే ఎదురు చూస్తున్నట్టు అరవింద వచ్చి, సోఫాఅంచున నాకు కాస్త ఎడంగా కూర్చుంది.

నాకు ఏం మాటాడాలో తోచలేదు, "నువ్వు చదివేవా?" అన్నాను పుస్తకం తిరగేస్తూ.

"చదివేనండీ," అంది నెమ్మదిగా.

"తెలుగు బాగా మాటాడుతున్నావే,"

"నాచిన్నప్పుడు కొంతకాలం మాఅమ్మమ్మతో ఇండియాలోనే ఉన్నాను. తరవాత ఆవిడ ఇక్కడికి వచ్చినా తెలుగే మాటాడ్డంతో నాకూ ఆ అలవాటు అలా ఉండిపోయింది."

మళ్ళీ నిశ్శబ్దం.

"కాఫీ తాగుతావా?"

"ఇప్పుడొద్దండీ. ఇంట్లో తాగే వచ్చేను."

సంభాషణ కుంటుతోంది. కానీ ఆ పిల్ల కదిలే సూచనల్లేవు. ఆ పుస్తకం నెపం పెట్టుకు ఇంకేదైనా మాటాడ్డానికొచ్చిందేమో అనిపించింది నాకు ... విషి విషయమేమో ... ఎలా అడగను? ఇక్కడ పిల్లల్ని సొంతవిషయాలు అడిగితే మాట దక్కదు.

ఆలోచిస్తూనే నెమ్మదిగా "హైస్కూలు అయిపోతుంది కదా ఈయేడుతో. కాలేజీలకి అప్లై చేస్తున్నావా?" అన్నాను. ఈపిల్ల కాలేజీచదువుకీ తాను వదిలేసిన, కనీసం వదిలించుకున్నాననుకుంటున్న విషికీ ఓ బీరకాయపీచు సంబంధం ఉంది. ఊరు వదిలి మరో కాలేజీకి వెళ్తోందంటే, ఆకాలేజీకే విషి కూడా ప్రయాణమవుతాడా అన్నది ఒక యక్షప్రశ్న. ఈసంగతి నాకు సిరి చెప్పింది. అది అరవిందకి కూడా తెలుసు. చూశారా చిక్కులు ... సిరి చెప్పినప్పుడు నాకెంత నవ్వొచ్చిందంటే, విషి నాన్న కూడా ఇక్కడ ఉద్యోగం వదిలేసి ఆఊరికి మారతాడా అని అడిగేను. అంతటివాడే అంది సిరి కూడా నవ్వుతూ. ఆమాట గుర్తొచ్చి మళ్ళీ నవ్వుకున్నాను.

"ఎందుకు నవ్వుతున్నారు?"

"ఏం లేదులే, ఏదో ఆలోచిస్తూ ... ఇంతకీ ఎక్కడికి అప్లై చేస్తున్నావు?"

"మాఅమ్మ షికాగోకో, మిషిగన్‌కో అంటోంది. వారం వారం ఇంటికొచ్చేయొచ్చనీ. నాకు పెద్ద కాలేజీలకి వెళ్ళాలని లేదు. మరో పక్క ... నాకంతా గందరగోళంగా ఉంది. ..." అరవింద ఆగిపోయింది. అసలు పాయింటుకి వస్తోంది. "విషి కూడా అక్కడికే ప్రయత్నిస్తున్నాడు."

"ఇంత పెద్ద దేశం. లక్షల్లో కాలేజీలు. పోనీ, ఉన్న ఊళ్ళోలోనే చెయ్యకూడదా అండర్‌గ్రాడ్?" అన్నాను నాకున్న కొద్దిపాటి పరిజ్ఞానం వినియోగించి.

"ఏమోనండీ. నాకు కొత్త ఊరూ, కొత్తపరిసరాలూ చూడాలని కూడా ఉంది. ఇక్కడ విసుగేస్తోంది."

నాకు ఇవన్నీ కొత్త. నాచదువంతా ఆరోక్లాసు తరవాత ఏడూ, తొమ్మిది తరవాత పదీ, హైస్కూలయిం తరవాత కాలేజీ ... అలా ఏటవాలుగా, గాలివాటుగా సాగిపోయిందే కానీ ఇన్ని ఆలోచనలు లేవు. నేను కూడా వీళ్ళలా ఆలోచించుకుని ఉంటే ఎలా ఉండేదో. ...

"Love does not bind, not hold on; love liberates అంటారు మాయా ఏంజెలో."

నేను తెల్లబోయేను ఒక్కక్షణం. మరుక్షణం గుర్తొచ్చింది నాఅనుమానం. సందేహంలేదు. ఏదో మాటాడ్డానికే వచ్చిందీ అమ్మాయి.

"అలాగా? నేను వినలేదు," అన్నాను.

"నాక్కూడా మొదట ఆశ్చర్యంగానే అనిపించింది. ప్రేమ అంటే తాను ప్రేమిస్తున్నమనిషిని కట్టిపడేయడం కాదు. తనబతుకు తాను బతకడానికి అవకాశం ఇవ్వడం అని. కానీ Shakespeare లాటి మహామహులంతా ప్రేమంటే ఇద్దరూ ఒకరికొకరు చుట్టుకుపోయి, ఏకలతగా జీవితాలు సాగించడం అనే కదా నూరి పోస్తున్నది మనకి."

ఇంకా ఏమంటుందో అని చూస్తున్నాను.

"బహుశా, ఇద్దరూ ఒకేరకం ఆశలూ, ఆశయాలూ, కోరికలూ గలవారైతే, ఒకరి సాన్నిధ్యం రెండోవారికి ఎదగడానికి ఉపయోగపడేదయితే ఇద్దరూ కలిసిఉండొచ్చునేమో. లేకపోతే, ఆ ఇద్దరిలో ఏ ఒక్కరు ఎదగడానికి అవకాశం లేకపోయినా, ఆ వ్యక్తిని రెండోవారు కబంధహస్తాలతో కౌగిలించుక్కూచుకుండా బయటికి పోనివ్వాలి అనేమో. అంటే ఆ వ్యక్తి తనకి కావలసినరీతిలో ఎదగడానికి అవకాశం ఏర్పాటు చెయ్యాలి నిజంగా ప్రేమ ఉంటే."

నాకు నోట మాట రాలేదు. ఇంత చిన్నపిల్ల ఇంత లోతుగా విశ్లేషిస్తూ మాటాడ్డంతో విస్తుపోయేను. ఆ వాక్కులు ఆ అమ్మాయి తనపరిస్థితికి అన్వయించుకుంటోందేమో అని కూడా అనిపించింది. మౌనంగా వింటున్నాను.

"ఏమోలెండి. ఇలాటివి మాటాడ్డం సులువే. నాకు ఆ విపీవాళ్ళతో మహ చిరాగ్గా ఉంది," అంది పొడిగిస్తూ.

"ఏం?" అన్నాను. ఏమయింది అని సూటిగా అడగలేక.

అప్పుడు చెప్పింది నడుస్తున్న కథ - అతనితో బ్రేకప్ అయేక, విపీ ఒక వారంరోజులు ఊరుకున్నాడు కానీ ఆ తరవాత రకరకాలుగా తనని ఇరుకున పెడుతున్నాడు - తాను ఎక్కడికెళ్తే అక్కడికి రావడం, కాఫీకో టీకో రమ్మంటూ పిలవడం ... ... వాళ్ళనాన్న కూడా "మాఅబ్బాయి నీతో డేటింగ్‌కి ముందు, ఎంతో హుషారుగా ఉండేవాడు. అన్నిట్లో ఏ తెచ్చుకున్నాడు. ఇప్పుడు నీగొడవలో పడి మిగతావన్నీ నిర్లక్ష్యం చేస్తున్నాడు. వాడిబతుకు నాశనం చేశావు" అని పోరుతున్నాడుట. అంతేకాదు, మళ్ళీ నువ్వే వచ్చి అతన్ని మళ్ళీ మనలోకంలో పడేలా చెయ్యమంటూ విసుర్లూ, కసుర్లూనుట. అందులో

కాంట్రడిక్షను ఆయనకీ తెలీడంలేదు. నాకూ తెలీడం లేదు. నావల్ల మరి విషికి మేలు జరుగుతోందా? కీడు జరుగుతోందా?'' అంది వెల్తిగా నవ్వుతూ.

నాకు అయ్యో అనిపించింది కానీ నేను చెయ్యగలిగిందేముంది.

''నువ్వన్నట్టు ప్రేమ అంటే రెండోమనిషిని ఎదగనివ్వడమే అన్నది బాగుంది,'' అన్నాను.

''నేను కాదండీ. మాయా ఏంజెలో అన్నారు,'' అంది. ఆ స్వరంలో రవంత విచారం ధ్వనించింది. తాను అంత గొప్పవాక్యాలు చెప్పలేనందుకో, ఆ వాక్యాల్లోని భావం ఆచరణలో ఎంత కష్టసాధ్యమో గుర్తు చేసుకునో.

''ఏంజెలోకి 17 ఏళ్ళప్పుడు కొడుకుతో ఇంట్లోంచి వెళ్ళిపోతానన్నప్పుడు ఆవిడకీ తల్లికీ మధ్య జరిగిన సంభాషణ గొప్పగా ఉంది. చూడండి -

''అమ్మా, నేను వెళ్ళిపోతున్నాను.''

''అమ్మాయీ, ఈ ఇంట్లోంచా?''

''అవును, ఈ ఇంట్లోంచే.''

''ఈ ఇంట్లోంచి వెళ్ళిపోతావా?''

''అవును. ఈ ఇంట్లోంచి వెళ్ళిపోతున్నాను. నాకు పని దొరికింది. అక్కడ వంట చేసుకోడానికి సౌకర్యం ఉంది. ఆ ఇంటావిడ పాపని చూసుకుంటానంది.''

''సరే. వెళ్ళు. నేను నిన్ను అడ్డుపెట్టను. వెళ్ళు. నువ్వంటే నాకు ప్రేమ కనకనే నిన్ను పోనిస్తున్నాను. నీకు ఎప్పుడు కావలిస్తే అప్పుడు రావొచ్చు.''

అది చెప్పి, మాయా అంటారు, ''ఆతరవాత నేను ఎప్పుడు ఇంటికి వెళ్ళినా, ఓ వచ్చావా అంటూ ఎంతో సంతోషంగా ఆహ్వానించింది కానీ ఒక్కసారి కూడా నేను చెప్పానా అనలేదు.''

అరవింద గుక్క తిప్పుకోడానికన్నట్టు ఆగింది.

నాకు ఏం చెప్పాలో తోచలేదు. ఇలాటి సందర్భాల్లో తెలుగుమాటలు లేవు. మనసంప్రదాయంలో బాగుంది అంటాం. నాకు అది చాలదనిపించింది. ''That's beautiful,'' అన్నాను.

అరవింద మరో అరగంట ఉంది. మాయా ఏంజెలోగురించి తను సేకరించిన సమాచారం అంతా చెప్తోంది. ముఖ్యంగా వాక్కు శిలీముఖంలా ఎంత పదునైనదో మాయా ఏంజెలో మాటల్లో అరవింద చెప్పినవి నాకు గట్టిగా తగిలేయి. మాయా మాటల్లో -

> మాటలు చాలా బలమైనవి. నాకు ఏడేళ్ళప్పుడు మాఅమ్మ బాయ్ ఫ్రెండ్ నన్ను రేప్ చేశాడు. అది ఇంట్లో ఎవరికి చెప్పినా వాళ్ళు అతన్ని హింసిస్తారని చెప్పలేదు. మాఅన్న బెయిలీ అంటే నాకు దైవమే. అంచేత అతనికి చెప్పేను. అతను ఇంట్లో చెప్పేడు. వాళ్ళు పోలీస్ రిపోర్టు ఇచ్చేరు. పోలీసులు అతన్ని ఒక పగలు, ఒక రాత్రి జెయిల్లో పెట్టి వదిలేశారు. ఆతరవాత ఇద్దరు పోలీసులు నీలం సూట్లలో వచ్చి చెప్పేరు ఎవరో ఆ బాయ్ ఫ్రెండుని కాళ్ళతో కుమ్మి చంపేశారు. అప్పుడు నాకనిపించింది. నేను హంతకురాలిని. ఏడేళ్ళ నల్లజాతి నాట్జీని. నామాటవల్ల అతను చనిపోయేడు. నేను మాటాడకపోతే ఇది జరిగేది కాదు.

ఆతరవాత మాయా ఏంజెలో ఆరేళ్ళపాటు మాటాడలేదు. మాటలు జాగ్రత్తగా వాడాలి అంటారామె.''

నాకు మనసు బరువెక్కింది. అంతటి ఘోరం జరిగినందుకో, ఆ అనుభవానికి ఆమె చెప్పకున్న భాష్యంమూలంగానో, ఆ సంఘటన అరవిందమీద అంతటి బలమైన ముద్ర వేయగలగడమో .. నాకే తెలీదు. నాకు కూడా అదొక ఘనమైన సత్యం.

మరో పావుగంట కూర్చుని అరవింద ''వెళ్తానండీ,'' అంటూ లేచింది.

''అప్పుడప్పుడు వస్తూ ఉండు,'' అన్నాను.

''నిజంగా రావొచ్చా?'' అంది అరు.

''నిజంగానే. ఈ పుస్తకం చదివేనంటున్నావు కదా. నేను కూడా చదివేక మాటాడుకుందాం దీన్నిగురించి.'' అన్నాను నేను కూడా లేచి గుమ్మంవరకూ నడుస్తూ.

చాలాసేపు ''మాట పదును'' గురించి ఆలోచిస్తూ కూర్చున్నాను. ఒకరు మరొకరిని ఎందుకు బాధిస్తారో అనుకుంటూ మొదలు పెట్టేను కానీ ఇప్పుడు మరో ఆలోచన వస్తోంది. ఒకరు మరొకరిని ఎందుకు బాధిస్తారో తెలీదు కానీ నేను మరొకరిని నామాటలతో బాధ పెట్టకుండా ఉండడానికి ప్రయత్నించవచ్చు కదా. అంటే పని గట్టుకు నామాటలతో మరొకరిని బాధ పెడుతున్నానని కాదు కానీ నేను ఆలోచించకుండా అన్న మాటలమూలంగా మరొకరు బాధ పడే సమయాలు ఉన్నాయనే అనిపిస్తోంది వెనక్కి తిరిగి చూసుకుంటే. ఆ సంఘటనలు నాకు గుర్తొస్తున్నాయిప్పుడు!

అరవింద ఇచ్చిన మరో వాక్యం - మాయా ఏంజెలోదే - గుర్తొచ్చింది. “If you cannot make a change, change the way you think. Maybe you will find a solution.” అవును, నేను ఆలోచించే తీరు మార్చుకోవాలి.

Maya Angelou ఇంకా ఏం చెప్పారో తెలుసుకోవాలనిపించింది. అంతర్జాలంమీద పడ్డాను అరవింద చెప్పిన ఇంటర్వ్యూ దొరుకుతుందేమో చూడ్డానికి.

(ఫిబ్రవరి 13, 2011.)

## మార్పు 10

ఆదివారం మధ్యాహ్నం. టైము నాలుగయింది. దారిన పోతూ పార్క్ దగ్గర ఆగేను. పిల్లలు సాకరాడుతున్నారు. పిల్లల తల్లులూ, తండ్రులూ, స్నేహితులూ ఆట చూస్తూ, పిల్లలకి హుషారిస్తూ, కబుర్లు చెప్పుకుంటున్నారు. ముచ్చటేసే దృశ్యం. ఓ బెంచీవేపు నడిచేను కొంచెంసేపు ఆట చూసి ఆనందిద్దామని.

ఓ అబ్బాయి ఒంట్లో ఉన్న బలాన్నంతా కూడగట్టుకుని ఒక్క తన్ను తన్నేడు బంతిని. అది పదడుగులు గాల్లోకి లేచి యాభైగజాలదూరంలో ఉన్న నాకాళ్ళదగ్గర పడింది. వంగి దాన్ని అందుకోబోతుంటే ఓ అమ్మాయి పరుగెత్తుకుంటూ వచ్చింది బంతికోసం. ఆరేళ్లుంటాయేమో.

బంతి అందుకుని, నావేపు చూస్తూ, “నేను ప్రెసిడెంట్ అవుతాను,” అంది.

“హా. ప్రెసిడెంట్. బాగుంది,” అన్నాను.

తండ్రి కాబోలు వెనకే వచ్చి నన్ను చూసి, “థాంక్స్” అన్నాడు.

నేను తలూపేను చిన్నగా నవ్వి.

“ఇంతప్పటినుండీ ఉంటాయి ఆశలు.”

నేను ఉలికిపడి ఆమాట వచ్చినవేపు చూశాను. ఎవరో యాభై పై బడ్డట్టే ఉన్నాడు. ఆయన నావేపు చూడ్డంలేదు. నాతో అన్నాడో తనలో తనే అనుకుంటున్నాడో నాకర్థం కాలేదు. ఆపిల్లమాటకే అనుకుంటా ఆయన వ్యాఖ్య. ఆ పిల్ల ఆయనకి పరిచయమా? అదే నిజమయితే, మరి ఆ పిల్ల ఆయనతోనే ఎందుకు మాటాడలేదు?

నేను ఊరుకున్నాను.

ఆయన మళ్ళీ మొదలు పెట్టేరు. "ఇక్కడే పుట్టింది కాబోలు. తల్లో తండ్రో చెప్పి ఉంటారు నువ్వు ప్రెసిడెంటు కావచ్చని. ఇంకా ఇండియా ప్రధానివి కూడా కావచ్చు అని కూడా చెప్పేరేమో. మనకా పట్టింపుల్లేవు కదా … ఎక్కడ పుట్టినా … ప్రధానికావడానికి ఎలాటి ఆంక్షలూ లేవు. మనవి విశాల హృదయాలు. .."

తలూపేను అవునన్నట్టు ఆట చూస్తూ. ఆయనకి నాసమాధానం అక్కర్లేకపోతే నావేపు చూడరు. నేను తలూపేనో లేదో తెలీదు. నాసమాధానం కావలిస్తే నావేపు చూస్తారు. నేను వింటున్నట్టే లెక్క అనుకుంటూ. నిజానికి ఆయన నాతో మాటాడుతున్నట్టు నాకు అనిపించలేదు. ఆటాడుతున్న పిల్లల్ని చూస్తూ వినీ విననట్టూరుకుంటే పోలే …

"మాది గుంటూరుదగ్గర పెదరెడ్లపల్లె. మాఊళ్ళో అప్పుడే కొత్తగా పెట్టినబళ్ళో నాచదువు … బాగా సాగడంలేదని మానాన్న నన్ను తాతగారింటికి పంపించేరు …. హైదరాబాదు. మాతాతగారు లండన్‌లో చదివి వచ్చి హైదరాబాదులో ఐసియస్ ఆఫీసరుగా ఉండేవారు. అంచేత నాచదువంతా ఇంగ్లీషు … బతుకంతా ఇంగ్లీషు … ఆయనకి మహా నిష్ఠ. నిరతాగ్నిహోత్రుడు. యమకం, రుద్రం రోజు పారాయణ అయినా చదువు మాత్రం అంతా ఇంగ్లీషు. రెండు సాంప్రదాయాలూ కలగలుపుగా అంత ఛాందసంగా పాటించిన మనిషి మరొకరిని నాజీవితంలో నేను చూడలేదు. … నాకూ అవే వచ్చేయి. ఏదైనా పట్టుదలతో సాధించడం, సాధించేవరకూ నిద్రపోకపోవడం … మనిషన్నాక ఒక నియమం ఏర్పరుచుకుని ఆ నియమం నిష్ఠగా పాటించాలని ఆయన అభిమతం. నాకూ అంతే … 80, 20 రూలు. అంటే తెలుసా? నాబాధ్యత ఎనభైశాతం, ఆయనబాధ్యత 20 అన్న మాట నేను తీసుకునే నిర్ణయాల్లో. అలాగే బాధ్యత చేపడితే సక్రమంగా నిర్వర్తించాలి. ఏదోఒకటి "చేస్తానన్నాను, చేసేను అన్నట్టు" ఉండకూడదు. పరిణామాలు క్షుణ్ణంగా ఆలోచించుకుని కానీ దిగకూడదు … "

నాకు చిరాకేసింది. “ఇదుగో, ఎవరితో మాటాడుతున్నావు? అసలు నువ్వు చెప్తున్నదేమిటి? ఏ మిటీ చేంతాడుకథ?” అని గట్టిగా కసురుకుని ఉందును మరో సందర్భం అయితే. ఇదే నాసొంతిల్లా ఏమన్నానా? అరవడానికి. ఆయనిష్టం ఆయనది. పోనీ లేచి పోతే పోలే అని కూడా అనిపించింది. కానీ మరోపక్క చిన్న కుతూహలం కూడా … ఈయన ఏం మాటాడుతున్నారు? ప్రకాశంగా ఈ స్వగతం ఏల?

హెూహెూ … హెూహెూ … పార్కులో చేరిన ప్రేక్షకులంతా జయజయధ్వానాలు చేసేరు.

ఇందాకా ప్రెసిడెంటునవుతానన్న అమ్మాయి గోల్ చేసింది.

నేను కూడా హుషారుగా చప్పట్లు కొట్టేను.

“గోలు కొడితేనే అంత మురిసిపోతున్నారు. నిజంగా ప్రెసిడెంటయితే ఇంకా ఎంత మురిసిపోతారో …”

అన్నాడాయనే మళ్ళీ. ఆ అమ్మాయి గోలు కొట్టినందుకు ఆయన సంతోషించినఛాయలు లేవు. ఇంకా ఏదో చెయ్యలేదని విచారిస్తున్నట్టుంది ఆయనవాలకం.

“నాచదువు పూర్తయి ఇంజినీరునయేను. మెకానికల్ ఇంజినీరుని. ఇప్పుడు స్కూటర్లలో పెడుతున్న స్మాలింజన్ నేనే డెవలప్ చేసేను. ప్రెసిడెంట్ ఎవార్డు కూడా వచ్చింది. ఈరోజు మెకానికల్ ఇంజినీర్లలో నాపేరు తెలీనివాళ్ళు లేరు.”

బహుశా ఇప్పుడెవరూ ఆమాట అనడంలేదేమో. అదేనేమో ఆయనబాధ.

“మాపెద్దవాడు కూడా నాలాగే ఇంజినీరు కావాలని ఎంతో ఆశ పడ్డాను. డాక్టరయేడు. అమెరినమ్మాయిని చేసుకుని వేరే స్థిరపడ్డాడు…. యాడాదికోమారు కలుస్తాం. ఇక్కడ మదర్స్ డే, ఫాదర్స్ డే లాగే అర్థంలేని ఆచారాలు. రెండోవాడికి హైస్కూలు అయిపోతుంది ఈయేడు. కాలేజీలకి అర్జీలు పెట్టుకుంటున్నాడు. వాడిష్టం. నేను చెప్పలేను. … ప్రేమా దోమా అంటూ జీవితాలు నాశనం చేసుకునేవాళ్లని ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు?”

ఉలిక్కిపడ్డాను. హఠాత్తుగా ఈయనగానీ విషి తండ్రి కాదు కదా అనిపించింది. ఎందుకలా అనిపించిందటే చెప్పలేను. బహుశా ఆయన్ని నేను కలుసుకోడం జరిగితే మా సంభాషణ ఇలాగే ఉండేదేమోనన్న ఊహ కావచ్చు.

"అయినా మనకాలంలో ఇలా కాదు కదా. చదువంటే చదువూ, ఉద్యోగం అంటే ఉద్యోగం, సంసారం అంటే సంసారం .. దేనికదే .. దానిమీదే దృష్టి. నేను చదువుకునేరోజుల్లో చదువుమీదే నాధ్యాసంతా. మాతాతగారు చండశాసనుడు. ఆయన అసలు మాట కూడా అనఖ్ఖర్లేదు. ఆయన గదిలో అడుగు పెడితే చాలు నిశ్శబ్దం అయిపోయేది గది. కూర్చున్న ఆడవాళ్ళు లేచి నిలబడేవారు. కొందరయితే పక్కగదిలోకి వెళ్ళిపోయేవారు. మళ్ళీ ఒక్కనాడు కూడా ఆయన ఎవరిమీద గానీ చెయ్యెత్తడం నేను చూడలేదు. అయన ప్రెజంస్ అలాటిది. ...

మావాడికి చెప్పేను ఆపిల్లమీద అంత మనసుంటే చేసుకో. కానీ ముందు చదువు పూర్తి చెయ్యి. తరవాత ఆపిల్లకి ఇంకా నీమీద మనసుంటే చూద్దాం. ఇప్పుడు వయసు పొంగు అలా అనిపిస్తుంది కానీ కాస్త ఎదిగేక నీ తలుపులు మారొచ్చు. ఆఅమ్మాయి తలపులు మారొచ్చు. నీకో ఆఅమ్మాయికో ఇంకా ఎక్కువ ఇష్టమయినమనిషి తగలొచ్చు కదా అని. ... వింటేనా ... ఒకటే గోల ఆ అమ్మాయి లేకపోతే బతుకు లేదూ అంటూ. సినిమాలొచ్చి మనకి పెట్టిన భిక్ష ఇదనుకుంటాను. ..."

నాకు నవ్వొచ్చింది. ఎంతసేపూ తప్పు ఎదటివారిదే ... అరవింద, విషి, .. వాళ్ళ నాన్న ... మరి సిరిమాటలు కూడా అలాగే ఉన్నాయా? నాకెందుకో లేదనే అనిపించింది. మానవనైజం కాబోలు.

"పోనీ, నిజంగానే ఇద్దరూ made for each other, marriage made in heaven అనుకుని ఆ అమ్మాయితో మాటాడడానికి ప్రయత్నిస్తున్నాను. కానీ వినదే .. కాస్త ఆలోచించుకోవాలి కదా పెద్దాయిన చెప్తున్నారు అనైనా లేదు. ప్రేమా ప్రేమా అంటూ అల్లాడతాడు అక్కడికి ప్రేమంటే ఏమిటో నాకు తెలీనట్టు. నేనూ ప్రేమించే పెళ్ళి చేసుకున్నాను."

నాకు ఇప్పటికి కాస్త కుతూహలంలాటిది కలిగింది. "అలాగా," అన్నాను.

"నాకూ తెలుసు ప్రేమంటే. నాభార్యకి ఏంకావాలో నాకు తెలుసు. ఆమెకి కావలిసినట్టు అన్నీ అమరుస్తాను. అంతే కాదు. ఆమెకి తెలీనివి కూడా నేనే గమనించి చెప్తాను నీకు ఇది బాగుంటుందని, ఇలా ఉండాలని. అసలు ఆమెని సంతోషపెట్టడానికే వీడిని కూడా ఒదారిలో పెట్టాలని చూడ్డం."

ఇంకా ఏం చెప్తారా అని ఎదురు చూస్తున్నాను.

“మాతాతగారికి నామీద ప్రేమ ఉండబట్టే కదా నన్ను అంత కట్టుదిట్టాలతో పెంచేరు. పెద్దలు అనుభవంతో చెప్తారు. అది కూడా వినాలి. అదే నేను ఆ అమ్మాయికి చెప్పేను. ”

నేను నవ్వేను, “అనుభవాలా… మానవాళి చరిత్రనుండీ నేర్చుకున్న పాఠం ఒక్కటే - అది చరిత్ర చూసి మనం ఏమీ నేర్చుకోం అన్నది. నిజంగా చరిత్ర చూసి పాఠాలు నేర్చుకుంటే లోకం ద్వాపరయుగంలో భారతయుద్ధంతరవాతైనా బాగుపడేది. ఇన్ని యుద్ధాలు ఉండేవి కావు. ” ఆయన నామాట వినిపించుకోలేదు. లేదా పట్టించుకోలేదు.

“ప్రేమంటే నీకు కావలసింది చూసుకోడమే కాదు అబ్బాయికి ఏం కావాలో కూడా చూడ్డం అని. … అసలు ఆ అమ్మాయికి ఆ తత్త్వమే అర్థమయినట్టు లేదు. లేదా నేనే పొరపాటు అంచనా వేసేనేమో. నెమ్మదిగా కనిపిస్తే అణుకువగల పిల్ల అనుకున్నాను. కానీ నాకు ఇప్పుడనిపిస్తోంది స్లో అయినా ఉండాలి. మొండితనమయినా అయిఉండాలి అని.”

“స్లో అని ఎందుకంటారు? ఆలోచించి నిదానమీద జవాబు చెప్పడం కూడా కావచ్చు కదా,” అన్నాను, నామమాత్రంగానైనా తెలీని ఆ అమ్మాయిపక్షం వకాల్తా పుచ్చుకుని. దానికి కారణం నాగురించి కూడా అలాగే అనుకోవచ్చు మరి. నేను కూడా నిదానంగానే కనిపిస్తాను. నేను కూడా మాటకి మాట టక్ టక్మని వెంటవెంటనే చెప్పను మరి!

“ఏమైనా ఆపిల్ల మావాడికి తగదు. అది మావాడు అర్థం చేసుకునేలా చెప్పడం ఎలాగో నాకు తెలీడంలేదు” అన్నారాయన లేస్తూ.

ఈయన విపితండ్రి అవునో కాదో నాకు తెలీదు కానీ అయిఉంటే, నేను సంభాషణ ప్రారంభిస్తే, అది ఇలాగే ఉండేది అనిపించింది.

నిదానంగా తలొంచుకుని అడుగులేసుకుంటూ కోరలు తీసిన సింహంలా నడిచిపోతున్న ఆయన్ని కనుమరుగయేవరకూ చూసేను. అయ్యో అని కూడా అనిపించింది నాకు అర్థరహితమే అయినా.

(ఫిబ్రవరి 26, 2011)

మార్పు 11

"నవ్వెప్పడొస్తుందో చెప్పడం కష్టం," అన్నాన్నేను.

"నవ్వెప్పడు రాదో చెప్పడం కూడా కష్టమే," అంది అరు.

"నువ్వినలేదేమిటి ఇటీవలి లీలాసుందరులవృత్తాంతం" అంది సిరి.

"లేదు. ఏమాకథ? వినుటకుత్సాహంబయ్యెడిని, చెప్ప చెప్ప చెప్ప చెప్పూ" అన్నాను హుషారుగానూ మరియు పూర్వపు బాణీ నెమరేసుకుంటూను.

"ఇది చెప్పలకథ కాదు. చెప్పదెబ్బలకథ. సరే. ఏమయిందంటే ..."

ooo

"ఇండియానించి ఇప్పడే దిగేడు రెడ్డి, కోడికూర ఎలాగా చెయ్యవు కనీసం **మాంఛ్ఛి ఘాటైన** తెలుగువంటకం చేసిపెట్టు, పదికాలాలపాటు నిన్ను తలుచుకుంటాడు," అన్నాడు సుందరం లీలతో రామిరెడ్డిగురించి.

రామిరెడ్డి ఏదో కోర్సుకోసం వచ్చేట్ట. ఒక సెమెస్టరుంటాడు. తెలుగుతిండికోసం మొహం వాచి ఉన్నాట్ట.

లీల సరేనంది. ఆమధ్య ఏదో వంటలపుస్తకంలో కనిపించిన "కేరట్ ఆవకాయ పెడతాను. ఆ ఆవగుండ ధాటికి రామిరెడ్డేమిటి హరిహరాదులు కూడా అదిరిపడగలరు," అంది. అమెరికాలో సామర్లకోటనూనె, అనకాపల్లి మామిడికాయలూ, తుని మిరపకాయలూ దొరక్కపోవచ్చు కానీ ఇంచుమించు ఆఘాటుకి సరి తూగే సరుకులు కమ్యూనిటీ స్టోరులో దొరుకుతాయి. ఇక్కడ మెక్సికన్ మిరపకాయలూ, మరెక్కడినించో వచ్చిన సన్నావాలు రుచికి లోపం లేదు.

కేరట్ తెచ్చి, సన్నగా ముక్కలు తరిగి, రెండ్రోజులు నిమ్మపులుసులో నానబెట్టింది. ఆ తరవాత కారం, ఆవగుండా ఉప్పూ పసుపూ బాగా కలియబెట్టి, కేరట్ ముక్కలేసి మరోమారు కలియబెట్టి మూతపెట్టింది. నాలుగురోజులు ఊరబెడితే రుచి బాగుంటుంది కానీ టైము లేదు. మర్నాడే రెడ్డి భోజనానికి వస్తున్నాడు. ఊళ్ళోనే ఉంటాడు కదా నాలుగు రోజులయింతరవాతే పిలవొచ్చు కదా అనడక్కండి. లేడికి లేచిందే ప్రయాణం. సుందరం తలిచినప్పడే విందు.

సుందరం వెళ్ళి రెడ్డిని తీసుకొచ్చేడు. లీల సాదరంగా ఆహ్వానించి, "ఆర్డూర్" పేరున నాలుగు బజ్జీలు ముందు పెట్టి, మరో అరగంట తరవాత భోజనాలబల్లమీద వంటకాలు సిద్ధం చేసింది.

ఆ బల్లా, బల్లమీద గిన్నెలూ, గిన్నెల్లో దినుసులూ చూస్తుంటే రెడ్డికి కళ్లూరేయి. తింటుంటే కళ్లూ, నోరూ కూడా ఊరిపోయేయి ఊటబావిలో జలాల్లా. తింటున్నంతసేపూ లీలగారి కేరటావకాయ మెచ్చుకుంటూనే ఉన్నాడు.

"మరేమిటనుకున్నారు మాలీల పాకశాస్త్రప్రావీణ్యం. మీరింకా చూడలేదు. మరో రెండు సార్లు తిన్నారంటే ఆతరవాత రెండు జరగడానికి అవకాశం ఉంది," అన్నాడు సుందరం.

"రెండంటే?"

"ఈవిడగారి రుచులకి అలవాటు పడిపోయి, మరెక్కడా తినలేక మాయింటికి మకాం మార్చేస్తారు. ఇహ ఇండియా తిరిగెళ్ళేమాటే రాదు కల్లోనైనా. లేదా కళ్లు తిరిగి, మొహం మొత్తి ఇహ తిన్లేను మహాప్రభో అనుకుని మరి మాయింటివేపు చూడరు," అన్నాడు సుందరం హ హా నవ్వుతూ తనహాస్యచతురతకి మురిసిపోతూ.

రెడ్డి కూడా నవ్వేడు "భలేవారండీ మీరు, భలే మాటాడతారు."

"అదేమిటండీ రెడ్డిగారూ, నావంటకాలరుచులు వదిలేసి ఆయనగారి హాస్యచతురతమీదికి మళ్ళించేశారు బండి. నావంటలు అంత తీసికట్టా?" అంది లీల సీరియస్‌గా.

"అమ్మమ్మ, ఎంతమాట. మీ పాకాలతరవాతే వారి వాకులు" అన్నాడు రెడ్డి.

భోజనాలయేయి. "ఊళ్ళో తెలుగుసినిమాలు లేవు కానీ పొరుగువారిది తమిళచిత్రం ఆడుతోంది, లీలకి తమిళం కొంచెం వచ్చు. వెళ్దామా?" అన్నాడు సుందరం ఇద్దరివేపూ మార్చి మార్చి చూస్తూ.

"పదండి. మీరేదంటే అదే. నాకేదైనా ఒకటే. ఇంగ్లీషుబళ్ళో చదివేను కదా. నాకు తెలుగూ, తమిళం, మరాఠీ అన్నీ ఒక్కలాగే వినిపిస్తాయి. మూకీ చూసినట్టు బొమ్మలు చూసి కథ తెలుసుకుంటాను," అన్నాడు రెడ్డి.

"నాతమిళం కూడా అంతంత మాత్రమేలెండి. రెడ్డిగారు చెప్పినట్టు ఏ సినిమా అయినా ఒకటే, పదండి," అంది ఎంగిలికంచాలూ, గ్లాసులూ సింకులోనూ, మిగిలిన కూరలూ అన్నాలూ ఫ్రిజ్‌లోనూ సర్దేస్తూ.

ooo

సినిమా మొదలయి పావుగంట సాగింది. ఎవరికీ ఏమీ తెలీడంలేదు. తమకేమీ తెలీడంలేదని చెప్పడానికి ఎవరూ సిద్ధంగా లేరింకా. మరో పావుగంటయితే చెప్తురేమో.

రెడ్డి ఇబ్బందిగా కదలడం మొదలెట్టేడు కుర్చీలో. మరో పదినిముషాలయింతరవాత కడుపుమీద చెయ్యేసి ఊఁ అంటూ చిన్నగా మూలిగేడు.

"ఏంటండీ, కడుపులో బాలేదా?" అడిగేడు సుందరం గాభరా పడిపోతూ.

"కడుపులో ఏంటోగా ఉందండీ," అంటూ మొహం వికృతంగా పెట్టి, నెమ్మదిగా లేచేడు.

"అయ్యయ్యో, మాలీలవంటకాలు అగ్గి పెట్టేసేయేంటి మీకుక్షిలో," అంటూ సుందరం కూడా లేచేడు.

సినిమాలో లీనమయిపోయి, ఆ సంభాషణలసారం గ్రహించడానికి ప్రయత్నిస్తున్న లీలకి సుందరం, రెడ్డి లేచిపోవడమే తెలిసింది కానీ వారిమధ్య మాటలు తెలుసుకోలేదు.

సరే, ఏ సిగరెట్ తగలేసుకోడానికో బయటికి పోతున్నారు వాళ్ళే వస్తారు అనుకుంది వాళ్ళు లేవడం చూసి.

ఆమె అనుకున్నది జరగలేదు. సినిమా అయిపోయింది. తనని తోలుకొచ్చిన బంధుమిత్రులు అయిపు లేరు.

తనవరసలోవారు లేచి ఆమె లేవడంకోసం చూస్తూ నిలబడ్డారు. ఇహ లాభంలేదనుకుని మెల్లిగా లేచి, జనప్రవాహంలో పడి కొట్టుకుపోతూ బయటికి వచ్చింది. తనని కట్టుకున్నవాడూ తనచేతివంట తిన్నవాడూ కనిపిస్తారేమోనని. సినిమా చూసినవారందరూ వెళ్ళిపోయేరు. రెండోఆట చూడ్డానికొచ్చినవాళ్ళు హాల్లోకి పోయేరు. కొందరు పరిచయస్థులు కనిపించి సినిమా చూడ్డానికొచ్చేరా, చూసి వెళ్ళిపోతున్నారా అని ప్రశ్నించేరు.

లీల నెమ్మదిగా నడుస్తూ ఇల్లు చేరుకుంది.

తలుపు తాళాలు తీస్తుండగానే గలగల్లాడుతూ మాటలూ నవ్వులూ వినిపించేయి.

హాల్లో కూర్చుని సుందరం రెడ్డీ పేకాడుతున్నారు.

లీలని చూస్తూనే సుందరం, "అయిపోయిందా సినిమా? బావుందా?" అన్నాడు అతిమామూలుగా.

"చెప్పకుండా వచ్చేశారేమిటి? మీకోసం చాలాసేపు చూశాను," అంది లీల శాంతంగా.

"నీ కొత్తావకాయ ఘాటు రెడ్డిగారికడుపులో చిచ్చు పెట్టేయి," సుందరం హెూరున నవ్వేడు.

రెడ్డి చిన్నగా నవ్వేడు "మరీ అంత కాదులెండి" అంటూ.

"అంత కాదంటారేమిటి? జులై ఫైర్‌వర్క్స్ కనిపించేయన్నారు కదా మీరే" అన్నాడు సుందరం మళ్ళీ.

రెడ్డి నవ్వేడు.

లీలకి మనసు కలుక్కుమంది. మాటాడకుండా పక్కగదిలోకి వెళ్ళిపోయింది.

ఆ వెనకే సుందరం వచ్చేడు.

"అదేం మర్యాద? పెద్దమనిషి హాల్లో ఉంటే అలా వచ్చేస్తావేమిటి?" అంటూ.

"మర్యాదా? నన్నొక్కదాన్నీ అలా సినిమాహాల్లో వదిలేసి రావడం మర్యాదగా ఉందా?"

"బాగుంది. ఆయనకి కడుపునొప్పి అంటే మీరెళ్ళండి, నేను తరవాత మాఆవిడతో వస్తాను అని చెప్పమంటావా?"

"ఏం పసిపిల్లాడేమిటి? నువ్వు పక్కనుండి బాత్రూంకి తీసుకెళ్ళాలా? పోనీ, వెళ్ళేవు సరే. వెళ్ళేముందు చెప్పొచ్చు కదా. ఆ తరవాతయినా, ఆవిడతో చెప్పకుండా వచ్చేశాం. వెళ్ళి తీసుకొస్తాను మీరు పడుకోండి అని ఆయనకి చెప్పలేవూ?"

"ఇది మహా బావుంది. మామూలుగా ఒక్కదానివీ ఊరంతా ఇంకా పొరుగూళ్లూ కూడా తిరుగుతావు కదా. రెండు బ్లాకులు కూడా లేదు సినిమాహాలు ఇక్కడ్నించి. నిన్ను కొట్టడానికి ఎవడికైనా ఎన్ని గుండెలు. నీఆకారం చూసి వాడే ఝడుసుకుని పారిపోతాడు" సుందరం సుతారంగా నవ్వేడు.

హాల్లో రెడ్డి నవ్వినట్టు లీలకి అనిపించింది..

సుందరం హాల్లోకి వచ్చేశాడు.

రెడ్డి, "తెల్లారగట్లే క్లాసుంది, వేగిరం లేవాలి. వస్తానండీ" అంటూ లేచేడు.

సుందరానికి మాత్రం రెడ్డిని అలా అర్థంతరంగా సాగనంపడం బాలేదు.

"అదేంటండీ. కూర్చోండి. కనీసం ఈ ఆట పూర్తి చేసి వెళ్ళొచ్చు. మీరేం ఆవిడని పట్టించుకోకండి. ఊరికే అలా అలక నటిస్తుంది కానీ నిజంగా బాధ కాదు. గొప్ప సెన్సాఫ్ హ్యూమరు ఆవిడకి. మాకిద్దరికీ ఇదలవాటే ..."

లీలకి వినిపిస్తూనే ఉన్నాయి ఈకబుర్లన్నీ. కొంతవరకూ సుందరం చెప్పింది నిజమే. ఇద్దరూ వేసి వేయించుకోడం అలవాటే. పార్టీల్లో కూడా ఒకరినొకరు హేళన చేసుకుని నవ్వుతూ అందర్నీ నవ్విస్తూనే ఉంటారు.

కానీ. .. ఇవాళ మనసు చివుకుమంది.

“సుందరం ఎందుకు అలా ప్రవర్తించేడంటావు,” అంది సిరి.

“వాళ్ళిద్దరిమధ్య సామరస్యం అలాటిది కావచ్చు. వాళ్ళెంతకాలంగా కాపురం చేస్తున్నారో తెలీదు. ఆటైంలో అతనికి అలాటి అభిప్రాయం ఏర్పడి ఉండవచ్చు. అంటే తను చేసింది లీలకి సమ్మతంగానే ఉంటుంది అని అనుకున్నాడేమో. మామూలుగా తను ఒక్కర్తీ బయటికి వెళ్ళడం అలవాటే అన్నాడు. అతిథిసత్కారాలవిషయంలో గృహస్థధర్మాలు అవీ అని అతనిఅభిప్రాయాలు. లీల ఇంట్లో మనిషి. ఇంట్లో మనిషిని ప్రత్యేకంగా చూడ్డం మనసాంప్రదాయంలో లేదు కదా. మనలో మనకేంటి అనే తత్త్వం మనది. పరాయివారయితేనే ఏమనుకుంటారో అనుకుంటూ జాగ్రత్త పడాలి. పాపం రెడ్డి కొత్తగా వచ్చేడు. అమెరికాలో అతనిదినాలు హర్షప్రదం చేయడం సాటితెలుగువాడిగా తనవిధి … ఇలా ఉండి ఉంటాయి ఆయన ఆలోచనలు” అన్నాను ఆలోచిస్తూ.

అలా చేయడంలో సుందరం కూడా ఆనందం పొంది ఉండొచ్చు కానీ అది ఇక్కడ అప్రస్తుతం.

“అయితే రెడ్డికి అది బాగుందా? అతననైనా లీలగారిని ఒక్కరినీ సినిమాహాల్లో వదిలేసి వచ్చేం. చెప్పనైనా చెప్పలేదు. పోనీ మీరు మళ్ళీ వెళ్లండి. నేను నారూముకి పోతాను అనలేదా, అనఖ్ఖర్లేదా?” అంది అరవింద.

“ఏమో .. నీట్లోంచి బయట పడ్డ చేపలా కొత్తదేశంలో మనిషికి మాట తోచదు. పైగా సుందరం తనకంటే పెద్దవాడు, అనుభవజ్ఞుడూ… ఆయనకి తను చెప్పేదేమిటి? ఇంకా వాళ్ళ అనుబంధం అలాటిది అనుకొని ఉండొచ్చు కూడా. లేదా కేరటావకాయ కడుపులో మంటలు పెట్టేస్తుంటే బుద్ధి పని చేయలేదేమో. వాళ్ళకి లేనిబాధ నాకెందుకు అనుకోవచ్చు,” అంది సిరి.

“మరి సుందరం ఎకసక్కేలు ఎప్పుడూ తేలిగ్గా తీసుకునే లీలకి ఇప్పుడు కోపం ఎందుకు వచ్చిందంటావు?” అంటూ నావంతు ప్రశ్న వేసేను.

“బాగుంది భేతాళుడిప్రశ్నలా. ఇది అరువిందకి వదిలేస్తున్నా. నువ్వు చెప్ప అరవిందా,” అంది సిరి అరువేపు తిరిగి.

“మంచి ప్రశ్నే. అవును. ఎంచేత లీల నొచ్చుకుంది? ఇంతకాలం ఇంటా బయటా కూడా ఇద్దరూ ఒకరినొకరు వేళాకోళాలు చేసుకుంటూనే ఉన్నారు కదా. మరి ఇప్పుడు వేరుగా ఉన్నదేమిటి? రెడ్డి కొత్తవాడు, పరాయివాడనా? అతను కూడా నవ్వినందుకా? మొగుడు కొట్టినందుక్కాదు తోడికోడలు నవ్వినందుకు అంటారు ….అసలవేవీ కావేమో … సుందరం జోకులు పాతరికార్డులా అరిగిపోయి

కీచుమనే సమయం ఆసన్నమయిందేమో? లీలకి సెన్సాఫ్ హ్యూమరు తరుగుతోందేమో? హుమ్. ఇంకా ఆలోచించి, మరిన్ని పుస్తకాలు చదివి కానీ చెప్పలేను,'' అంది అరవింద.

(మార్చి 8, 2011)

మార్చ్ 12

లీలకి నవ్వు రాలేదు. ఏడవాలనుంది కానీ అదీ రాడం లేదు. నగరివాకిట నుండు నల్లగుండులాటిదే గుండెల్ని పట్టి దిగలాగుతున్నట్టుంది. కారుమేఘాలు తరుముకొస్తున్నట్టుంది. రాబోయేశిశిరాన్ని రారమ్మంటూ స్వాగతం పలుకుతూ ఆకులు రాల్చుకుంటున్న మహావృక్షంలా ఉంది మనసంతా.

నోరి నరసింహశాస్త్రిగారు చెప్పినట్టు మహాకవులంతా ఏదో రకం ఏడుపు ఏడుస్తూనే ఉన్నారు యుగయుగాలుగా. తనక్కూడా తనదైన ప్రత్యేకమైన ఫక్కీలో ఓ ఏడుపు రాకూడదూ ... ఎలాటి ఏడుపు బాగుంటుంది? అల్లసాని పెద్దనలా అల్లనల్లన? భట్టుమూర్తిలా బావురుమనా? ముక్కు తిమ్మనలా ముద్దుముద్దుగానా? కృష్ణశాస్త్రిలా ఎలుగెత్తి ఏడ్తునా?

సుందరాన్నే అడిగాలేమో ... ఆయనగారికి తెలీనిసంగతి లేదు. మాటాడలేని విషయం లేదు. ఆయనఅభిప్రాయాలకి గురి కాని వస్తువు లేదీ భూనభోంతరాళాలో. అడగాలే కానీ ఏదో ఓ పుస్తకంపేరు చెప్పి ఉదాహరణలు గుప్పిస్తూ ఎన్నో విషయాలు చెప్పగలడు. పండితపరమేశ్వరుడన్నబిరుదు ఊరికే రాదు కదా. మూతిమీద మీసం మొలవకముందే విశిష్టసేవాపురస్కారం పుచ్చుకున్న గురవరాగ్రణి.

ooo

హీహీ అంటూ సన్నగా నవ్వుతోంది అరవింద.

''ఏమిటంత నవ్వొస్తోంది?'' అనడిగేను.

''అందరూ నవ్వుగురించి రాస్తారు. నోరి నరసింహశాస్త్రిగారు ఏడుపుగురించి భలే చెప్తున్నారు. నవ్యకవతలో కృష్ణశాస్త్రిగారు ఏడుపు ఫాషను చేసారు, ఏడుపులో మాధుర్యము చూపినారు అన్నా తప్పలేదు, ఏడుపు స్పెషలిస్టు ఆయన అంటున్నారు. కృష్ణపక్షానికి ముందే ఆయన కన్నీరు అన్న కావ్యం రాసి ఏడుపు స్పెషలిస్టు అనిపించుకున్నారు అంటారు. మరి అంతకుముందే నన్నయ్య,

తిమ్మన, భట్టుమూర్తి, శ్రీనాథుడూ ఏడ్చారంటారు. ఇంతకీ ఈ ఏడుపుకవిత్వానికి ఆద్యులెవరూ అని హీహీ," అంది మళ్ళీ.

"ఏడుపుకి ఆది ఏమిటి? పిల్లలు ఏడుస్తూనే పుడతారు కదా. ఏడుపు సృష్ట్యాదినుండీ ఉంది. ఆ తరవాత మనిషి అది లేదూ ఇది లేదూ అంటూ జన్మంతా ఏదో ఏడుపు ఏడుస్తూనే ఉంటాడు" అంది సిరి.

"అలా అనకు అమ్మమ్మా. అందరూ ఏడవడంకోసమే పుట్టరు. ఏడ్చేవాడికి ఏదో ఒక సాకు ఎప్పుడూ దొరుకుతుంది. అది వేరే సంగతి," అంది అరవింద ఆరిందాలా.

"ఆ సాకులేమిటో కూడా చెప్పు మరి," అన్నాను కాలక్షేపానికి.

అరవింద నావేపూ, సిరివేపూ మార్చి మార్చి చూసి, "నాకు తెలీదులెండి," అంది.

"చెప్పడం ఇష్టంలేక అదో సాకు," అన్నాను ఎద్దేవా చేస్తూ.

సిరి నవ్వింది. "తెలీడంలేదూ? ఆమె అంటున్నది విషిగురించి."

"ఆ కథ అయిపోయిందనుకున్నానే. మళ్ళీ ఏమయింది?"

"నన్ను వదిలేలా లేడు. డేటు కాదులే అంటూనే కాఫీకి రా, సినిమాకి రా అంటూ ఏదో ఓ సాకుతో పిలుస్తుంటాడు. నేను ఏ పార్టీకి వెళ్ళినా అక్కడ తనూ హాజరు వీళ్ళు నాక్కూడా స్నేహితులే అంటూ."

"నిజమే కావచ్చు కదా. ఒకే స్కూల్లో చదువుతున్నారు. ఇద్దరికీ తెలిసివాళ్ళుండడంలో ఆశ్చర్యమేముంది?"

"కాదండీ. నిజంగా ఏ స్నేహమూ లేకపోయినా పిలవకపోయినా తయారవుతాడు నేనూ ఉన్నానంటూ. ఇహనక్కడ ఫార్సు చూసితీరాలి. మరో అమ్మాయితో సరసాలాడుతూ, నన్ను వెక్కిరిస్తూ ... అక్కడికి నేనేదో కుళ్ళుకుని పరుగెత్తుకెళ్ళి అతడిఒళ్ళో వాలిపోతానని."

"మరి నీకు కుళ్ళుగా లేదా?"

అరవింద మాటాడలేదు. మనిషన్నాక ఆమాత్రం ఉండకపోదు. ఎలప్రాయం, ఎంత కాదనుకున్నా తొలివలపు ... అంతకుమించిన సర్వసాధారణమయిన మనస్తత్త్వాలు కూడా ఉంటాయి కదా. అరవింద చూపు అటు మొగ్గుతోంది పైకి చెప్పకపోయినా.

"కవులుమాటేమో కానీ నిత్యజీవితంలో వేళాకోళాలూ, హాస్యం, వ్యంగ్యం అన్నీ ఏడుపు దాచుకోడానికేనేమో. అది వదిలేయండి. నరసింహశాస్త్రిగారు ఈరోజుల్లో కూడా కవితల్లో ఏడుపు ఎక్కువగానే ఉందన్నారు కానీ నామటుకు నాకు అది మారిందనిపిస్తోంది. భానుమతిగారి **తెలివితేటలవిలువ, జీవితంలో అగాధాలు** కథల్లో కథానాయకులు ఏడవలేక నవ్వే సీదా మనుషులే. ముళ్ళపూడి వెంకటరమణగారు **భగ్నవీణలూ, బాష్పకణాలూ** కథలో హాస్యమే ఎక్కువ. అందులో నాయకుడూ నాయికా నిజంగా బాధ పడలేదనే అనిపిస్తుంది. ఆయనకి వారి హృదయవేదన అర్థం కాలేదో, దాన్ని తేలిక చేయాలనో."

"కలకంఠికంట కన్నీరొలికినయింట సిరి యుండనొల్లదంటారు కానీ కవిత్వం చిలుకుతుందేమో."

"కవిత్వాలమాటకేంగానీ మాఅక్కయ్యయింట సిరులూ కన్నీరూ ఒక్కలాగే ఒలకడమేమిటి పొంగి పొరలుతున్నాయి. ఆవిడకి సదా నెత్తిమీద నీళ్ళకుండ ఉంటుంది. ఏడ్చి సాధించుకోడం అంటే ఏమిటో ఆవిడదగ్గిరే నేర్చుకోవాలి."

"శోకంలోనించి శ్లోకం పుట్టిందంటారు, అదే రామాయణమయింది. కానీ ఈమధ్య వచ్చిన కల్పవృక్షాలు, విషవృక్షాలూ, విషవృక్షఖండనలూ - ఎవరికి వారే వారి పాండిత్యం ప్రదర్శించుకోడానికే పనికొచ్చింది కానీ అందులో శోకమూ లేదు. హాస్యమూ లేదు. చివరి రెండిట్లో కోపం, వ్యంగ్యం ఉన్నట్టుంది. మరి విషాదం వ్యంగ్యానికీ కోపానికీ, చివరికి తిట్లలోకీ దిగుతోంది అనుకోవాలా?"

"పూర్వం తిట్లకి సంస్కృతం, ఇప్పుడు ఇంగ్లీషు."

"లేదులే. అచ్చతెలుగు తిట్లు కూడా బాగానే చోటు చేసుకున్నాయి కదా ఈనాటి రచనల్లో."

"బాగుందీ వరస. మనం ఎక్కడో మొదలెట్టి ఎక్కడో తేలేం. సాహిత్యంలో ఏడుపు ఎలా ఉంటుందంటే ..."

"ఎక్కడో తేలడం ఏమిటి. ఏడుపు మారి కోపతాపాల్లోకీ తిట్టుకవిత్వంలోకీ దిగిందని నిర్ధారణ చేసేం."

"శోకంలో పుట్టి శ్లోకంగా మారి తరవాత ఆవేశంలోకి దిగిందంటావా?"

"బాగానే ఉంది ఏడుపుమీద మాటాడ్డానికింత ఉంటుందనుకోనే నేను," అన్నాను నేను లేస్తూ.

ooo

"శోకంలోంచి శ్లోకం వచ్చింది. మరి నేనిప్పుడు మరో సుందరాయణం రాయలేమో?" అనుకుంది లీల.

నిజానికి తనది శోకం ఎప్పుడయింది? ఇంతకాలం నవ్వుతూ తుళ్ళుతూ గలగలా సెలయేరులా సాగుతున్న జీవితంలో ఎప్పుడు ఎక్కడ ఎలా గండి పడింది?

లీల ఆలోచనల్లో పడిపోయింది.

## మార్పు 13

ఇక్కడికొచ్చేక మరో పెద్ద మార్పు ఏది కొన్నా రెండోసారీ, మూడోసారీ షాపువాడితో "యిచ్చిపుచ్చుకోడాలు" చెయ్యాల్సొస్తోంది. మంచం అయితే నాలుగుసార్లు మార్చాల్సివచ్చింది. మారోజుల్లో అంటే అదేలెండి నాచిన్నతనంలో పరుపు అంటే పరుపు అంతే. ఏ దూదేకులాడో ఓ పరుపు కుట్టిస్తే, అదే రెండు తరాలకి సరిపోయేది. ఇప్పటికీ నాకు గుర్తే - పరుపుచుట్టలు పడుకునేవేళకి తెచ్చి పరుచుకోడం, మళ్ళీ లేచినతరవాత అవి చుట్టి ఏ మూలగదిలోనో దాచేడం. అదొక దినచర్య. నాకెందుకో అలాటివి సరదాగా ఉంటుంది.

మా యింట్లో పెద్ద పందిరిమంచం ఉండేది. దానికి నాలుగు పొడుగాటి రాటలు నాలుగు మూలలా, దోమతెర కట్టుకోడానికి. అలాటివి ఆరోజుల్లో భాగ్యం అన్నమాట. పందిరిమంచంమీద పరుపు మాత్రం ఎప్పుడూ అలాగే ఉంటుంది. చుట్ట చుట్టుకోడాలూ మూల పెట్టుకోడాలూ లేవు. సాధారణంగా అది ఆ యింటి యజమాని భోగభాగ్యాలని తెలియజేస్తుంది. అంతే.

ఇప్పుడు మళ్ళీ బెడ్రూములొచ్చేక ఆ పందిరమంచం ఆనవాళ్లయితే కనిపిస్తున్నాయి కానీ ఆ సౌఖ్యం మాత్రం లేదు.

అన్ని రంగాల్లోలాగే పానుపులరీతులకి కూడా స్పెషాలిటీలొచ్చేయి. posturopedic, tempopedic, beauty rest, … ఇంకా మరేవో ఇష్టులూ రొష్టులూ …

షాపులో అడుగెట్టగానే "పడుకుని చూడండం"టాడు అమ్మకాలబ్బాయి. నాకు అది మహ ఇబ్బందిగా ఉంటుంది. అతను ఎదట నిలబడి ఆ పానుపుపై నేనెలాటి ఆనందాన్నుభవిస్తున్నానో అతను సినిమా చూసినట్టు చూస్తుంటే నేను దానిమీద మేను వాల్చి పైన సీలింగు చూడ్డంలో నాకు ఆనందం కనిపించదు. పడుకోడం ప్రైవేటుమేటరు కదా. అమ్మకాలబ్బాయిలందరూ అలాగే. అంటే అందరూ కాదు లెండి. కొందరు "పడుకుని చూడమ"ని చెప్పి అక్కడినించి వెళ్లిపోతారు కొనే ఉద్దేశ్యం ఉంటే పిలవండని చెప్పి. వాళ్ళేలా చెప్పినా నాకు మాత్రం అలా పబ్లిగ్గా పడుకోడం ఇబ్బందిగానే ఉంటుంది.

అసలు నాకు చొక్కాలూ పాంటులే షాపులో వేసుకునీ తీసుకునీ చూడ్డం చిరాకు. అలా అని వాటిని కొని ఇంటికి తెచ్చి తొడుక్కుని చూసి బాగోలేకపోతే మళ్ళీ తిరిగి ఇచ్చేయడానికో మార్చి మరోటి తెచ్చుకోడానికో వెళ్ళడం కూడా అట్టే సరదా లేదు. అయితే మరేం చేస్తానూ అంటే, ఏంలేదు, కొననంతే. నావార్డురోబు పదిహేనేళ్ళనాటిది. చాలామంది జనాలు నేను చాలా చాలా అవుటాఫ్డేటు దుస్తులు వేసుకు తిరుగుతున్నాననుకుంటున్నారని నేను కూడా అనుకుంటున్నాను కానీ నేననుకుంటున్న మరొకసంగతి వారు అనుకోడంలేదు. వారికి తెలీదు.

నా ఈ పురాతన వార్డురోబు మళ్ళీ ఫాషను అయిపోతుందని నేను గట్టిగా నమ్ముతున్నాను. నా పాతబట్టలే రానున్న భావితరానికి మార్గదర్శకాలవుతాయి. అప్పుడు నేను కూడా ఆటోమేటిగ్గా అప్డేటయిపోతాను. అంతెందుకు ఈమధ్య జరిగిన ఒక ఉదంతం చెప్తాను. నిజంగానే జరిగింది. ఇందులో నేనే హీరోని. ఒకరోజు ఓ పాత చొక్కా తొడుక్కుని రోడ్డుమీద నడిచి వెళ్తున్నాను. ఆ పక్కనే నిల్చున్న ఓ అమ్మాయి "నైస్ షర్ట్" అంది నన్ను చూసి. ఆ అమ్మాయికి పదేళ్ళుండొచ్చు. నా చొక్కాకి పదిహేను. అంటే ఆ పిల్ల పుట్టకముందు కొన్నది అన్నమాట. అంచేత ఆపిల్లకి అది కొత్తే!

సరే ఈనాటి మంచాలషాపులో నవనాగరీక మంచాలసంగతికొస్తాను.

అసలు ఇలా మొదలవుతుంది మంచాలషాపులో బాతాఖానీ

"ఎంతలో చూస్తున్నారు?"

"ఎంతుంటాయేమిటి?"

"మూడువందలనించీ ఏడువేలవరకూ ఉన్నాయి?"

నేను సీరియస్గా ఆలోచిస్తున్నట్టు రెండు క్షణాలు ఆలోచించి, ఏడువేల పానుపు నాకు అక్కర్లేదనీ, మూడువందలమంచం చూపమనీ అడుగుతాను.

అప్పుడు చెప్తాడు "అబ్బే అది ట్విన్ బెడ్" అని. అంటే పిల్లలకన్నమాట. నిజానికి నేను చొక్కాలు అప్పుడప్పుడు పిల్లల విభాగంలోనే చూస్తాను. పెద్దలసైజులు మరీ భారీమనుషులకి. పిల్లలవన్నీ నాకు పట్టవనుకోండి. అది కూడా ఒక కారణమే నేనట్టే షాపింగు చెయ్యకపోవడానికి.

ఇంతకీ నేను కొనబోయే పరుపుసంగతి - పైబెడ్డు పిల్లలకి మాత్రమే అని తెలుసుకొనినదానినై, అయితే పెద్దసైజువి చూపమంటాను. అక్కడినుంచీ ఎడ్వాన్సుడు ప్రశ్నావళి మొదలవుతుంది.

సుతిమెత్తని పరుపు కావలెనా?

కొంచెం మెత్తనిదా? ...

గట్టిగా ఉండేదా?

కొంచెం గట్టిగా ఉండేదా?

చాలా గట్టిగా ఉండేదా?

ఆతరవాత మీరు బోర్లా పడుకుంటారా

వెల్లకిలా పడుకుంటారా

పక్కకి తిరిగి పడుకుంటారా.

- ఇక్కడికొచ్చేసరికి ఆయనగారు అడగని ప్రశ్నలు కూడా నాకు తోస్తాయి.

"ఏ పక్కకి - ఎడంపక్కా కుడిపక్కా తేడాలు కూడా ఉంటాయా?" అని అడుగుతాను ఎంతో కుతూహలంగా.

అతను తెల్లబోయి, "మీకు అది ముఖ్యమా?" అనడుగుతాడు నాఅంత సీరియస్గానూ. మీరు గమనించే ఉంటారు. షాపరులెప్పుడూ లేదు అనరు. తమకి తెలీకపోయినా, తమదగ్గర మనం అడిగింది లేకపోయినా మరో ప్రశ్న వేస్తారు.

"నేను ఆ పక్కా, ఈ పక్కా, వెల్లకిలా, బోర్లా అన్ని విధాలా పవ్వళిస్తాను. కానీ మీరు ఇలా పక్కపక్కలకి వేరు వేరు పక్కలుంటాయంటుంటే, నాకు ఇంకా వివరాలు తెలుసుకోవాలని ఉత్సాహంగా ఉంది. ఎందుకంటే నాకు కుడిచెవి మాత్రమే వినిపిస్తుంది. అంటే నేను కుడివేపు తిరిగి పడుకుంటే, ఫోనొస్తే తెలీదు ఎడమచెవి వినిపించదు కనక. దానిక్కూడా మీరేమైనా సౌలభ్యం కనిపెట్టేరేమో అని అడుగుతున్నాను" అంటాను వినయంగా.

"నాకు తెలిసి లేదనుకుంటాను. మీకు కావలస్తే స్పెషలార్డరు చెయ్యగలమేమో కనుక్కుని చెప్పగలను."

అలాటిదేమీ నాకక్కర్లేదని చెప్పి, (ఎందుకంటే స్పెషలనగానే మరో రెండు వందలు వడ్డిస్తాడేమోనని), ఉన్నవాటిలోనే సుమారుగా మెత్తగా ఉన్నది కావాలంటాను. పూర్వం ఎప్పుడో మాఅమ్మాయి వచ్చినప్పుడు "అబ్బ నీపరుపు ఇంత కఠినంగా ఉందేమిటి?" అందిలెండి. అది మనసులో పెట్టుకునే కానీ నాకయితే ఆపూర్వపరుపు ఎంతో హాయిగా ఉండేది.

“ఇహ తప్పదు, ఏంచేస్తాం, నాఅవసరం మరీ” అనుకుంటూ బితుకుబితుకుమంటూ నలువేపులా ఓ సారి కలియచూసి, ఎవ్వరూ నావేపు చూడ్డంలేదని దృఢపరుచుకుని గబుక్కున ఇట్టే వాలి అట్టే లేచిపోతాను.

ఇలాటి అవస్థలన్నీ భరించి ఆ మృదు హంసతూలికాతల్పం ఇంటికి తెచ్చుకున్నాను. వారంరోజులు తిరిగేసరికి ఆ పరుపుమధ్యలో మూడంగుళాలలోతు గుంట పడింది. ఆ లెక్కన నెలరోజులు తిరిగేసరికి ఆ గోళాకాలం పరుపుమీద నా మోకాళ్లు నాముఖంలోకి చొచ్చుకుపోతాయేమో అనిపించింది. చూశారా ఈ “పొజిషను”సంగతి మాటాడనే లేదు ఆరోజు ఆ సేల్సుమేను. సరే షాపుకి వెళ్ళేను ఇదేం పరుపు అని అడగడానికి. ఆ పక్కలో గుంట ఫొటోలు తీసుకుని, ఎక్కడ ఎప్పుడు కొన్నానో అవన్నీ చిట్టా ఆవర్జాలు చూసుకుని పెద్ద యుద్ధానికి సన్నిద్ధమయి వెళ్ళేను కానీ ఆ షాపువాడు ఒక్క వాక్యమయినా పూర్తి చెయ్యనియ్యలేదు. పరుపు బాగులేనందుకు విచారం వెలిబుచ్చి, మరోటి ఇస్తాం అన్నాడు. సరే నన్నాను. వేరే చెప్పడం ఎందుకులెండి. అదీ అంతే అయింది.

ఇహ మరీ సోదిలా అనిపించే వివరాల్లోకి పోను కానీ మొత్తంమీద ఇలా కొన్న ఉత్తమ పరుపు ఇచ్చేసి మరోటి పుచ్చుకుని, మళ్ళీ అది కూడా అలాగే అయితే, .. అది ఇచ్చేసి, మరో షాపుకి వెళ్ళి అక్కడ మరోటి కొని .. మొత్తమ్మీద ఇప్పుడు నాలుగో పరుపుతో స్థిరపడ్డాను. ఇది కూడా నా వెనకటి ఊళ్ళో అణాపరక పరుపంత సుఖంగా లేదు కానీ ఇంత డబ్బు పెట్టి కొన్నాను కనక సుఖంగానే నిద్రిస్తున్నానని నన్ను నేనే నమ్మించుకుని సరిపెట్టుకున్నాను. ఈకథంతా ఓ స్నేహితురాలికి చెప్పుకుంటే, “అవునండీ ఈపరుపులంతే. అందుకే నేను హాయిగా నేలమీద పడుకుంటున్నాను” అంది! అయ్యో, మాతృదేశానుంచీ ఇన్నివేలమైళ్ళదూరం వచ్చి, నానా కష్టాలు పడుతూ సంపాదించే సంపాదనలూ కమనీయ భూమిభాగములమీద శయనించడానికా అని కొంచెంసేపు వాపోయేను. మ్.

అలాగే సోఫా కూడా రెండోది నిన్న ఇంటికొచ్చింది. ఇంక ఇల్లొక్కటే రెండోది కాదు. కనీసం ఇక్కడికొచ్చేక ప్రారంభమయిన ఈ కొత్త ఆనవాయితీ నిలబెట్టుకోడానికైనా మరో ఇల్లు చూద్దాం అనుకుంటున్నాను.

(మార్చి 22, 2011)

మార్పు 14

కూరలబజారులో లీల ఏం కొనడానికొచ్చిందో మర్చిపోయి షెల్ఫులమీద వరసగా పేర్చిన సీసాలూ, ప్లాస్టిక్ పొట్లాలూ, అట్టపెట్టెలూ చూస్తూ నెమ్మదిగా అడుగులేస్తోంది సంతలో తప్పిపోయిన బాలుడిలా.

అంతలో ఎవరో ఎదురుగా నిలుచున్నట్టయి, ఉలికిపడి ఆగిపోయింది.

ఎదురుగా విశాల చక్రాలబండితో నిలిచి, "బాగున్నారా?" అంది చిన్నగా నవ్వుతూ.

"ఆః బానే ఉన్నాను. మీరెలా ఉన్నారు?"

"ఏదో ఉన్నాం. మీఇల్లు ఇక్కడికి దగ్గిరా?".

"దగ్గిరేనండీ. పొయ్యిమీద పెనం పెట్టి, ఉప్పుకో మిరపకాయకో రాగల దూరం. అన్నట్టు నిజంగానే కౌంటరుమీద ఉల్లిపాయలు తరిగి పెట్టి వచ్చేసాను, ఉప్మా చేద్దాం అని. తీరా చూస్తే టొమేటోలు లేవు. నాకు ఉప్మా అంటే టొమెటో ఉండితీరాలి  అంచేత వచ్చేను, రండి. మీరు కూడా ఉప్మా తిని పోదురుగానీ," అంది విశాల గుక్క తిప్పకోకుండా.

లీలకి మనసు బాగులేదు. "ఇవాళ కాదులెండి, మరోసారి వస్తాను."

"ఎంతసేపు, ఇక్కడే. మరోసారి మళ్ళీ వద్దురుగాని. ఇప్పుడొచ్చి తాజా తాజా టొమేటోతో చేసిన ఉప్మా తినేసి వెళ్ళిపోండి. చెప్పేను కదా సరంజామా అంతా సిద్ధంగానే ఉంది. స్టౌమీద నీళ్లు పెడితే మూణ్ణిముషాల్లో వేడి వేడి ఉప్మా తయార్."

లీలకి కబుర్లు చెప్పే ఓపిక లేదు కానీ ఇంటికెళ్ళాలని కూడా లేదు. రెండురోజులక్రితం సుందరంతో తగువేసుకుని, ఇంట్లో ఉండబట్టక, బయటికి బయల్దేరింది. గంటసేపు రోడ్లమీద తిరిగి, అప్పటికీ ఇంటికెళ్ళడానికి మనసు రాక, మరెక్కడికీ వెళ్ళలేక, పార్కుకెళ్లి అక్కడ కార్లోనే పడుకుంది చీకటి పడేవరకూ. అది తలపుకొచ్చి మరింత చికాకైపోయింది మనసు ఇప్పుడు.

"సరే. పదండి. అట్టేసేపు ఉండను మరి. మళ్ళీ మీరేం అనుకోకండి," అంటూ దారితీసింది.

ఇద్దరూ విశాల ఇల్లు చేరుకున్నారు పదినిముషాల్లో.

హాల్లో వినయ్ దేవీవిగ్రహానికి అలంకరణ చేస్తున్నాడు. విశాల వంటింట్లోకి వెళ్లి పొయ్యిమీద గిన్నె పెట్టి, ఓ గరిటెడు నూనె వేసి, హుషారుగా టొమెటోలు తరగడం మొదలు పెట్టింది.

వినయ్ లీలని చూసి చిన్నగా నవ్వేడు. లీల అక్కడే నిలబడి, దేవీవిగ్రహానికి అతను చేస్తున్న అలంకరణలు చూడసాగింది కుతూహలంగా.

"ఊదారంగు చీరె బాగుంది. కట్టు," అంది.

"లేదండీ. అది నిన్న కట్టేను. ఈరోజు పచ్చరంగు అనుకుంటున్నాను," అన్నాడు వినయ్ తలొంచుకుని ఒకొక అలంకరణా దీక్షగా పరిశీలించి చూస్తూ.

"కట్టిన చీరె కట్టదేమిటి మీ అమ్మవారు," అంది లీల తేలిగ్గా నవ్వి..

వినయ్ కూడా చిరునవ్వు నవ్వేడు. "నవరాత్రులు కదండీ. ఒకొక రోజు ఒకొక అలంకరణ" అన్నాడు ఆ విగ్రహానికి పచ్చచీరె నేర్పుగా చుట్టి, కుచ్చెళ్లు సర్ది, మీద పచ్చరవికగుడ్డ వేసి, మెళ్ళో పచ్చరాళ్ల నెక్లెస్ అమర్చి, ముక్కుకీ చెవులకీ ఆభరణాలు ఏది బాగుంటుందో చూస్తున్నాడు ఒకొకటే ఎత్తి పట్టుకు చూస్తూ.

"మ్. ఈ అమ్మవారు ఊరుకున్నా మీ అమ్మగారు ఒప్పుకోరేమోలే"

"అదేంలేదు లీలా, అదంతా వాడిష్టమే. నాకేం సంబంధం లేదు," అంది విశాల పోపేసి, నీళ్లు పోస్తూ. పోపులో నీళ్లు చుయ్యమని హొరు పెట్టి, చల్లారేయి.

లీలకి మొదట అర్థం కాలేదు.

విశాలే అంది మళ్లీ. తను ఈ పూజలూ, వ్రతాలూ అవీ ఏం చెయ్యదుట.

"మరి మీ అబ్బాయికి ఎలా వచ్చింది? వాళ్ళనాన్న చేస్తారా?"

"లేదు. ఆయన ఇప్పుడు లేరులెండి. ఉన్నప్పుడు కూడా అంత పట్టింపుల్లేవు. వీడికెలా వచ్చిందో నాకూ తెలీదు కానీ మూడేళ్లనించే మొదలయింది."

లీల మళ్ళీ వినయ్‌వేపు చూసింది. మహా అయితే పన్నెండేళ్లుంటాయేమో. సాటిపిల్లలతోనో ఒంటరిగానో ఏ విడియో గేమో ఆడుకుంటూ అల్లరచిల్లరగా తిరిగే వయసు. ఇంత దైవభక్తి, శ్రద్ధ ఎలా వచ్చాయో!

లీల వంటింటివేపు నడిచి కౌంటరుదగ్గర నిలబడింది.

"ఏమిటో దిగులుగా కనిపిస్తున్నారు. వంట్లో బాగులేదా?" అంది కన్నెత్తి విశాల లీలవేపు చూడకుండానే.

“ఏం లేదండీ. బాగానే ఉన్నాను.” అంది లీల నిరామయంగా..

“ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూంటారు హుషారుగా ఉంటారు. ఏంలేదంటే ఎలా నమ్మమంటారు. మనసు బాగులేదా, ఆరోగ్యం బాగులేదా?” అంది విశాల.

హఠాత్తుగా లీలకి ఉప్పెనగా దు:ఖం వచ్చింది .పూడుకుపోయిన గొంతుతో నాలుగురోజులక్రితం జరిగిన విషయం - తనూ, సుందరం, ఊళ్లో కొత్తగా దిగిన రెడ్డితో సినిమాకి వెళ్లడం, అక్కడ తనని ఒదిలేసి వాళ్ళిద్దరూ ఇంటికెళ్లిపోవడం కథంతా.

“ఏమోలెండి. ఆయనదృష్టిలో ఆయన చేసింది తప్పుకాదు. అదేం అడిగిన నాదే తప్పేమో.”

విశాల కాస్సేపు ఊరుకుని, నెమ్మదిగా అంది, “మ్. అతను ఇన్నాళ్ళూ మీతో ఎలా ప్రవర్తించేరో ఆరోజు అంతే అనుకుంటా. అఁటే మీరు ఇంట్లో మనిషి. మర్యాదలు పాటించక్కర్లేదు. పైగా మీరు ఆయన అర్ధాంగి కనక ఆయన చేసినపని మీరు ఆమోదించాలి. పైగా మనదేశంలో అతిథి సేవకి అంత విలువ కూడాను మరి. బహుశా రెండూ కలిసి మిమ్మల్ని నిర్లక్ష్యం చేసినట్టు, కనీసం అలా పైకి కనిపించేలా చేసేయేమో.”

“ఏమోనండీ. నాకు మాత్రం మరుద్దామన్నా మరుపు రాకుండా ఉంది. భాధగా ఉంది.”

“బాధ శరీరానికే కానీ ఆత్మకి లేదు.”

లీల ఉలికిపడి ఆ మాట వచ్చినవేపు తిరిగి చూసింది.

వినయ్ తదేకధ్యానంతో దేవీవిగ్రహానికి అలంకరణలో మునిగి ఉన్నట్టున్నాడు. అయినా తమమాటలు విన్నాడన్నమాట.

“ఏమన్నావూ?” అంది లీల నమ్మలేనట్టు. బొమ్మలకి అలంకారాలు చెయ్యడం వేరూ, ఆత్మజ్ఞానం మాటాడ్డం వేరూ కదా.

“బాధ శరీరానికే కానీ ఆత్మకి లేదండీ.”

లీలకి గుర్తొచ్చింది. ఈ అబ్బాయే సౌజన్య ఇంట్లో ఉపనిషత్తులూ శంకరభాష్యాలు చదివేనని గోపాలాచార్యగారికి చెప్పింది.

“మనం ఈ శరీరాలోనే ఉన్నాం కనక శరీరానికి కలిగిన బాధ మనకి కలిగినట్టు కాదా?”

“మీరు నవ్వొచ్చినప్పుడు మీకు బాధగా అనిపించలేదు. నవ్వుని అంగీకరించేరు. అలాగే బాధని కూడా అంగీకరించాలి. ఉపనిషత్తులు చెప్పేది అదే. సుఖంలాటిదే దు:ఖం, సంతోషంలాటిదే విచారం. రెంటినీ సమదృష్టితో అంగీకరించినప్పుడు సంతోషమూ, బాధా కూడా మనని అంటవు.”

“రెండూ ఒకటే అయితే మంచిని వదిలేసి చెడునీ, సుఖాన్ని వదిలేసి దు:ఖాన్నీ, సన్మార్గాన్ని వదిలి దుర్మార్గాన్నీ ఎందుకు స్వీకరించకూడదు?”

“అది కుతర్కం. మానవజన్మ ఉత్కృష్టమయినది. ఈ జీవితంలో మంచిని పాలించడంద్వారా జీవన్ముక్తులవడానికి అవకాశం కల్పించబడింది. దాన్ని సద్వినియోగం చేసుకోవలసినబాధ్యత మనదే.”

“మానవజీవితం ఉత్కృష్టమయింది చెప్పింది మానవుడే కదా.”

“కాదని మీరు నిరూపించగలరా?”

“సరే నీమాటే నిజం అనుకుందాం ప్రస్తుతానికి. నవ్వు వచ్చినప్పుడు మనసుకి తృప్తిగా ఉంటుంది, ప్రశాంతంగా ఉంటుంది. బాధ కలిగినప్పుడు మనస్తాపానికి గురి అవుతాం. ఎంచేత?”

“అదే అంటున్నాను. ఈ సుఖదు:ఖాలు మీ ఆలోచనలో ఉన్నాయి. వాటికి మీరు ఇచ్చుకునే వ్యాఖ్యానాల్లో ఉన్నాయి. మనవాళ్ళు చిన్నపిల్లలకి చక్కిలిగింతలు పెడతారు. పిల్లలు నవ్వుతారు. ఆ నవ్వు కృతకంగా ఏర్పడింది, శారీరకమైన ఒక స్పందన మాత్రమే అది. నేను మీచేతిమీద కొట్టబోతే మీరు చెయ్యి వెనక్కి లాక్కున్నట్టే - అసంకల్ప ప్రతీకారచర్య. ఆ పిల్లవాడి నవ్వులో సంకల్పం లేదు. నిజానికి అలా చక్కిలిగింతలు పెడుతున్నప్పుడు ఆ పిల్లవాడికి చిరాగ్గా కూడా ఉండవచ్చు. పెద్దవాళ్లకి అది తోచదు. వాళ్లకి పిల్లవాడు నవ్వడమే కనిపిస్తుంది. సంబరపడతారు. బాహ్యంగా కలిగే ఈసుఖదు:ఖాలు కూడా అలాటివే.

మీరు మరో ఉదాహరణ చెప్తాను.”

ooo

రోజంతా ఎండలో తిరిగిందేమో విశాలకి మంచంమీద పడుకోగానే గాఢంగా నిద్ర పట్టేసింది.

“అమ్మా, తలుపు తియ్యి, తియ్యి” అంటూ కూతురు బొంగురుగొంతు వినిపించింది. విశాల లేవబోయింది కానీ కాళ్లూ, చేతులూ కదల్లేదు ఎంత గింజుకున్నా. బలవంతాన కళ్ళు విప్పి చూసింది.

కూతురు నీడ కనిపించింది. కూతురు ఏడుస్తూ తలుపు తియ్యమంటోంది. ఎవరో పోలీసుజవానులా ఉన్నాడు వచ్చి నెమ్మదిగా ఆఅమ్మాయిభుజంమీద చెయ్యేశాడు అభయం చెప్తున్నట్టు.

విశాల అతికష్టంమీద గొంతు పెగల్చుకుని వస్తున్నా అంటూ లేచింది.

మరోసారి కిటికీవేపు చూసింది. అది తను ఇందాకా చూసిన కిటికీ కాదు. కిటికీలోంచి కూతురునీడ కనిపించడంలేదు.

అది కల అని అర్థమయింది. కానీ ఎంతో నిజంగా జరిగినట్టే ఉంది మేలుకున్న తరవాత కూడా.

లేచి, ఫోను తీసి కూతుర్ని పిలిచింది, "ఎలా ఉన్నావు?"

"నేను బానే ఉన్నా. ఇదేమిటి, ఇది నీకు నిద్రవేళ కదా, పడుకోలేదూ?"

"పడుకున్నా. కలొచ్చింది నువ్వు ఎందుకో ఏడుస్తున్నట్టు. ఏమయిందోనని …"

"హా. లేదు. నేను బాగానే ఉన్నా. ఏడవడంలేదు. రేపో మీటింగుంది. దానికి ఫైళ్లు చూసుకుంటున్నా. నువ్వెలా ఉన్నావు?"

"బాగానే ఉన్నా. అబ్బ, ఆ కల ఎంత నిజంగా ఉందో ఇప్పటికీ, మెళుకువ వచ్చేసింతరవాత. సరే, నేను మళ్లీ పడుకుంటా. నీపని చూసుకో,"

ooo

వినయ్ మళ్లీ తన వాదన సాగించేడు, "అదొక చేతనాచేతనావస్థ. మాఅమ్మకి చేతనావస్థలో కూడా అది వాస్తవంగానే అనిపించింది. ఫోను తీసి మాఅక్కతో మాటాడేవరకూ ఊరుకోలేకపోయింది. నిజానికి అది కలే కదా. అయినా మాఅమ్మకి ఆ క్షణంలో అది నిజం. అదీ మనం గ్రహించవలసింది. జీవితం కూడా ఆ కలలాటిదే. మనం ఏది నిజమనుకుంటున్నామో అది భ్రమ."

"అంటే నాబాధ నిజం కాదనా నీ వాదన?"

"మీనవ్వులాటిదే ఆ నిజం కూడా. నవ్వు నిజమైతే బాధా నిజమే. నవ్వు భ్రమ అయితే బాధ కూడా భ్రమే. రెండూ సమంగా చూడడమే జ్ఞానం."

"సరే మాటల్లో పడి నా ఉప్మా మరిచిపోతారు. రండి చల్లారిపోతే బాగుండదు," అంటూ విశాల పళ్ళేలూ, గిన్నెలూ బల్లమీద సర్దింది.

లీల ఆలోచిస్తూ లేచింది. ఈకుర్రవాడిలో ఇంత జిజ్ఞాస ఉండడమే ఆశ్చర్యంగా ఉంది. ఇది ఇంకా ఆలోచించాలి. ఇతనితో మరొకసారి వివరంగా మాటాడాలి అనుకుంది.

మార్చ్ 15

"బాగున్నావా? చాల్రోజులయింది చూసి," అన్నాడు ప్రభాస్రావు.

సుందరం ఉలికిపడి అటుతిరిగి, "ఓ, అంకుల్, ఆ, బాగానే ఉన్నానండి. అవును ఎప్పుడు చెప్మా ... కనీసం నాలుగేళ్లయిఉండాలి, ఆంటీ, విషీ, అందరూ బాగున్నారా?" అన్నాడు.

"నాలుగేళ్ళయే ఉంటుంది. పిలుద్దాం అనుకుంటూనే ఏదో అలా అయిపోతోంది ఎప్పటికప్పుడు. పైగా నాకు తీరినా నువ్వెంత బిజీగా ఉంటావో అనొకటీ," అన్నారు, సుందరానికి ఎదురుగా మరో కుర్చీలో కూర్చుంటూ.

"నిజమేనండీ. ఈదేశంలో చావడానికి కూడా అపాయింటుమెంటు తీసుకోవాలి. ఆ యమధర్మరాజే వచ్చినా, ఇప్పుడు కాదు బాబూ, ఆర్నెల్లతరవాత కనిపించు అనాలేమో."

"ఇవాళ 90 దాటుతుందన్నాడు వెదరుమేను. ... మరో నెలయినా కాస్త చల్లగా ఉంటే బాగుండు."

"అవునండీ. పైగా ఈ ఈదురుగాలొకటీ. వీధిలోకి అడుగెడితే, వాయుదేవుడే వాహనంలా అయేలా ఉంది."

"బాగా చెప్పేవు."

సుందరానికి ఈయన ప్రత్యేకించి తనకి ఇవాళ ఇలా "తటస్థపడడం" అనుకోకుండా జరిగినట్టు లేదు.

తను తరుచూ పుస్తకాలషాపుకి వస్తాడని దాదాపు సుందరాన్ని తెలిసినవాళ్లందరికీ తెలుసు. ఇది తనకి చాలా ఇష్టమయిన ప్రదేశం. ఇక్కడ పుస్తకాలే కాక కూర్చుని కాఫీ తాగడానికీ, కబుర్లు చెప్పకోడానికీ కూడా అవకాశాలున్నాయి.

రెండు నిముషాలు నిశ్శబ్దం.

"నువ్వూ లీలా ....బాగానే ఉన్నారా?" అన్నాడు ప్రభాస్రావు గొంతు తగ్గించి, తటాపటాయిస్తూ.

సుందరం మనసులోనే ఉలికిపడ్డాడు.

"బాగానే ఉన్నాంవండీ. ఏం అలా అడుగుతున్నారు?"

“అఁ, ఏం లేదు. పెద్దవాణ్ణి కదా. మీనాన్నా, నేనూ ఓ కంచంలో తిని ఓ మంచంమీద పడుకోలేదు గానీ ఇంచుమించు కవలపిల్లల్లాగే పెరిగేం హైస్కూలు అయిపోయేవరకూ. మీపెళ్ళికి కూడా వచ్చేను, గుర్తుందా? అంచేత మనవాడెలా ఉన్నాడో అని అప్పుడప్పుడూ అనుకుంటూ ఉంటానంతే.”

“యా. థాంక్స్. బాగున్నాఁవండీ. ఈమధ్య లీలకి ఉద్యోగంలో ప్రొమోషను కూడా వచ్చింది. నేను కూడా చాలా ఆనందపడిపోయేను. తనకి కొత్త కంప్యూటరు కొనిచ్చేను” అన్నాడు సుందరం గబగబా.

మళ్ళీ రెండు నిముషాలు నిశ్శబ్దం. ఇద్దరూ షాపులోకి వచ్చే పోయేవారినీ, కాఫీలు తాగుతున్నవారినీ, కాఫీ కప్పు పుచ్చుకు, ఏ పుస్తకమో సీరియస్‌గా చదివేసుకుంటున్నవాళ్ళనీ పరిశీలించేరు కొంచెంసేపు.

“ఈమధ్య ఏదో విన్నాలే. లీల ఎవరితోనో ఏదో అందని మీ ఆంటీ నాతో అంది. దానికేముందిలే ఏవో చిన్నచిన్న తగూలు సహజమే కదా మొగుడూ పెళ్ళాలన్నతరవాత అన్నాను.”

సుందరం “ఏం తగువండీ?” అన్నాడు కంగారు కప్పిపుచ్చుకుని.

“మ్. చూశావా. నేనూ అదే అనుకున్నాను ఏం తగువులే అని. ... మ్.. ఏంటంటే ... అదే నువ్వూ, ఆవిడా మరెవరితోనో సినిమాకి వెళ్ళి, ఆవిణ్ణి ఒక్కదాన్నీ ఒదిలేసి వచ్చేశావుట. అందుకు ఆవిడ చాలా బాధ పడిపోయి ఆ విశాలగారితో చెప్పకుందిట.” ప్రభాస్రావుకి నేనేం అదేం పెద్దవిషయం అనుకోలేదులే అనిపించే స్వరంతో.

“ఓఓఓ అదా. అబ్బే, అదేంలేదండీ. తను ఆ క్షణానికి కాస్త బాధ పడినమాట వాస్తవమే. ఉప్పూ పులుసూ తినేవాడికెవరికైనా అలా అనిపించడం సహజమే కదండీ. ఆతరవాత నేను పరిస్థితి విడమర్చి చక్కగా చెప్పింతరవాత తను కూడా ‘నిజమేనండీ‘ అంది. తనకి ఆమాత్రం తెలీక గాదండీ. అసలు సమస్యేమిటంటే లీల చాలా ఎమోషనల్. చాలా చిన్నవిషయానికి కూడా అగ్గిపుల్లలా భగ్గున మండిపడిపోతుంది కానీ మళ్లీ చప్పన చల్లారిపోతుంది కూడా.”

“నేను అదే అనుకున్నాలే,” అన్నాడు ప్రభాస్రావు తృప్తిగా.

“ఏం చెప్పేనని అడగరేం? అసలు అంతెందుకూ, మీరే చెప్పండి ఇలాటి సందర్భాలలో మధ్యేమార్గం ఉంటుందా? ‘మీరెళ్ళండి, నేను మాఅవిడని ఒంటరిగా వదిలి రాలేను‘ అని రెడ్డికేనా చెప్పాలి, ‘నేను రెడ్డితో వెళ్తున్నాను, నువ్వు తరవాత రా‘ అని లీలకేనా చెప్పాలి. అంతేగదా. ఇద్దరితోనూ ఉండడానికి నాకేం రెండు కాయాలు లేవు కదా. నేనేం ఆ వాసుదేవుణ్ణి కాదుకదా ఇక్కడా అక్కడా, ఎందెందు వెతికి చూచిన అందందంతా కనిపించడానికి. హ్ హ్. లేదులెండి, ఊరికే హాస్యానికంటున్నా. పాపం రెడ్డి

‘కడుపులో కెలికేస్తోందండి, నేనింక కూర్చోలేను‘ అనగానే, నాకు మరేం తోచలేదు. ‘పదండీ,‘ అని బయటికి తీసుకుపోయేను. ఆతరవాత ఏదో మాటాడుకుంటూ ఇంటికి తీసుకొచ్చేను. లీల ఇంటికి వచ్చేవేళకి మేమిద్దరం పేకాడుతూండడమే తనకి కనిపించింది కానీ అతను ఆ మధ్యలో ఎంత అతలాకుతలం అయిపోయేడో తెలీలేదు. అంచేత ఆ క్షణానికి కోపం తెచ్చుకుంది. తరవాత నేను వివరించి చెప్పినతరవాత తను కూడా అర్థం చేసుకుందిలెండి.”

“ఆహా. అయితే నువ్వు మాటాడేవన్నమాట ఆవిడతో. బావుంది. మరి ఆమాత్రం దానికి ఆ విశాలగారిదగ్గర ఎందుకూ ఆ ఏడుపూ అని?”

“అదేనండీ. మనవాళ్ళేమో అదుగో పులి అంటే ఇదుగో తోక అనేరకం. పులీ, తోకా లేనిచోట కూడా ఓ కాయితప్పులిని పుట్టించి, కతలు రేపుతారు. అసలు లీల ఏమందో ఆ విశాలగారు ఏంవర్థం చేసుకున్నారో … హుమ్. ఆడవాళ్ళు ….”

“మాబాగా చెప్పేవు సుందరం. నాకు తెలుసు నువ్వు ఎట్టి క్లిష్టపరిస్థితులనయినా చక్కగా సమర్థించుకు రాగలవు, మీనాన్నలాగే.”

“మీకు తెలుసా. మేం విస్కాన్సిన్‌కి వచ్చినకొత్తలో తెలుగుమొహాలకి వాచిపోయేవాళ్ళం. నేను కాదులెండి, లీలకే అది మరీ ఉండేది. తెలుగువాడు కనిపిస్తే, సాక్షాత్తూ శ్రీవెంకటేశ్వరస్వామి ప్రత్యక్షమయినంత ఆనందంగా ఉండేది. అప్పుడే ఏదో షాపులో కనిపించి నాయుడుగారు కొత్తగా వచ్చేం అని తెలిసి, వాళ్ళింటికి పిలిచేరు. ఆరోజు ఆవిడ చేసిన మిరప్పళ్ళపచ్చడి లీల ఇప్పటికీ తలుచుకుంటుంది. దేశం కాని దేశం వచ్చేక ఇక్కడ ఉన్నవాళ్ళే కదా మనకి తల్లులూ, తండ్రులూ, సఖులూ, బంధువులూను.”

“నేనూ అదే అన్నాను మాఆవిడతో. లీలకి అంత బాధగా ఉంటే ఆమాట సుందరంతోనే చెప్తే పోయేది కదా అని. ఊళ్ళోవాళ్ళతో చెప్తే, వాళ్ళేం చేస్తారు? ఇదుగో ఇలా కాకిగోల చేసి, నీ పరువు తియ్యడం తప్ప.”

“నేను అదే చెప్పేను లీలకి. రెడ్డి కొత్తవాడు. అతనేం అనుకుంటాడో అని మనం బాధపడాలి కానీ నీకూ నాకూ మధ్య ఈ మర్యాదలూ, మన్ననలూ ఏమిటి అని. నిజం చెప్తున్నా అంకుల్. అసలు మనిద్దరం ఒక్కతాటిమీద నడుస్తాం, ఒక్కమాటమీద నిలబడతాం. తనేం చేసినా నేనేం అనుకోను. .నేనేం చేసినా తనేం అనుకోదు. మామధ్య అలాటి అండర్‌స్టాండింగ్ ఉంది. ఉండాలి. ఇక్కడ అమెరికనలకి అ అంటర్‌స్టాండింగు లేదు కనకే అనుక్షణం ‘ఐ లౌ యూ, ఐ లౌ యూ‘ అంటూ హామీలిచ్చుకుంటూ

ఉంటారు క్షణక్షణం. మన సంప్రదాయంలో అది ఎందుకంటే ఇదే కారణం. మనలో భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకుని, ఒకరిప్రవర్తనని మరొకరు గౌరవించే ఆచారం ఉంది.''

సుందరం మన సంస్కృతీ, సంప్రదాయాలగురించి ఇనుమిక్కిలి ఉద్రేకంతో చెప్పుకుపోతుంటే, ప్రభాస్రావుకి ముచ్చటేసింది.

''అవును సుందరం, నీకు మన సంప్రదాయాలు ఇంత చక్కగా అవగాహన కాబట్టే మీ సంసారం సజావుగా సాగిపోతోంది. చెప్పనో లేదో మీ ఆంటీకీ నాకూ మధ్య అనుబంధం కూడా అలాటిదే.''

''లీల కూడా అదే అందండీ. 'మీరన్నది సబబే. పాపం రెడ్డి ఇంక ఎన్నాళ్ళుంటాడు కనక. మరో వారం రోజులు, అంతే కదా. కాస్త దగ్గరుండి కనిపెట్టుకునుండండి. నాకు కుదుర్తుందో కుదర్దో … మీరిద్దరూ రోజు సినిమాలకి వెళ్తూండండి. అసలు అక్కడే పడుకుంటే బాగుంటుందేమో. మళ్లీ ఏ రకాలపుకార్లూ పుట్టకుండా, చెరో గదిలో పడుకుని, అలా ఫొటోలు కూడా తీసిపెట్టుకోండి అంది.''

ప్రభాస్రావు మొహంలో అయోమయం గమనించి, సుందరం గట్టిగా నవ్వేడు. ''హా …హా హా … అదేనండీ మా లీల సెన్స్ ఆఫ్ హ్యూమర్. మేం ఇద్దరం తెగ నవ్వుకున్నాం.''

సుందరం లేస్తూంటే, ప్రభాస్రావు కూడా లేస్తూ, ''పద, నీతో రెండు మాటలు చెప్పాలి.'' అన్నాడు సుందరాన్ని అనుసరిస్తూ.

సుందరానికి ప్రభాస్రావు తనమాటలని మెచ్చుకోడం, తనతో ఏదో ముఖ్య విషయం చర్చించాలనడం మహా తృప్తినిచ్చింది. ''చెప్పండి,'' అన్నాడు బయటికొచ్చి ఆగి.

''అదే విషసంగతి.''

''విషసంగతా? ఏమయిందేమిటి?''

''ఏం కాలేదు. అరవింద నీకు తెలుసు కదా. నీకు వరసకి చెల్లెలవుతుందనుకుంటాను.''

''చాలా దూరపు చుట్టరికమండీ. ఇంతకీ అసలు సంగతి చెప్పేరు కారు.''

''పిల్లలు కదా. కాస్త ఆవేశాలెక్కువ. ఇక్కడ ఇదో గోల. హైస్కూలేనా కాకుండా డేటింగంటూ మొదలెడతారు.''

''ఒస్. అంతేనా. మీరన్నట్టు అదో రకం ఆనవాయితీ … రైటాఫ్ పాసేజి అనుకోండి. అదే పోతుందిలెండి. వీళ్ళకి పాతిక దాటేలోపున ఇలాటివెన్నో.'' అన్నాడు సుందరం తేలిగ్గా.

“అదే బాబూ నేను కూడా అన్నది. కానీ విషి అలా అనుకోడం లేదు. నేను చెప్తే వినడం లేదు. ఆ పిల్లే నా లవ్వాఫ్ లైఫంటూ ఒకటే గోల.”

“విషితో మాటాడమంటారా?”

ప్రభాస్రావు క్షణం ఆలోచించి, “విషికి నేను చెప్తానులే. వాడిది అసలే చాలా సున్నితమయిన మనసు. నువ్వు ఆ అరవిందతో మాటాడు. విషికేమిటి మగాడు. కో అంటే కోటిమంది వాడిముందు వాల్తారు. ఆ అమ్మాయికుండాలి. వాళ్ళపెద్దలకుండాలి. ఆడపిల్ల. ... కొంతకాలం వీడితో తిరిగింది అంటే మనవాళ్లమధ్య పరువుంటుందంటావా?”

“మీరేవంటున్నారో నాకర్థం కావడంలేదు.”

“ఏం లేదు. మళ్ళీ వాళ్లిద్దరూ కలిస్తే బాగుంటుందనీ .... ఇప్పడే పెళ్ళి చేసేస్తాం అనంలేదులే నేను. ... ఇద్దరూ చదువులయేకే చేసుకోవచ్చు. అంతవరకూ మనవాడిని ఆ పిల్ల డంప్ చేసిందన్న మాట పైకి పొక్కకుండా ఉంటే మంచిదని. ఈదేశంలో ఇద్దరూ పెరుగుతున్నవాళ్ళు ... ఇక్కడ ఉన్నవాళ్ళలోనే చూసుకోవాలి కదా. వాళ్ళకి మళ్ళీ మాలాటి సంబంధం దొరుకుతుందేమిటి? అందులోనూ కొన్నాళ్ళు మావాడితో తిరిగిందంటే ... హుమ్.”

“... .... ....”

“ఏంలేదు. మీఆంటీకి కూడా ఆ పిల్లంటే చాలా ఇష్టంగా ఉంది. అంచేత వీళ్ళిద్దర్నీ ఒకింటివాళ్ళని చెయ్యాలని నా అభిమతం. మావాడు మనతెలుగుపిల్లనే చేసుకుంటానని పట్టు బట్టేడు. వాళ్ళకీ అలాటి కోరికే ఉందనుకుంటాను.”

“సరేనండీ. చూస్తాను. చెప్పేను కదా. మాకూ వాళ్ళకీ సోషలైజింగు తక్కువే. కానీ ఇలాటి సందర్భాల్లో చుట్టరికం తిరగదోడడంలో తప్పలేదు కదా.”

సుందరం ప్రభాస్రావుకి ధైర్యం చెప్పి తనకారువేపు నడిచేడు.

ప్రభాస్రావుకి తన ఆలోచన కార్యరూపం ధరిస్తుందనే నమ్మకం కుదిరింది.

"అన్నట్టు మరోమాట. లీలకి ఏదైనా మనస్తాపం కలిగితే, ఆంటీతో చెప్పమను. సంసారం గుట్టూ, రోగం రట్టూ అన్నారు. ఇలాటి చిన్న చిన్న విషయాలు బయటికి పొక్కనీకూడదు," అన్నాడు ప్రభాస్రావు చివరిమాటగా.

"ఎందుకులెండి. నేను చూసుకుంటాను. అవసరమయితే చెప్తాలెండి" అన్నాడు, సుందరం, మళ్లీ ఆయన్ని చిన్నబుచ్చడం ఇష్టంలేక.

(ఏప్రిల్ 19, 2011)

## మార్పు 16

''శనివారం మీకేం పన్లేదూ?''

''హా. అదేం ప్రశ్న? నాకు పనుందో లేదో నీకిప్పుడు ఎందుకింత అర్జంటుగా కావలసివచ్చిదీ?''

''అది కాదండీ. తప్పనిసరిగా నేను మీయింటికి రావలసిన అవసరం మీకేమీ లేదా అని.''

నాకు అరవింద ధోరణి అర్థం కాలేదు. చిన్నగా నవ్వుకుని, ''ఉంది. అసలు నువ్వు రాకపోతే కొంపలంటుకుపోతాయి, ఆరోజు మరేపనీ పెట్టుకోకు,'' అన్నాను ఆ అమ్మాయి ధోరణి అందుకుని, కొనసాగించే ఉద్దేశంతో.

రెండు క్షణాలు చేతిలో ఫోనువేపు చూస్తూ కూర్చున్నాను, ఇప్పడయినా అసలు సంగతేమిటో చెప్తుందేమోనని.

కిటికీలోంచి గాలికి సన్నగా ఊగుతున్న పేరు తెలీని చెట్టు కొమ్మలూ, ఉండీ ఉడిగీ ఓ పిట్ట కూతా తప్ప మరే నిశ్శబ్దం లేదు.

''అన్నట్టు మరిచిపోయేను. ఇప్పుడు కూడా చాలా పనుంది. ఓమారు రాకూడదూ?'' అన్నాను ఆఖరికి. ముఖాముఖి మాటాడుకోడం తేలిక కదా.

అరవింద అందుకోసమే ఎదురు చూస్తున్నట్టు, ''చెప్పరేం మరి. ఇదుగో అయిదు నిముషాల్లో అక్కడుంటాను,'' అని ఫోను పెట్టేసింది.

పది నిముషాల్లో ప్రత్యక్షమయింది. అట్టే జాప్యం లేకుండానే అసలు సంగతి అర్థమయింది.

''సుందరంగారెందుకో ఫోను చేశారు.''

''అంటే? సాధారణంగా చెయ్యరనా?''

“చెయ్యరు. వాళ్ళకీ మాకూ ఏదో దూరపు చుట్టరికం ఉంది. తెలుగువాళ్ళం కదా ఎవరిళ్ళలోనో ఏదో అయినప్పుడు కలుస్తుంటాం. అసలు నేనయితే ఆయన్ని చూసి రెండేళ్ళకి పైనే అవుతోంది.”

“ఎందుకు పిలిచారో చెప్పలేదా?”

“ఆయన చెప్పలేదు కానీ నాకో అనుమానం ఉందిలెండి.”

నేను మాటాడలేదు తను ఎంతవరకూ చెప్పదలుచుకుందో నాకు తెలీదు కదా.

“విషినాన్న ఈయన్ని నాతో ఏదో మాటాడమని చెప్పిఉంటారు. ఈయన ఏం అడుగుతారో, నేనేం చెప్పాల్సివస్తుందో అని నాభయం. భయమేమిటిలెండి, చిరాగ్గా ఉంది. అసలు నా సొంతవిషయాలకి వీళ్ళందరికీ నేను జవాబులు చెప్పకోడం ఏమిటని?”

“నీ సొంత విషయాలే ఆయన మాటాడతారని నువ్వెందుకనుకుంటున్నావు?”

“పదిరోజులకిందట నాకూ విషీకీ మధ్య ఓ చిన్న సీను జరిగిందిలెండి. దాంతో వాళ్ళనాన్నకి కోపం వచ్చింది. ఆయనేమో సుందరంగారిని మధ్యవర్తిత్వం జరపమన్నట్టుంది. అసలు ఆయనకి మాత్రం ఎందుకో నాకర్థం కావడంలేదు.”

ooo

“ఈనాటి ఆర్థికపరిస్థితులలో పరిమిత ఆదాయంగల మధ్యతరగతి కుటుంబాల్లో ఆరోగ్యం ఎలా కాపాడుకోగలరు?” అన్న విషయంమీద అరవింద రాసిన వ్యాసానికి దేశస్థాయిలో మొదటి బహుమతి వచ్చింది.

క్లాసులో వాళ్ళ ఎకనమిక్స్ టీచరు ప్రకటించేరు. క్లాసు మొత్తంగానూ విడివిడిగానూ అభినందించారు. అరవింద మహోత్సాహంలో పొంగిపోతూ ఇంటికి బయల్దేరింది. బహుమతి ప్రదానాలు ఆగస్టులో వాషింగ్టన్లో జరుగుతాయిట.

అరవింద ఉత్సాహంగా కూనిరాగాలు తీస్తూ అడుగులేస్తోంది. ఇంతలో విషి ఎదురయేడు. శుభవార్త చెప్పింది. “హేయ్, నావ్యాసానికి మొదటి బహుమతి వచ్చింది. నేను వాషింగ్టన్ వెళ్తున్నా,” అని.

విషి, ముఖం ముడుచుకుని “సంతోషం,” అన్నాడు. ఆ స్వరంలో సంతోషం లేదు. సంతోషిస్తున్న ఛాయలు లేవు.

అరవింద ఉత్సాహం సగం అయింది. “అదేమిటి? ఎంచక్కా I am proud of you, అనో I am so glad for you అనో అనాలి కానీ,” అంది, అతని నీరసాన్ని హాస్యంలోకి దింపే ప్రయత్నంలో..

ఆ హాస్యం కూడా హత్తలేదు అతనికి.

"అసలు ఆ బహుమతి నాకు రావలసింది. నీకెలా ఇచ్చేరో నాకర్థం కాడంలేదు. అసలు వాళ్ళు నావ్యాసం చదవలేదేమో. లేదా వాళ్ళ మట్టిబుర్రలకి అర్థం కాలేదో.. అయినా అంతేలే. ఆడపిల్ల పేరు చూడగానే పోనీ పాపం అని ఇచ్చేసుంటారు."

దాంతో అరవింద ఉత్సాహం పూర్తిగా చచ్చింది. చిన్నకోపం కూడా వచ్చింది. "ఛీ. నీతో చెప్పడం నాదే తప్పు. అసలిందుకే నిన్ను డంప్ చేసేను." విసురుగా తిరుగు సమాధానం వచ్చింది.

విషి కాస్త తగ్గేడు. "నేనంటున్నది అది కాదు. వాళ్ళు నాతెలివితేటలు గుర్తించలేదు అంటున్నా. నీతప్పు అన్లేదు. నాకెప్పుడూ ఇంతే అవుతోంది. ఎంచేత అని అది నాకెంత అవమానంగా ఉంటుందో ఆలోచించమంటున్నాను."

"This is my moment." అని అరవాలనిపించింది అరవిందకి.. ఎప్పుడు తనసంగతి తను మొదలుపెట్టినా, దాన్ని అతను అతనివిషయంగా మార్చేస్తాడు.

"నీకెప్పుడూ నీగొప్పలే కానీ నాగురించి ఆలోచించవేం?" అన్నాడు మళ్ళీ అతను..

మరో క్షణం ఉంటే బావురుమని ఏడుస్తాడేమోనని భయపడింది అరవింద. చిరాకేసింది. తను ఇంత సంతోషంగా ఉన్నందుకు కనీసం ఈ ఒక్కసారికీ "నాకూ సంతోషంగా ఉంది అనొచ్చు కదా" .... కనీసం సంతోషిస్తున్నట్టు నటించినా బాగుండు.

అసలు తనదే తప్పు. తెలిసి, తెలిసి ఎందుకు అతనికి చెప్పడం? అతనితో బ్రేకప్పు అయిపోయినా ఇంకా ఎందుకు స్నేహంగా ఉండడం? – ఆలోచిస్తూ ఇల్లు చేరుకుంది.

వారంరోజులపాటు సాఫీగానే సాగింది. ఏ గొడవా లేదు. స్కూల్లో అప్పుడప్పుడు కలుస్తూనే ఉన్నారు. విషి మళ్ళీ మామూలుగా, సరదాగా మాటాడుతున్నాడు. బ్రేక్ సమయాల్లో కనిపిస్తే, ఏ కాండీబారో, సోడావో కొనిస్తున్నాడు.

ఇప్పుడు సుందరం పిలిచేవరకూ, మళ్ళీ ఈ విషయం తలెత్తుతుందని అనుకోలేదు.

ooo

నాకు ఏం చెప్పాలో తోచలేదు. అసలు నాకీ దేశంలో అబ్బాయిలూ-అమ్మాయిలూ సంబంధాలూ, వరసలూ అట్టే తెలీదు. జీవితం సగం అయింతరవాత ఇక్కడికి వచ్చేను. ఆ తరవాత కూడా మెయిన్ స్ట్రీంలో కలిసిపోడానికి అట్టే ప్రయత్నాలేమీ చెయ్యలేదు. ఇప్పుడు, నాజీవితం ముప్పాతిక

అయిపోయేక, ఈ చరమావస్థలో, ఈ అరవిందలాటివారి పరిచయాలమూలంగానే కొంచెం కొంచెం తెలుస్తోంది!

అంచేత, నేను చెప్పగలిగిందేమీ లేదు, వినడమే తప్ప. అదే అన్నాను అరవిందతో.

"ఏం చేస్తావయితే?"

"అదే కదా అంటున్నది. మీకిప్పుడు అర్జంటుగా నేను లేకపోయేంత పనేదో ఆ శనివారం తగలాలన్నమాట. అయిదుగంటలకి రమ్మన్నారు. మీరు నాలుగున్నరకి ఫోను చేస్తే చాలు."

నేను నవ్వేను. "బాగుంది. ఏదో కనిపెడతాను. కానీ ఎన్నాళ్ళు అలా తప్పించుకుంటావు. ఎదురు పడి తాడో పేడో తేల్చేసుకుంటే తరవాత ప్రాణం తెరిపిన పడుతుంది కదా," నేను నా అనుభవసారం ప్రయోగించేను. ఇలాటివిషయాల్లో సాధారణంగా నేను అప్పులుంచుకోను మరి!

నాకు మరో అనుమానం వచ్చింది. "మీ అమ్మా, నాన్నా ఏమంటారు?"

అరవింద ఫక్కున నవ్వింది, "బాగా అడిగేరు," అంటూ.

"అదేమిటి? ఎంత అమెరికాలో పెరిగినా, మన సంప్రదాయాలు కూడా బాగానే ఒంట బట్టినట్టున్నాయి కదా. వాళ్ళని కూడా మీకెందుకు అన్నావేమిటి?" అన్నాను అనుమానంగా. నాభయం ఏమిటంటే నేనెంతదూరం వెళ్ళొచ్చూ నాకు కొత్తగా వచ్చిన ఈ మెంటోర్ స్థానంలో అని.

"లేదులెండి. నిజమే నవ్వొచ్చే సంగతి కాదు. ఎందుకు నవ్వేనంటే, ఇదే క్షణంలో - this very moment - అక్కడ మాయింట్లో కూడా మాంచి జోరుగా ఓ చర్చ జరుగుతోంది. మా అమ్మ, నాకింకా 17 ఏళ్ళే కదా, ఇతను కాకపోతే మరోడు వస్తాడు, ఎందుకు ఇప్పట్నుంచీ ఈ లంపటాలు పెట్టుకోడం అంటుంది. మానాన్నకేమో ఇతనిలాటి గొప్ప వరుడు మరి దొరకడని. నేను కూడా అనుకుంటానులెండి ఇలాటి మానవుడు మరొకడు ఉంటాడా అని. అది వేరే సంగతనుకోండి. ఇంతకీ మా నాన్న వాదన మేధావులందరికీ మెదడులో ఒక భాగం ఇనాపరబుల్ అనీ, అది సీరియస్‌గా తీసుకోకూడదనీ."

నాకు ఏం చెప్పడానికీ తోచలేదు. ఇంతచిన్నపిల్ల ఇంత పెద్ద సమస్య ఏమిటి అనిపించింది. మళ్ళీ ఇది కూడా ఈదేశంలో పిల్లలపెంపకంలో భాగమేనా అన్నది నాకర్థం కాలేదు.

"సరే వస్తానండీ."

"ఎక్కడికి వెళ్తావు?"

"ఎక్కడికి? ఇంటికే. మాఅమ్మమ్మయింటికి వెళ్ళొచ్చు కానీ మళ్ళీ మాఅమ్మా, నాన్నా ఆవిడమీద ఎగిరిపడతారు. ఎందుకొచ్చిన గొడవ. నేనే పడితే పోలే."

"పోనీ, ఈరాత్రికి ఇక్కడ ఉండు."

"మీరు గుండెనొప్పో ఏదో తెచ్చుకుంటారా మరి?"

"చూస్తాను, ఏది వీలో."

ఇద్దరం నవ్వుకున్నాం. అరవింద వెళ్ళిపోయినతరవాత కూడా చాలాసేపు ఆ అమ్మాయిగురించే ఆలోచిస్తూ కూర్చుండిపోయేను.

ooo

సుందరం కాఫీ తాగుతూ ఆనాటి న్యూయార్క్ టైమ్స్ చూస్తున్నాడు అరవింద పుస్తకాలషాపులో అడుగు పెట్టేసరికి.

మెల్లిగా వచ్చి పక్క కుర్చీలో కూర్చుంది చిన్నగా నవ్వి, హలో చెప్పి.

"చాల్రోజులైంది చూసి. బాగున్నావా? క్లాసులు ఎలా అవుతున్నాయి? అన్నట్టు, కాఫీ, టీ, … ఏం తాగుతావు?"

అరవింద గబుక్కున లేచింది, "నేను తెచ్చుకుంటాలెండి."

"నో, నో… అలా కాదు. నా ట్రీటు. నేను పిలిచేను కదా. పైగా పెద్దవాణ్ణి." అంటూ సుందరం చనువుగా అరవింద బుజంమీద చెయ్యేసి, కూచోపెట్టి, "ఏంటి?" అన్నాడు.

"ఐస్డ్ టీ"

సుందరం వెళ్ళి టీ తెచ్చేవరకూ, ఆయన వదిలేసిన పేపరు చూస్తూ కూర్చుంది అరవింద..

(ఏప్రిల్ 29, 2011)

మార్పు 17

సుందరం అరవిందకి టీ, తనకి కాఫీ, రెండుకప్పులతోనూ వచ్చి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు. అరవింద టీ అందుకుని థాంక్స్ అంది.

“స్కూల్ ఎలా ఉంది?”

“బాగానే ఉంది?”

“కాలేజీలకి అప్లై చేస్తున్నావా?”

“ఆఁ. ... చూస్తున్నా.”

“ఏ కాలేజీలకి?”

“మ్..మ్.. ఆలోచిస్తున్నా...”

నాటుబండిలా నెమ్మదిగా నడిచింది సంభాషణ నాలుగు నిముషాలు.

ఆఖరికి అసలువిషయంలోకి వచ్చేడు సుందరం.

“విషికి నువ్వంటే చాలా ప్రేమ. నువ్వంటే ప్రాణం. అతనే ఏమిటి, వాళ్ళింట్లో అందరికీ అంతే. ప్రధానంగా విషి మూలానే అనుకో. నువ్వు పక్కనుంటే అతను ఎంతో వృద్ధిలోకి వస్తాడు. నీకా శక్తి ఉంది.”

అరవింద కళ్ళప్పగించి వింటోంది.

సుందరం కొంచెంసేపు ఆగి, “పోనీ, ఇది చెప్పు. నీకు అతనంటే ప్రేమ ఉందా?”

“నాకు అతనంటే ఇష్టం లేదని నేనెప్పుడూ చెప్పలేదు కదా.” అంది అరవింద నెమ్మదిగా.

“అదీ అన్నిటికంటే ప్రధానంగా కావలసింది. మీ యిద్దరికీ ఒకరంటే ఒకరికి ప్రేమ ఉన్నతరవాత, మిగతావి చాలా తేలిగ్గా సమర్థించుకు పోవచ్చు. నేనీమాట అందరికీ చెప్పను. నువ్వు కనక చెప్తున్నా. నీకు కూడా విషిలాగే అద్భుతమైన మేధాసంపత్తి ఉంది కనక చెప్తున్నాను. ఇవాళ ఏదో అన్నాడనీ ఏదో చేశాడనీ పుటుక్కున తెంచేసుకోడం మూర్ఖత్వం. నువ్వు విశాలదృష్టితో విస్తృతపరిధిలో జీవితంగురించి ఆలోచించుకోడం నేర్చుకోవాలి. చిన్న చిన్న అభిప్రాయబేధాలు అందరితోనూ వస్తాయి. ఆమాటకొస్తే ఏ ఇద్దరిమధ్య అయినా రావచ్చు కదా. నీకింకా అనుభవం లేదు కానీ మా సియివోతో నాకు ఎన్ని చిరాకులొస్తాయో తెలుసా తెల్లారి లేస్తే?. అయినా అక్కడే ఎందుకున్నాను అంటే నాకు అక్కడే మంచి భవిష్యత్తు కూడా ఉంది కనక. అవునా మరి. ఈదేశంలో ఛాయిసెస్ ఉన్నాయంటారు. కానీ అది నేను ఉపయోగించుకుని, “నువ్వెంత, నీ ఉద్యోగం ఎంత” అని ఆ ఉద్యోగం వదిలేస్తాననుకో. మరో కంపెనీలో మరోరకం తగువులు రావా?. అలా రెండు మూడు అయేక, ఏమవుతుంది? నా ఫీల్డులో నలుగురిమధ్యా నాపరువు పోతుంది. “వీడితో పడలేంరా బాబూ,” అనుకుని మరింక ఎక్కడా

నాకు నీళ్ళు పుట్టకుండా చేస్తారు. అంచేత నేను కొంత లౌక్యం కూడా ప్రదర్శించాలి. ఇంట్లో అయినా అంతే ఆఫీసులో అయినా అంతే."

సుందరం మళ్ళీ ఆగేడు అరవింద జవాబుకోసం.

అరవిందకి మాత్రం ఏం చెప్పాలో తోచలేదు. ఎక్కడ మొదలు పెట్టడం? ఏం చెప్తే సుందరానికి తన అవస్థ అర్థమవుతుంది? ఆఖరికి "నేను అతనితో స్నేహంగానే ఉన్నాను కదా."అంది

సుందరం చిన్ననవ్వు నవ్వేడు. "ఈదేశంలో అందరూ అందరికీ స్నేహితులే. బజారులో షాపువాడు, ఫోనులో టెలిమార్కెటరూ కూడా బాగున్నారా అంటూ మనయోగక్షేమాలూ అడుగుతారు. నేనంటున్నది అది కాదు. విషికి నువ్వు పరిపూర్ణ సహకారం ఇవ్వాలి. అదొక కమిట్మెంట్. "నాకింకా 17 ఏళ్ళు. ఇప్పడే ఏంటండీ" అనకు. మనవాళ్ళు జాతకాలూ, వంశక్రమాలూ చూడ్డంలోనూ ఇక్కడివాళ్ళు డేటింగ్ అంటూ కలిసి తిరగడంలోనూ పరమార్థం ఏమిటీ? అబ్బాయీ, అమ్మా.యీ ఒకరికొకరు అన్నివిధాలా - మేధలోనూ ప్రవృత్తిలోనూ సరి తూగుతారా, వీళ్ళిద్దరూ ఒకరికొకరు అండగా నిలిచి, జీవితాన్ని సుఖవంతం చేసుకోగలరా లేదా అనే కదా. మనదేశంలో పెద్దవాళ్ళు చేస్తారు. ఇక్కడ పిల్లలే చూసుకుంటారు. వీళ్ల సంస్కృతీ, సాంప్రదాయాలు ఇవీ. ఎటొచ్చీ నువ్వూ, విషి అటూ ఇటూ కూడా చూసుకోవలసి వస్తోంది. తెలుగువాళ్ళం కనక తల్లిదండ్రులు కలగజేసుకుంటారు. అమెరికాలో ఉన్నారు కనక మీరిద్దరూ నిర్ణయాలు చేసుకోడం కూడా. అంచేత డబుల్ డ్యూటీ అన్నమాట."

"అయితే నన్నేం చెయ్యమంటారు?" అంది అరవింద అమాయకంగా మొహం పెట్టి.

"నువ్వు ఆలోచించకుండా అతనితో బ్రేకప్ప చేశావని ఇంత చెప్పడం. చూడు జాగ్రత్తగా, లోతుగా ఆలోచిస్తే నీకే తెలుస్తుంది. విషి నీకు అన్నివిధాలా తగినవాడు. కాలం కలిసొచ్చి మీఇద్దరికీ పరిచయం అయింది. ఇద్దరూ ఇష్టపడ్డారు. ఇప్పడు హఠాత్తుగా అతనితో "నువ్వు నాకక్ఖర్లేదు, ఫో" అంటే అతని మనసెంత గాయపడుతుందో ఆలోచించేవా?"

సుందరం ఖాళీ అయిపోయిన కప్పు తీసుకుని, లేచేడు, "ఒక్క క్షణం" అంటూ. అరవిందకి ఆలోచించుకోడానికి కొంత టైమివ్వాలని అతని ఆశయం. అంత పెద్ద పాఠం ఒక్కసారే చెప్పేస్తే ఝడుసుకుని ఏడుపు మొదలు పెడుతుందేమో అనుకున్నాడతను.

అరవింద ఎదురుగా ఉన్న టైమ్స్ తీసుకుని, పేజీలు తిరగేస్తూ కూర్చుంది. మళ్ళీ అతను వచ్చేలోపున లేచి వెళ్ళిపోదామా అన్న ఆలోచన కూడా వచ్చింది కానీ, ఇంకా అతనేం చెప్తాడో అన్న కుతూహలం కూడా ఉండడంచేత కదల్లేదు.

సుందరం కాఫీకప్పుతో వచ్చి మళ్ళీ మొదలు పెట్టేడు, ''ప్రకృతిసిద్ధంగా ఆడవాళ్ళకీ మగవాళ్ళకీ వ్యత్యాసం ఉంది. శారీరకంగానే కాదు. మానసికంగా కూడా ఆడవాళ్ళలో ఎదుగుదల చాలా త్వరగా జరుగుతుంది. భార్యగా చిన్నదాన్ని ఎన్నుకోడంలో రహస్యం ఇదే. ముసలితనంలో భర్తలకి సేవలు చెయ్యడంకోసం అంటారు కానీ నేనొప్పుకోను. పూర్వకాలపు సంగతి వదిలేద్దాం. ఇప్పుడు ఇద్దరికీ చదువులూ, ఉద్యోగావకాశాలూ కూడా సమంగా ఉన్నప్పుడు అది నిజం కాదనే అనుకోవాలి. అయినా అమ్మాయి చిన్నా, అబ్బాయి పెద్దా అయివుండాలన్న ఆనవాయితీలో అట్టే మార్పులేదు. ఎంచేతంటావు?''

అరవిందకి ఏం చెప్పాలో తోచలేదు. ఈరోజుల్లో అట్నుంచి ఇటు అమ్మాయి పెద్దా అబ్బాయి చిన్నా లేదా అమ్మాయిదే పెద్ద ఉద్యోగం - ఇలాటివి అక్కడా అక్కడా కనిపిస్తున్నాయి కానీ ఇంకా సుందరం చెప్పినట్టు పిల్లవాడు కనీసం రెండు, మూడేళ్ళు పెద్దవాడుగా ఉండేలా చూస్తున్నారు పెళ్ళిచూపులు నామమాత్రంగా జరుపుతున్న సంబంధాల్లో కూడా. తమకంటే తక్కువ చదువో ఉద్యోగమో ఉన్నవాడిని చేసుకోడానికి ఇష్టపడే అమ్మాయిలు చెప్పుకోదగ్గసంఖ్యలో లేరు.

''ఎందుచేతంటే ఆడవాళ్ళు ఎక్కువ తెలివితేటలు గలవారు కాబట్టి. పైకి కనిపించరు కానీ వాళ్ల మేధ అద్భుతం. స్త్రీలు పిల్లల్ని కంటారు కనక వాళ్ళకి పిల్లలతో పేగుసంబంధం ఉంటుంది కనక పిల్లలపెంపకం బాధ్యత వాళ్ళదే అన్నది పాతకాలపు ఆలోచన. నిజానికి స్త్రీలు సూక్ష్మబుద్ధితో పిల్లలమనసులు తెలుసుకుని, వారిని సన్మార్గంలో పెట్టగలరు కనక ఆ గురుతరబాధ్యత వారికి ఒప్పచెప్పేరు. మగవాళ్ళకి అలాటి తెలివితేటలు లేవు కనక బయట మరోరకం బాధ్యతలు నెత్తినేసుకుంటారు. అంచేత ఆ రెండు బాధ్యతలూ సమానమే అయినా స్త్రీలు చెయ్యవలసిందీ, చెయ్యగలిగిందీ ఎక్కువ. అఫ్ కోర్స్, నువ్వూ, విషి కూడా ఇంకా చిన్నవాళ్ళు. కానీ నువ్వు ఆలోచించుకోవలసింది భవిష్యత్తులో ఏం చెయ్యదలుచుకున్నావు?''

ఏదో హరికథ వింటున్నట్టు కూర్చున్న అరవింద ఉలిక్కిపడింది. ''ముందు నాచదువు పూర్తి కావాలి. కెరియర్ తరవాతే మిగతా సంగతులు,'' అంది.

''సరిగ్గా చెప్పేవు. చదువు ముఖ్యం. నీలాగే విషికి కూడా చదువు ముఖ్యం. నీమీద మనసుతో అతను తన చదువుని నిర్లక్ష్యం చేస్తున్నాడు. నీమీద అతనికి గురి ఉంది కనక నువ్వు చెప్తే మళ్ళీ చదువు కొనసాగిస్తాడు. నీకు కూడా కావలిసింది అదే కదా. పోతే పెళ్ళి మాట ఇప్పుడు చెప్పను కానీ ఆవిషయంలో కూడా నువ్వు జాగ్రత్తగా ఆలోచించుకోవాలి. విషికంటే మేధావి నీకు మళ్ళీ దొరుకుతాడా? ఆ కొత్తగా వచ్చేవాడిలో మాత్రం ఏదో ఒక లోపం ఉండదన్న భరోసా ఏమైనా ఉందా

నీకు? సర్దుకుపోవడంలోనే కదా ఉంటాయి తెలివితేటలు. తప్పులు పట్టడానికేముంది. నువ్వు ఏమనిషిని గానీ చూపించు. నేనేదో దోషం చూపగలను... ఇలా అంటున్నానని నువ్వు మరోలా అనుకోకు. జీవితం చూసినవాణ్ణి కనక చెప్తున్నాను. ... అంతెందుకూ.. నేను లీలని పూర్తిగా గౌరవిస్తాను. ఆమెకి పరిపూర్ణ స్వాతంత్రం ఇచ్చేను. ఇచ్చేను అంటే మళ్ళీ తప్పుపడతారు. నేను తనని ఎప్పుడూ ఏ విషయంలో అడ్డు చెప్పలేదు. తను ఏం చేసినా ఎక్కడికి వెళ్ళినా అంతా తనిష్టం. కారు తీసుకుని మిల్వాకీ వెళ్ళిపోతుంది. మినియాపోలిస్ వెళ్ళిపోతుంది. నేను ఒక్కసారి కూడా ఏమిటా తిరగడం అన్లేదు. తను అలా తనకి తానుగా వెళ్ళడం, రావడం అలవాటే కనకనే ఆరోజు తనే ఇంటికి వస్తుందనే అనుకున్నానే కానీ ఒక్కదాన్నీ సినిమాహాల్లో వదిలేశాను అని అనుకోలేదు. ఆతరవాత తనకి మరేవో చికాకులు కలిగి, ఆ విశాలగారితో యదాలాపంగానే అని ఉంటుంది. దానికి ఆవిడ చిలవలూ పలవలూ చేర్చి రచ్చ చేసింది. చెప్పొచ్చేమాట ఏమిటంటే మాయిద్దరికీ ఏవైనా పొరపొచ్చాలు వచ్చినా మేం సర్దుకుపోతాం. మామధ్య అలాటి అండర్‌స్టాండింగు ఉంది. నీకు కూడా అలాటి దృక్పథం ఏర్పడాలి. అదీ నేను చెప్తున్నది. ఏమంటావు?''

అరవింద ''వస్తాను, ఆలస్యమయిపోయింది ఇప్పటికే. అమ్మమ్మ ఎదురు చూస్తూం ఉంటుంది,'' అంటూ లేచి, గబగబా వీధివేపు అడుగులేయసాగింది..

''సరే. బాగా ఆలోచించుకో నామాటలు. కావలిస్తే మళ్ళీ కలుద్దాం. నీకు ఎప్పుడు మాటాడాలనుంటే అప్పుడు పిలు, నానెంబరు నీదగ్గరుంది కదూ,'' అంటున్నాడు సుందరం వెనకనించి.

(మే 10, 2011)